ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 212 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం 1 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

సీఆర్‌పీఎఫ్‌పై ఉగ్ర పంజా

ఐదుగురు జవాన్ల మృతి

పుల్వామాలో ఘోర ఘటన • ఇద్దరు మిలిటెంట్లు ఖతం

శ్రీనగర్, డిసెంబర్ 31: దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సిఆర్‌పిఎఫ్ శిక్షణ శిబిరంపై సాయుధ మిలిటెంట్లు పంజా విసిరారు. ఆదివారం తెల్లవారుఝామున ఆకస్మికంగా దాడులకు తెగబడిన ఘటనలో ఐదుగురు జవాన్లు మృతిచెందారు. మృతుల్లో ఒకరు నౌగం ప్రాంతవాసి సైఫుద్దీన్‌గా గుర్తించినట్టు అధికారులు చెప్పారు. ఈ దాడిలో మరో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని రక్షణ వ్యవహారాల అధికార ప్రతినిధి రాజేష్ యాదవ్ వెల్లడించారు. అవంతి పోరా ప్రాంతంలోని లెత్‌పోరాకు సమీపంలోని 185వ బెటాలియన్ శిక్షణ కేంద్రంపై ఈ దాడి జరిగింది. మిలిటెంట్ దాడులతో అప్రమత్తమైన సిఆర్‌పిఎఫ్ జవాన్లు ప్రతిదాడులు జరిపి ఇద్దరు మిలిటెంట్లను మట్టుబెట్టారు. మరో ఉగ్రవాదీ మృతి చెందినట్టు భావిస్తున్నామని, అయితే మృత దేహం లభించలేదని సిఆర్‌పిఎఫ్ అధికారి ఒకరు వెల్లడించారు. 'ఉగ్రవాదుల ఆకస్మిక దాడిలో ఐదుగురు జవాన్లు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు మిలిటెంట్లు ఖతమయ్యారు. తప్పించుకున్న మరో మిలిటెంట్ ఓ భవనంలో చిక్కుకున్నాడు. అతను కూడా చనిపోయి ఉంటాడని భావిస్తున్నాం' అని రక్షణ వ్యవహారాల అధికార ప్రతినిధి యాదవ్ ఓ వార్తా సంస్థకు వెల్లడించారు. బారెల్ గ్రనేడ్ లాంచర్స్, ఆటోమేటిక్ వెపన్స్‌తో ఆదివారం తెల్లవారుఝామున 2.10 గంటల సమయంలో శిబిరాన్ని చుట్టుముట్టిన మిలిటెంట్లు కవ్వింపులతో సెంట్రీలపై కాల్పులకు దిగారని చెబుతున్నారు. శిబిరంలోకి చొరబడేందుకు మిలిటెంట్లు ప్రయత్నిస్తూ జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని సిఆర్‌పిఎఫ్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇరుపక్షాల మధ్య సుమారు 11 గంటలపాటు భీకరంగా ఎదురుకాల్పులు జరిగాయి. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనపై డీజీపీ ఎస్‌పి వైద్ మాట్లాడుతూ కాశ్మీర్ లోయలోకి మిలిటెంట్లు దిగారన్న సమాచారంతో గత రెండు మూడు రోజులుగా గస్తీలను ముమ్మరం చేశామన్నారు. అయినా, ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు.



మిలిటెంట్ల దాడిలో మృతిచెందిన జవాను సైఫుద్దీన్ అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన స్థానికులు. (ఇన్‌సెట్‌లో) విలపిస్తున్న కుటుంబీకులు



శుభోదయం

శ్రీచాంద్రమాన హేవళంబి సం॥ దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: శుద్ధ చతుర్దశి ఉ.11.14, నక్షత్రం: మృగశిర మ. 3.07; వర్జ్యం: రా.10.56 నుండి 12.25వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 01.12వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు

ఆంగ్లవత్సరాది ఆరంభ సమయాన
అఖిల జనుల క్షేమమరయుచుండి
శుభములంది జనులు సుఖములే పొందగా
అక్షరాలగోరునాంధ్రభూమి

నిజం.. నేనొస్తున్నా!

రాజకీయ అరంగేట్రంపై రజనీకాంత్

ఆధ్యాత్మిక రాజకీయాలు నా లక్ష్యం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం

234 నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులు

అభిమాన సంఘాల బలోపేతానికి పిలుపు

ప్రజాక్షేమం కోరే వాలంటీర్లూ.. కదలిరండి




చెన్నై, డిసెంబర్ 31: ఏడాది అంతంలో తమిళ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. కొంతకాలంగా అంచనాలకే పరిమితమైన రజనీ రాజకీయ పార్టీ ఆవిర్భావ ప్రకటన వెలువడింది. చెన్నైలో వారం రోజులుగా సాగుతోన్న నాటకీయ ఫక్కీకి తమిళ తలైవా తెరదించుతూ, మనసులో మాట ప్రకటించారు. ఆదివారం అభిమానులతో సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీ ఆవిర్భావంపై బహిరంగ ప్రకటన చేశారు. 'నిజం, రాజకీయ పార్టీ పెడుతున్నా' అంటూ సూపర్‌స్టార్ ప్రకటించారు. తన పార్టీపై వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాల్లోనూ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించారు. రాజకీయాల్లో సత్ప్రవర్తన, సుపరిపాలనను ప్రస్తావిస్తూ 'రాజకీయాన్ని సమూలంగా మార్చాల్సిన తరుణం ఆసన్నమైంది' అన్నారు. ఇప్పుడున్న రాజకీయాల స్థానే 'ఆధ్యాత్మిక రాజకీయాలు' రావాలని ఆకాంక్షించారు. 'అదే నా లక్ష్యం, కోరిక కూడా' అంటూనే, అలాంటి రాజకీయ వాతావరణాన్ని తానొక్కడే ఆవిష్కరించలేనన్నారు. అది సాధ్యం కావాలంటే ప్రజాసహకారం ఎంతైనా అవసరమన్నారు. రాచరికంలో శత్రువుల బారినుంచి రాజ్యాలను రాజులు రక్షించేవారని అంటూ, ప్రజాస్వామ్యంలో ప్రజలను రక్షించే బాధ్యత పాలకులదేనంటూ, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించటం లేదన్నారు. కష్టాలను కడతేర్చి, ప్రజా హక్కులను పరిరక్షించే వాలంటీర్ రాజకీయాలు రావాలని ఆకాంక్షించారు. 'బల్లకింద వ్యవహారాలను ఇక ఉపేక్షించేది లేదు. స్వప్రయోజనాల కోసం అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల చుట్టూ తిరిగే కార్యకర్తలు నాకు అవసరం లేదు. అనుక్షణం ప్రజా సంక్షేమానికి పని చేసే సేవకులు రావాలి, నాకు కావాలి' అన్నారు. ఎవరు తప్పుచేసినా - మిగతా 7వ పేజీలో

బాషా, బాబా రజనీ
వేషాలది వేరు తీరు వెండి తెరకదా
ఆషామాషీ కాదిది
వేషమ్మిది రాజకీయ విష సంద్రమునన్

సంక్షోభాలనుంచే సదవకాశాలు

- సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు
- చంద్రన్న మాల్స్ కొత్త ఏడాది కానుక
- పట్టిసీమతో పవిత్ర సంగమ సృష్టి
- ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, డిసెంబర్ 31: గడచిన ఏడాదిలో ముగిసిన ఘట్టాలు, పాలనాపరంగా ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్రం నుంచి రావలసిన నిధులు, పేదల సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని, నిరంతరం ఎదురవుతున్న సమస్యలనే ఒక అవకాశంగా తీసుకుని కొత్త ఏడాదిలో అడుగుపెడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ముగిసిన ఏడాదిలో ప్రజలు, అధికారుల సహకారంతో సాధించిన విజయాలను సింహావలోకనం చేసుకున్నారు. జన్మభూమి కార్యక్రమంతో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతూ తన ముందున్న లక్ష్యాలు, అనుభూతులను లేఖ రూపంలో రాష్ట్ర ప్రజలతో పంచుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర విభజన నుంచి ముగిసిన ఏడాది వరకూ ఎదుర్కొన్న సమస్యలు, సాధించిన విజయాలను ప్రజల దృష్టికి తీసుకొచ్చారు. సంక్షోభాలను సైతం సద్వినియోగం చేసుకున్నవారే అంతిమ విజేతలవుతారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 28వేల చౌక దుకాణాలను చంద్రన్న మాల్స్‌గా మారుస్తున్నట్టు ప్రకటించారు. పంట కుంటలు, రెయిన్ గన్ల వంటి వినూత్న విధానాలతో సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని గుర్తుచేశారు. 'నేను కష్టజీవిని. రాష్ట్ర ప్రగతి, మీ అందరి పురోగతికి భరోసాగా నిలుస్తా. మీ భవితకు బావుటానవుతాన'ని చంద్రబాబు నాయుడు తన లేఖలో ప్రజలకు హామీ ఇచ్చారు.

మీకు భరోసా.. భవితకు బావుటానవుతా!

సీఎం చంద్రబాబు లేఖ పూర్తి పాఠం 2




మొదలైన జనసేన సభ్యత్వ నమోదు

తొలి సభ్యత్వం స్వీకరించిన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదివారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని తానే స్వీకరించారు. అనంతరం పార్టీవర్గాలకు సభ్యత్వ నమోదు పత్రాలు అందించారు. త్వరలో రెండు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపడతామని తెలిపారు. గత మూడు రోజులుగా పార్టీ వర్గాలతో ఇష్టాగోష్ఠి నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు వారికి తెలియజేసి రానున్న రోజుల్లో పార్టీ చేపట్టే ముఖ్య కార్యక్రమాలను వివరించారు. జనసేన పార్టీ కంటెంట్ రైటర్స్, అనలిస్టులుగా పని చేయడానికి ముందుకొచ్చిన వారితో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లో తొలుత నిర్వహిస్తామన్నారు.

ఫన్‌గామా





కొత్త డీజీపీ మాలకొండయ్యకు బాధ్యతలు అప్పగిస్తున్న సాంబశివరావు

శాంతి భద్రతలపై రాజీ పడొద్దు

కొత్త డీజీపీ మాలకొండయ్య ఆదేశాలు

మాజీ పోలీసు బాస్‌కి ఘన వీడ్కోలు

పదవులు అలంకారం కాదన్న సాంబశివరావు

విజయవాడ (క్రైం), డిసెంబర్ 31: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త డీజీపీ ఎం మాలకొండయ్య ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనకు రాష్ట్ర పోలీసు పెద్దలంతా అభినందనలు తెలిపారు. వారితో నిర్వహించిన సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడరాదని మాలకొండయ్య ఆదేశించారు. అంతకు ముందు డీజీపీగా పదవీ విరమణ చేసిన నండూరి సాంబశివరావుకు పోలీసు దళాలు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు శాఖలో తన 33ఏళ్ల సర్వీసులో ఒడిదుడుకులు, అనుభవాలను ప్రస్తావించిన నండూరి సభలో భావోద్వేగానికి లోనయ్యారు. తనకు పదవులు అలంకారం కాదని అన్నారు. డిసెంబర్ 31తో నండూరి సాంబశివరావు పదవీకాలం ముగియడంతో ఆయన రిటైర్డ్‌మెంట్‌ను పురస్కరించుకుని మంగళగిరిలోని ఏపిఎస్‌పి ఆరో బెటాలియన్‌లో పోలీసు శాఖ ఆదివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం - మిగతా 7వ పేజీలో

ప్రధాని పదవిపై ఆశ లేదు


- సివిల్స్‌లో తెలుగుకు పూర్తి అవకాశం కోసం కృషి
- ప్రతిపక్షాలు సభలో ఉండి పోరాడాలి
- ప్రత్యక్ష ప్రసారాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది
- ఫిరాయింపులపై ఒక ఒరవడి తీసుకొచ్చా
- వ్యవసాయం మరిస్తే మనుగడ లేదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో ఉప రాష్ట్రపతి వెంకయ్య



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

విజయవాడ, డిసెంబర్ 31: 'నాకు ప్రధాని పదవిపై ఎప్పుడూ ఆశ లేదు. నేను ఆ పదవికి అర్హుడిని కాను. గుజ్రాల్, దేవెగౌడను తక్కువ చేసి చూడటం తగదు. ఇది నేను కోరుకున్నది కాదు. నేను ఉప రాష్ట్రపతి అవుతున్నానన్న విషయం నా భార్యకూ తెలియదు. 2019 మార్చి తర్వాత రాజకీయాల నుంచి తప్పుకుని ప్రజాసేవలో పాలుపంచుకోవాలనుకున్నా. దానికి దేశ్‌ముఖ్ స్ఫూర్తి. నేను ఈ స్థాయికి రావడానికి కారణం క్రమశిక్షణ. నేనూ రైతుబిడ్డనే. దేశంలో వ్యవసాయం ఇబ్బందుల్లో ఉంది. దాన్ని ఆదుకోకపోతే మనుగడ ఉండదు. ప్రతిపక్షాలు చట్టసభలను అవకాశం చేసుకుని ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేయాలి. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన అంశాన్ని 3 నెలల్లో పరిష్కరించాలి. దానిపై నేనొక ఒరవడి తీసుకొచ్చా. నేనేం ఇచ్చానో చూడండి. కానీ దాన్ని అమలు చేయాలని నేనెలా చెప్పగలను? స్నేహితులయినంత మాత్రాన చెప్పలేం కదా?' అని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. ఆదివారం విజయవాడ రూరల్ ఆత్కూరులోని స్వర్ణ భారతి ట్రస్టులో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశంలో ఎవరికీ తెలియని గుజ్రాల్, కర్నాటకు మాత్రమే తెలిసిన దేవెగౌడ ప్రధాని అయినప్పుడు పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా పనిచేసిన మీకు ప్రధాని కావాలన్న కోరిక ఏర్పడలేదా? లేక అవకాశం లేకనా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. తనకు ఆ పదవిపై కోరిక లేదని, తాను అర్హుడిని కానన్నారు. ప్రతిపక్షాలు సభలోనే ఉండి పోరాడాలని, సమస్యల పరిష్కారానికి చట్టసభలే సరైన వేదిక అన్నారు. రాజ్యసభ ప్రత్యక్ష ప్రసారాలపై అనేక రకాల సూచనలు వస్తున్నాయన్నారు. పదిమందితో కలసి ఉండే తనకు ఈ ప్రొటోకాల్ ఇబ్బందిగానే ఉందని, కానీ అలవాటు పడుతున్నానని నవ్వుతూ అన్నారు. దేశంపై క్యాస్ట్, క్యాష్, కమ్యూనిటీ ప్రభావం మంచిది కాదన్నారు. మీరు ఉప రాష్ట్రపతిగా వెళ్లిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టుల పురోగమనం, నిధుల విడుదలలో ఆలస్యం జరుగుతుందన్న ఆవేదన ఉందన్న ప్రశ్నకు.. పోలవరం, ఇళ్ల నిర్మాణాలపై గడ్కరీ, తోమర్‌ను పిలిపించుకుని మాట్లాడానని, తన స్థాయిలో తెలుగు ప్రజలకు సేవచేయడాన్ని కొనసాగిస్తానన్నారు. పరిపాలనా సౌలభ్యంగా అసెంబ్లీ, సచివాలయం డిజైన్లు ఉండాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాలని మరో ప్రశ్నకు జవాబుగా చెప్పారు. తెలుగులో సివిల్స్ పరీక్ష అంశాన్ని ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకువెళ్లానని, దానిపై చర్చ జరుగుతోందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'నేను హోం మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీకి ఐదేళ్లు పనిచేశా. బహుశా - మిగతా 7వ పేజీలో

మీకు భరోసా.. భవితకు బావుటానవుతా!



సోదరీ, సోదరులారా...

మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కాలగమనంలో కొత్త మజిలీకి చేరాం. ప్రభుత్వ పగ్గాలు చేపట్టి మూడున్నరేళ్లు. 2018కి స్వాగతం చెప్పే ఇంత మంచి తరుణంలో నా ఆలోచనలను మీతో పంచుకుందామని మీకు ఈ లేఖ రాస్తున్నాను.

ఈ 42 మాసాలూ ఒక మహాక్రతువు జరిపాం. మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని మిషన్ మోడ్‌తో పనిచేయించాం. అనితర సాధ్యమైన ఫలితాలు సాధించాం. అనేక అంశాల్లో ఈ రాష్ట్రాన్ని దేశానికే ఒక ఉత్తమ నమూనాగా నిలిపాం. మొన్ననే భారత రాష్ట్రపతి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూసి ఆశ్చర్యపోయి మనల్ని ప్రశంసించి వెళ్లారు. దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీ అందించే ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టును వారి సువర్ణ హస్తాలతో ప్రారంభించుకున్నాం. ఇవాళ ఆంధ్రప్రదేశ్ అంటే ఒక 'హ్యాపెనింగ్ స్టేట్'. ఇప్పుడు మన రాష్ట్రం ప్రపంచంలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మనతో కలిసి పనిచేయడానికి అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి భూమి నలుచెరగుల నుంచి పెట్టుబడిదారులు వెల్లువలా వస్తున్నారు. మన 'అమరావతి' గురించి ప్రపంచం ఎదురు చూస్తోంది. కాలచక్ర భ్రమణంలో ఒకసారి వెనక్కి చూసుకుంటే 1996 నుంచి 2004 వరకు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి మనం బలమైన పునాదులు వేసుకున్నాం. దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగాం. ఆ తరువాత వచ్చిన పదేళ్లకాలం దగాపడ్డ దశాబ్దం. అది చరిత్రకొక చెరగని మచ్చగా నిలిచిపోయింది. 2014లో సహేతుకత లేకుండా సాగిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యాం. 60 ఏళ్లుగా శ్రమించి నిర్మించుకున్న సంస్థలను, సంపాదించుకున్న సంపదను కోల్పోయి, రాజధాని ఎక్కడో తెలియని పరిస్థితుల్లో, కట్టుబట్టలతో, అప్పుల భారంతో దిక్కుతోచకుండా బయటకొచ్చాం.

ఆనాడు అశాస్త్రీయంగా జరిపిన రాష్ట్ర విభజనతో తల్లడిల్లిపోయాం. పెను సంక్షోభంలో పడ్డాం. ఐతే ఆ సంక్షోభంలోనే అవకాశాలను వెతుక్కున్నాం. ఒక ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నాం. మనకు దక్కిన అరుదైన అవకాశంగా భావించి ప్రపంచ శ్రేణి రాజధానిని నిర్మించుకుంటున్నాం. రూ.16వేల కోట్ల బడ్జెట్ లోటు, చిన్నాభిన్నమైన పాలనా వ్యవస్థ, రాజధాని ఎక్కడో తెలియని అనిశ్చితి, అంతటా అయోమయం ఉన్న సంక్షోభ సమయంలో పగ్గాలు చేపట్టి రాష్ట్రాన్ని పట్టాల పైకి ఎక్కించడం అంత సులభమని అనుకోలేదు. ఎదురైన సంక్షోభాన్ని ఎవరైతే సదవకాశంగా మలుచుకుంటారో వారే అంతిమంగా విజేతలవుతారు. ఏనాడైతే కాంగ్రెస్ పాలకులు మన గుండెల్లో కరకు కత్తులు దింపారో ఆనాడు ఒకే ఒక లక్ష్యాన్ని మన ముందుంచుకున్నాం. కసితో కలసికట్టుగా కృషి చేసి ఈ రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. దానికి అవసరపడే కార్య ప్రణాళికల్ని రూపొందించుకుని ముందుకు అడుగులు వేశాం. సుస్థిర ఆర్థిక వృద్ధి లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు మహా సంకల్పం చెప్పుకున్నాం. దాన్ని అడుగడుగునా గుర్తు చేసుకునేందుకు ఏటా నవ నిర్మాణ దీక్ష చేపడుతున్నాం. మనకు ఎదురైన ప్రతి కష్టాన్ని మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నాం. ఆరోజు ఆర్థికంగా ఎంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా రైతు రుణ భారాన్ని భుజానికెత్తుకుని ఉపశమనం అందించాం. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పించన్లను ఐదు రెట్లు పెంచాం. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టడమే కాకుండా స్వల్ప కాలంలోనే మిగులు విద్యుత్ సాధించి, నిరంతర వెలుగులు అందించే రాష్ట్రంగా నిలబడ్డాం. ప్రాథమిక రంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కృషిని ముమ్మరంగా సాగిస్తున్నాం. మునుపెన్నడూ లేనంతగా ఈ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. భూసార పరీక్షలు జరిపించి, సూక్ష్మ పోషకాలు అందిస్తున్నాం. పంటకుంటలు, రెయిన్ గన్లు, మొబైల్ లిఫ్ట్ వంటి వినూత్న పద్ధతుల ద్వారా సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. పెద్దఎత్తున వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టాం. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నాం. సేద్యంలో సాంకేతికత అనివార్యం, అవశ్యం. ఈ దిశగా అగ్రిటెక్ సదస్సు నిర్వహించాం. భూసార పరీక్షలు, విత్తనాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాం. సహజ వనరుల పరిరక్షణలో భాగంగా ఏరువాక, జలసిరికి హారతి కార్యక్రమాలతో పాటు ఇక ఏటా 'సూర్య ఆరాధన' నిర్వహిస్తాం. వరుసగా వచ్చిన గోదావరి, కృష్ణా పుష్కరాలను వైభవంగా నిర్వహించి ఈ పుణ్య నదులతో మనకున్న అనుబంధాన్ని చాటుకున్నాం. రాష్ట్రాన్ని ఉద్యాన కేంద్రంగా మార్చే ప్రణాళికల్ని అమలుచేస్తున్నాం. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు జాతీయ స్థాయిలో 2.5 శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 20.6 శాతం నమోదవ్వడం విశేషం. అది కూడా రాష్ట్రంలో వర్షపాతం గత ఏడాది 30 శాతం, ఈ సంవత్సరం 12.5 శాతం తక్కువగా ఉన్నా ఇలాంటి ఫలితాలు సాధించగలగడం మనకు మరింత ఉత్తేజాన్ని ఇస్తోంది. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 45 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆక్వా హబ్‌గా నిలవడం మనందరికీ గర్వకారణం. మన నేలను సంపూర్ణ కరవు రహిత మాగాణంగా మలచుకోవాలన్న మహత్తర లక్ష్యాన్ని ముందు పెట్టుకుని ముందుకు సాగుతున్నాం. జల వనరులను పెంపొందించడానికి ఈ మూడున్నరేళ్ల సాగిన ప్రయత్నం 'ఈ దశాబ్దపు గొప్ప ప్రజోద్యమం'గా పేరు తెచ్చుకుంది. భూమిపై పడే ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పడుతున్నాం. నీటి పారుదల రంగంలో 'పట్టిసీమ'కు ముందు, పట్టిసీమ తరువాత అని చెప్పుకునేలా ఒక కొత్త శకాన్ని ఆరంభించాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ఫలాలను ఇంకాస్త ముందే అందుకోవాలన్న తపనతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం నేడు కృష్ణాడెల్టా రైతాంగానికి వరప్రదాయినిగా మారింది. మూడేళ్లుగా ఎగువ కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీరు రాకపోయినా కృష్ణా డెల్టాలో 13లక్షల ఎకరాల్లో పంట పండించాం. 'పట్టిసీమ'తో కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం సాధించి 'పవిత్ర సంగమం' సృష్టించాం. రెట్టింపు ఉత్సాహంతో 'గోదావరి- కృష్ణా- పెన్నా' సహా రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం జరిపి 'మహా సంగమం' ఆవిష్కృతం చేయడానికి సన్నద్ధం అవుతున్నాం. దేశ సాగునీటి పారుదల చరిత్రలో ఒక అద్భుతంగా చెప్పదగ్గ పోలవరం ప్రాజెక్టును నిరంతరం, నిశిత పర్యవేక్షణతో శరవేగంగా నిర్మిస్తున్నాం. ఇది రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, వ్యవసాయ స్థిరీకరణకు దోహదపడుతుంది.

దేశంలోనే కాదు, ఈ భూప్రపంచంలోనే అత్యంత శోభాయమానమైన రాజధాని నిర్మాణానికి ఉపక్రమించాం. ప్రపంచ ప్రఖ్యాత రూపకర్తలు అందించిన పరిపాలన నగరపు ఆకృతులకు ఆమోదముద్ర వేశాం. కొత్త ఏడాది ఆరంభంలోనే నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. ప్రజారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వినూత్న పథకాలను తీసుకొచ్చాం. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అవసరమయ్యే వైద్యం, ఆరోగ్య సంరక్షణ చర్యలన్నీ తీసుకుంటున్నాం. ఖరీదైన వైద్యాన్ని సామాన్య, మధ్యతరగతి వారికి అందుబాటులోకి తెచ్చాం. ఏపీని ఒక ఫార్మా హబ్‌గా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రముఖ ఫార్మా కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి.

విద్యా రంగంలో రాష్ట్రాన్ని మేటిగా నిలపాలన్నదే ధ్యేయం. ప్రపంచ శ్రేణి అత్యుత్తమ విద్యకు ఏపీని గమ్యస్థానంగా తీర్చిదిద్దే కృషిలో నిమగ్నమయ్యాం. ఐఐటీ, ఎన్ఐటీ, ఐసర్, నల్సర్, ఎయిమ్స్ వంటి జాతీయ స్థాయి అత్యున్నత విద్యా సంస్థల ఏర్పాటుతో నవ్యాంధ్రప్రదేశ్ నాలెడ్జ్ హబ్‌గా మారుతోంది. ప్రసిద్ధ వైద్య కళాశాలలు అమరావతికి వస్తున్నాయి. ఎస్ఆర్ఎం, విఐటీ వంటి ప్రముఖ విద్యా సంస్థలు ఇప్పటికే తరగతులు ప్రారంభించాయి. పెట్రోలియం, మెరైన్, లాజిస్టిక్ యూనివర్సిటీలు రాబోతున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్నాం. వ్యాపార అనుకూలతలో ప్రపంచ బ్యాంక్ ర్యాంకింగ్స్‌లో తొలి స్థానం సంపాదించాం. పెట్టుబడులకు స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పి ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షిస్తున్నాం. ఆటోమొబైల్ రంగంలో ఇసుజు, కియా, హీరో, అశోక్ లేల్యాండ్, అమరరాజా, అపోలో తదితర దిగ్గజ సంస్థలు వచ్చాయి. వ్యవసాయాధారిత, ఆహార శుద్ధి పరిశ్రమలు వస్తున్నాయి. గుడ్లు, పండ్లు, ఉద్యాన ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉండటం మనకు కలిసి వచ్చే అంశం. వస్త్ర పరిశ్రమ, మొబైల్ పరిశ్రమలు రాష్ట్రానికి పెద్దఎత్తున వచ్చాయి. ఫాక్స్‌కాన్, సెల్‌కాన్, జియోని ఇప్పటికే కొలువుదీరాయి. గూగుల్ ఎక్స్, హెచ్‌సీఎల్ వంటి మేటి ఐటీ సంస్థలు వస్తున్నాయి. విశాఖ, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవకాశం ఉన్న టెక్స్‌టైల్స్, అపెరల్ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం. విశాఖలో రెండు పర్యాయాలు జరిపిన సీఐఐ భాగస్వామ్య సదస్సుల్లో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ముచ్చటగా మూడోసారి ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో నిర్వహించబోయే భాగస్వామ్య సదస్సు అనూహ్య ఫలితాలను అందిస్తుందని ఆశిస్తున్నాం.

మౌలిక సదుపాయాల కల్పనలో చురుగ్గా పనిచేస్తున్నాం. పోర్టులు, ఎయిర్‌పోర్టుల్లో అద్భుతమైన పురోగతి కనిపిస్తోంది. ఇప్పటికే ఆరు పోర్టుల్లో పూర్తిస్థాయి కార్యకలాపాలు సాగుతున్నాయి. మరో 8 ఓడరేవులను అభివృద్ధి చేస్తున్నాం. సముద్ర ఆధారిత వాణిజ్యం పెంపొందించి మన ఆంధ్రప్రదేశ్‌ను 'తూర్పు తీరపు ముఖద్వారం'గా మార్చాలన్నదే ఆశయం. ప్రస్తుతం ఉన్న 6 విమానాశ్రయాలకు అదనంగా మరో 6 విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, ఒక కోస్టల్ ఎకనామిక్ జోన్ రానున్నాయి. విశాఖ- చెన్నై, బెంగళూరు- చెన్నై, బెంగళూరు- కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటుతో ఈ రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారిపోనుంది.

రాష్ట్రంలో నగరీకరణ ముమ్మరంగా జరుగుతోంది. విశాఖ, అమరావతి, తిరుపతి నగరాలను 3 మెగా సిటీలుగా అభివృద్ధి చేస్తున్నాం. మరో 14 స్మార్ట్ నగరాలను రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ 100 శాతం గ్యాస్, విద్యుత్ కనెక్షన్లను అందించాం. గ్రామాల్లో 10,044 కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారులను నిర్మించాం. మరో 3వేల కి.మీల సీసీ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. మూడేళ్ల క్రితం 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో మొదలైన మన ప్రయాణం ఇప్పుడు ఆ రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చింది. సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్, ఇంధన సామర్థ్యం అంశాల్లో భారతదేశానికే ఆదర్శంగా నిలిచాం. విద్యుత్ రంగంలో ఎన్ని పురస్కారాలు ఉంటే అన్ని పురస్కారాలనూ కైవసం చేసుకున్నాం. కర్నూలులో ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ పార్క్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు. త్వరలో 4,600 మెగావాట్ల సౌర, పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాం. యూనిట్ రెండు రూపాయలకే సౌర విద్యుత్ అందించి 'సూర్యోదయ రాష్ట్ర'మనే పేరుకు సార్థకత తీసుకొస్తాం. సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి రంగంలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఏపీతో కలిసి పనిచేస్తుండటం సంతోషదాయకం.

'ఇ-ప్రగతి'తో పాలనలో పారదర్శకత తీసుకొచ్చాం. అన్ని ప్రభుత్వ శాఖలను 100 శాతం కంప్యూటరీకరించాం. మూడవ పారిశ్రామిక విప్లవంలో ఆనాడు ఐటీని బాగా ప్రమోట్ చేశాం. ఇప్పుడు నాలుగో పారిశ్రామిక విప్లవం రోజుల్లో ఐవోటీని విస్తృతంగా వినియోగిస్తున్నాం. 15ఏళ్ల పాటు ప్రతి ఏటా 15శాతం వృద్ధిరేటు సాధించాలన్నదే లక్ష్యం. 80 శాతం ప్రజా సంతృప్తే అంతిమ ధ్యేయం. కుటుంబ వికాసం, సమాజ వికాసం ఇండికేటర్లుగా తీసుకున్నాం. సంతోష సూచికను ముందు పెట్టుకుని పనిచేస్తున్నాం. మహిళా సాధికారత సాధిస్తున్నాం. ప్రతి కుటుంబానికీ నెలకు కనీసం రూ.10వేల ఆదాయం దక్కేలా సంకల్పించాం. రాష్ట్ర ప్రజలకు సామాజిక భద్రత, నీటి భద్రత, ఆహార భద్రత, గ్యాస్ భద్రత కల్పిస్తున్నాం. 45 లక్షల పింఛన్లను ఇస్తున్నాం. పేదవాళ్లు కూడా పండగ చేసుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమైన పర్వదినాల్లో 'చంద్రన్న కానుక'లను అందిస్తున్నాం. 28వేల చౌక ధరల దుకాణాలను 'చంద్రన్న మాల్స్'గా తీర్చిదిద్దుతున్నాం. ఇందులో 500కు పైగా వస్తువులను రాయితీపై అందిస్తాం. రాష్ట్ర ప్రజలకు ఇది నూతన సంవత్సర కానుక. 'చంద్రన్న బీమా'తో కార్మిక కుటుంబాలకు గుండె ధైర్యాన్ని ఇచ్చాం. ప్రభుత్వ ఉద్యోగులకు అండదండగా ఉన్నాం. పెద్దఎత్తున పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణాలతో కొత్త ఏడాది గృహ ప్రవేశాలు చేయించబోతున్నాం.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్ కింద రాష్ట్రంలో 16,36,713 మరుగుదొడ్లను నిర్మించాం. ఇప్పటివరకు 6 జిల్లాలను, 5,746 గ్రామాలను ఓడీఎఫ్‌గా ప్రకటించాం. ఈ ఏడాది మార్చి నాటికి మిగిలిన 7 జిల్లాలను ఓడీఎఫ్‌గా మార్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నాం. ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 కల్లా దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి అత్యున్నత ప్రమాణాలు కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మలచాలన్నది మన విజన్. కొండలను పిండిచేయగల శక్తి మన తెలుగువారికి ఉంది. ఆ శక్తియుక్తులతోనే ఏనాడో వారు ప్రపంచాన్ని గెలిచారు. ఇవాళ అమెరికా సిలికాన్ వ్యాలీలో నివసిస్తున్న తెలుగువారి తలసరి ఆదాయం అక్కడున్న అందరి కంటే ఎక్కువ. మనకు ప్రకృతి ఎంతో ఇచ్చింది. మన పొలాలను సస్యశ్యామలం చేయగల అపారమైన జలరాశి ఈ నేలకు సిరి. సుమారు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం మన సొంతం. విస్తారమైన ఖనిజ సంపద మన ఆస్తి. విద్యా ప్రావీణ్యులైన యువశక్తి మన సైన్యం. చురుకైన మహిళా శక్తి మన బలం. కష్టించి పనిచేసే రైతాంగం మన వారసత్వం. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అమితంగా రాణించగలిగే దక్షత మన స్వభావం. అన్నింటినీ మించి గొప్ప ఆత్మవిశ్వాసం మనకు నిజమైన సంపద. వీటన్నింటినీ సమర్థంగా అనుసంధానం చేసుకోగలిగితే రానున్న 50 ఏళ్లలో తెలుగువారికి ఇక తిరుగులేదు.

రాష్ట్ర ప్రగతే మంత్రంగా నాతోపాటు అడుగులు వేస్తూ మీరంతా ఈ ప్రగతి ప్రస్థానాన్ని ఇలాగే కొనసాగిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. నేను కష్టజీవిని, మన రాష్ట్ర ప్రగతి, మీ అందరి పురోగతి నా నిరంతర ధ్యాస. ఇదే నా వ్రతం. మీ అందరి శ్రేయస్సుకు, సంక్షేమానికి, సర్వతోముఖ వికాసానికి నేను దీక్ష తీసుకున్నాను. మీకు భరోసాగా నిలుస్తాను. మీ భవితకు బావుటానవుతాను. నా జీవితంలో ప్రతి క్షణం మీకే అంకితం. ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ నమూనాగా నిలపాలన్నదే నా ఆకాంక్ష.

సంక్రాంతికి ముందే వచ్చే పెద్ద పండగ 'జన్మభూమి - మాఊరు'. సంక్రాంతి ఊళ్లో జరుపుకునే పండగయితే 'జన్మభూమి - మాఊరు' ఊరికే పండగ. ఈ పండక్కి తెలుగువారు ఎక్కడున్నా రావాలి. వచ్చి సొంత ఊళ్లో సంబరాలు జరుపుకోవాలి. సంతోషంగా ఉండాలి. సొంత గడ్డ రుణం తీర్చుకోవాలి. మీ ఇంటి పెద్దకొడుకుగా ఇది నేనిస్తున్న పిలుపు. జై జన్మభూమి.. జైహింద్.


మీ ముఖ్యమంత్రి

(నారా చంద్రబాబు నాయుడు)

'జన్మభూమి - మా ఊరు'..

సంక్రాంతికి ముందే నవక్రాంతి

★ ప్రపంచంలో ఎక్కడున్నా మీ ఊరి కార్యక్రమంలో పాల్గొనండి
★ రూ. 16వేల కోట్ల లోటుతో మొదలైన ప్రభుత్వం మనది
★ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, డిసెంబర్ 31: సంక్రాంతి కంటే ముందే వస్తున్న నవక్రాంతి 'జన్మభూమి - మా ఊరు' పది రోజులు కొనసాగే పెద్ద పండుగ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగు వారందరికీ ఆయన ఆదివారం ఒక ప్రకటనలో 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మూడురోజుల సంబరమైతే, ఇది 10రోజుల పండుగని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రపంచంలో ఎక్కడున్నా స్వగ్రామాలకు తరలివచ్చి రెండో తేదీ నుంచి ఆరంభం కానున్న జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నూతన సంవత్సరానికి నూతన సంకల్పం తీసుకోవాలని కోరారు. పుట్టిన నేల రుణం తీర్చుకోవాలని, పల్లెల్లో నవక్రాంతులు నింపాలని కోరారు. 16వేల కోట్ల ద్రవ్య లోటుతో నవ్యాంధ్ర ప్రయాణం నలభై రెండు నెలల క్రితం ప్రారంభమైందని, దశాబ్దాలుగా నినాదంగా మోగిన నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా నిజం చేశామని చెప్పారు. కృష్ణానది ఎగువ ప్రాజెక్టుల నుంచి చుక్కనీరు రాని తరుణంలో పట్టిసీమ ద్వారా గోదావరి నదీ జలాలను ప్రకాశం బ్యారేజీకి తీసుకొచ్చామన్నారు. మూడేళ్లుగా కృష్ణాడెల్టాలో పట్టిసీమ గోదావరి జలాలతో రూ. 18వేల కోట్ల విలువైన పంట రైతుల ఇంటికి చేరిందని, గోదావరి సారవంతమైన ఎర్రని నీటితో కృష్ణాడెల్టా రైతులు అధిక దిగుబడులు సాధించారన్నారు. నదుల అనుసంధానం చేసి రైతాంగం కళ్లల్లో ఆనందం చూసి, ఇటీవల ప్రకాశం బ్యారేజీ 60ఏళ్ల ఉత్సవాల్లో పాల్గొన్నందుకు తానెంతో గర్వించానని చెప్పారు. విభజన నాడు 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉందని, నిరంతర విద్యుత్ పథకంతో 3నెలల్లోనే సాధారణ పరిస్థితికి తెచ్చామని, ఏడాదికే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదని ముఖ్యమంత్రి తెలిపారు. సమన్యాయం లేకుండా, అశాస్త్రీయంగా జరిగిన విభజనతో ఆరు దశాబ్దాల కష్టం వృథా అయ్యిందని, అయినా కోలుకొని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఏడాదిన్నర లోగానే వెలగపూడిలో సచివాలయం నిర్మించి, ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకొచ్చి సొంతగడ్డ నుంచి పాలన ప్రారంభించామని గుర్తుచేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాల భూసమీకరణ చేశామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో నెంబర్ వన్ ర్యాంక్ సాధించిందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించామన్నారు. ఆర్థికంగా ఒడిదుడుకుల్లో ఉన్నా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణ ఉపశమనం అమలు చేశామని, 45 లక్షల వరకు సామాజిక పింఛన్లు అందజేస్తున్నామని శరవేగంగా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతర శ్రమతో, పటిష్ట వ్యూహంతో ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ, డీఏ బకాయిలు

◆ ఆర్థిక మంత్రి యనమల

ఆంధ్రభూమి బ్యూరో



భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు యనమల, చినరాజప్ప

కాకినాడ, డిసెంబర్ 31: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ, డీఏ బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఉద్యోగుల ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ఎన్జీవో నేతలు తనను కలిశారని, త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి, బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగరంలో సుమారు రూ.10 కోట్లతో నిర్మించనున్న ఆర్థిక శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలసి యనమల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి యనమల మాట్లాడుతూ రానున్న సంక్రాంతిని పురస్కరించుకుని ఉద్యోగులకు ముందుగా ఓ విడత డీఏ చెల్లిస్తామన్నారు. రాష్ట్రంలో 28 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పోలవరం నిర్మాణానికి అదనంగా రూ.1250 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు రూ.1650 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మిస్తామని, దీనివలన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి రాయలసీమ వరకు వ్యవసాయపరంగా అభివృద్ధి పెద్ద ఎత్తున సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో ఆర్థిక శాఖ భవనాలు సుమారు రూ.80 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్నామని, మరో 66 సబ్-ట్రెజరీ కార్యాలయాలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి యనమల తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ఆర్థికపరమైన కార్యకలాపాలు సాగించే అన్ని రకాల కార్యాలయాలు ఒకే భవన సముదాయంలో ఉండేలా నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా ట్రెజరీ, ఆడిట్, ఎపిజిఎల్ఐ, అసిస్టెంట్ పిఎఓ వంటి కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఆర్థిక శాఖకు స్వంత భవనాల్లేవని, ఆ కొరత ఈ భవనాలతో తీరనుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 40వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఏప్రిల్ 1నుంచి రాష్ట్ర ప్రభుత్వ లావాదేవీలన్నిటినీ సిఎఫ్ఎంఎస్ ద్వారా అమలుచేస్తామన్నారు. ఈ విధానం ద్వారా ఉద్యోగుల జీతభత్యాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులు, కాంట్రాక్టర్ల లావాదేవీలను ట్రెజరీల ద్వారా కాకుండా నేరుగా ఆయా వ్యక్తులకు చేర్చే విధానాన్ని చేపడతామని వివరించారు. ప్రభుత్వ పనులకు సంబంధించి ఏ చెల్లింపులైనా ఆయా చెల్లింపుదార్ల ఖాతాలకు నేరుగా వెళ్ళడం వలన దళారుల ప్రమేయం ఉండదని మంత్రి యనమల చెప్పారు. శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు.

రాజకీయ పోరాటాలతోనే పోలవరం సాధ్యం

★ సీపీఐ నేత నారాయణ

విజయవాడ (కార్పొరేషన్), డిసెంబర్ 31: రాజకీయ పోరాటాలతోనే పోలవరం ప్రాజెక్టును సకాలంలో నిర్మించుకోగలమని, గత మూడున్నరేళ్లుగా కాలయాపన చేసిన కేంద్రం ఇప్పుడు హడావుడి చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. ఆదివారం ఉదయం ఇక్కడి రాష్ట్ర పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం ఏపీ అభివృద్ధి చెందకుండా అడ్డుపడటంలో బీజేపీ మొదటి ముద్దాయిగా నిలుస్తుందని విమర్శించారు. పోలవరం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. దక్షిణాదిలో ఓట్లు రావని తెలిపోయినందున బీజేపీ రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులను నిలిపివేయడమే కాకుండా ఇంకా 65వేల ఎకరాలన భూమిని సేకరించాల్సి ఉందని, 2019 నాటికి పోలవరం పూర్తి చేయడం సాధ్యం కాదన్న విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తెచ్చామన్నారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ చిక్కుముడులు వీడేవరకూ ఈ ప్రాజెక్టు ముందుకు సాగదన్నారు. వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. రాజధాని నిర్మాణం, ఉత్తరాంధ్ర, రాయలసీమలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, లోటు బడ్జెట్ భర్తీ, ప్రత్యేక తెలంగాణ, పోలవరం ప్రాజెక్టుపై తాము నాడు, నేడు ఒకే మాటకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్‌డీఐ చట్టం అమలులోకి వస్తే సామాన్యులకు కష్టాలు తప్పవని, ఈ చట్టంతో బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో దాచుకున్నవారికి ఆయా మొత్తాలపై అధికారం ఉండదన్నారు. వేలాది కోట్ల రూపాయల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన కార్పొరేట్ సంస్థలను కాపాడేందుకే ఈ బిల్లును తీసుకొస్తున్నారన్నారు. కేరళలో ఏప్రిల్ 25 నుంచి 29 వరకూ జరిగే సీపీఐ జాతీయ మహాసభల్లో ఎఫ్ఆర్‌డీఐ, మతోన్మాదం, సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు, తదితర ప్రజావ్యతిరేక విధానాలపై సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని నారాయణ వివరించారు. విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా, నగర కార్యదర్శులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌తో వైసీపీ ఆటలు

• లేఖలతో అభివృద్ధికి ఆటంకాలు • టీడీపీ నేత దినకర్ ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: 2017వ సంవత్సరం అభివృద్ధి, సంక్షేమం ప్రాధాన్యతలతో దూసుకెళ్లిన శ్రేయోరాజ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే పునాదులు వేసి 2018కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దశ, దిశా నిర్దేశించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి ప్రపంచ ఖ్యాతిని చాటేవిధంగా ఇప్పటికే తుది డిజైన్లు పూర్తికావడం, అమరావతి నుండి దిగ్విజయంగా పాలన కూడా సాగుతోందన్నారు. ముఖ్యంగా 2015-17 మధ్య నీటి ప్రాజెక్టులకు ఇచ్చిన ప్రాధాన్యతతో పట్టిసీమ, తోటపల్లి, మచ్చుమర్రి, గండికోట, పైడిపాలెం పూర్తితో సాగు, తాగునీటి ఫలా లు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాయన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో దేశంలోనే అత్యధిక వృద్ధి ఆంధ్రప్రదేశ్ నమోదు చేసిందని గుర్తుచేశారు. 2018లో పూర్తిస్థాయిలో గాలేరు - నగరి, హంద్రీ - నీవా చివరి దశ పనులు, పురుషోత్తపట్నం, వెలుగొండ లాంటి మేజర్, మైనర్ 28 ప్రాజెక్టులను పూర్తిచేసి అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని సుసాధ్యం చేయనున్నారన్నారు. పోలవరం హెడ్ వర్క్సుకు సంబంధించి 51 శాతానికి పైగా 2017లో పూర్తి చేశారన్నారు. 2018 నాటికి గ్రావిటీతో నీరు ఇవ్వాలనే సంకల్పంతో చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. దానికి కేంద్రం సహాయ, సహకారాలు కూడా సరైన సమయంలో ఆలస్యం కాకుండా అందించాలన్నారు. పింఛన్లు అర్హులందరికీ ఇప్పటికే ఇస్తున్నామని, 2018కి కొత్తగా వచ్చే అర్హులందరికీ ఇస్తారని, హిజ్రాలకు కూడా ఇస్తూ వారిని ఆదుకుంటామని తెలిపారు. 2017 అంతా వైఎస్సార్సీ నాయకులు అబద్ధాల ప్రచారాల, అభివృద్ధి నిరోధక సంవత్సరంగా కొనసాగించారని విమర్శించారు. గడచిన సంవత్సరంలో జగన్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా అసెంబ్లీకి తాను రాకుండా, సహచరులనూ రానివ్వకుండా నిర్ణయం తీసుకొని ఎమ్మెల్యేల హక్కులను కాలరాసిన వాడిగా మిగిలిపోయారన్నారు. లేఖలతో అడుగడుగునా అభివృద్ధి నిరోధకులుగా పోలవరాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని, ఉపాధి హామీ కూలీల కడుపు కొట్టారని, పోలవరం సహాయ, పునరావాసం జరగకూడదని ప్రయత్నించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు చేసే అభివృద్ధి, సంక్షేమానికి కనీసం 2018లో అయినా అడ్డు పడవద్దని జగన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

2017.. నారావారి నేరాల సంవత్సరం

◆ తులసిరెడ్డి విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: 2017 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నారావారి నేరాల సంవత్సరంగా పేర్కొనడం సబబుగా ఉంటుందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిన్నటిరోజు డీజీపీ సాంబశివరావు విడుదల చేసిన 2017 వార్షిక నేర గణాంక నివేదిక ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. ఆ నివేదిక ప్రకారం 2016తో పోలిస్తే 2017లో మొత్తం నేరాలు 27.43 శాతం పెరిగాయన్నారు. 2016లో నమోదైన మొత్తం నేరాలు 95వేలు కాగా, 2017లో లక్షా 17వేలు నేరాలు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. సైబర్ నేరాలు 46.38 శాతం పెరగడం ఆందోళనకరమన్నారు. 2016లో 713 కాగా 2017లో 1051 అపహరణలు, అత్యాచారాలు వుండగా, మహిళలపై జరుగుతున్న నేరాలు 4.36 శాతం పెరిగాయన్నారు. 2016లో ఇవి 12,931 కాగా 2017లో 13,495కి చేరాయని గుర్తుచేశారు. ఇన్నాళ్లూ చంద్రబాబు పాలన అవినీతికి, అసమర్థతకు, అబద్ధాలకు, అప్పులకు చిరునామా కాగా ప్రస్తుతం నేరాలకు కూడా నెలవు కావడం శోచనీయమన్నారు. కనీసం 2018లోనైనా ఈ రుగ్మతల నుంచి రాష్ట్రం బయటపడాలని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తున్నట్టు తులసిరెడ్డి పేర్కొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలు

ముత్తుకూరు, డిసెంబర్ 31: నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టులో గత మూడు రోజులుగా జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ దేశాలకు చెందిన 160 మంది సెయిలర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సెయిలింగ్ పోటీలకు సంబంధించి తుది ఫలితాల వివరాలిలా ఉన్నాయి. లేజర్ 4.7 విభాగంలో ఒకటో స్థానం హర్షిత్ టామర్ (ఇండియా), రెండో స్థానం సమ్ సుర్నాద్రి (ఇండియా), మూడో స్థానం టి సిక్రీస్ (ఇండియా), లేజర్ రేడియల్ విభాగంలో ఒకటో స్థానం విష్ణు శరవణన్ (ఇండియా), రెండవ స్థానం టాయ్ స్టెఫినిక్ (కెనడా), మూడో స్థానం గోవింద్ బైరాగి (ఇండియా) దక్కించుకున్నారు. లేజర్ 420 విభాగంలో అనన్య శేషన్ (ఇండియా), రెండో స్థానం భరత్ (ఇండియా), మూడో స్థానం పుణిత్‌కుమార్ సాహు (ఇండియా), ఆర్టిమిస్ విభాగంలో 1వ స్థానం రామ్‌డాన్ టీత్ (ఇండోనేషియా), రెండవ స్థానం అలెగ్జాండర్ సాదిన్ (స్వీడన్), మూడవ స్థానం ఇ దుర్గాప్రసాద్ (ఇండియా), ఆర్టిమిస్ గ్రీన్ విభాగంలో ఒకటో స్థానం భౌతిమల్ల సచిన్ (ఇండియా), రెండో స్థానం పి విశ్వనాథ్ (ఇండియా), మూడవ స్థానం ఆర్యాన్ ఆనంద్ (ఇండియా) దక్కించుకున్నారు. మొత్తమ్మీద ఈ సెయిలింగ్ పోటీల్లో ఇండియా సెయిలర్లు అధిక స్థానాలను కైవసం చేసుకున్నారు.

జగన్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలు

మంత్రి దేవినేని ఉమా ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: ప్రజల తరపున ప్రశ్నించే అధికారం ప్రజలు ఇస్తే, రాజ్యాంగంపై గౌరవం లేకుండా శాసనసభకు హాజరుకాకుండా, ఉత్తరకుమారుని ప్రగల్భాలు పలుకుతున్నారంటూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఆదివారం మంత్రి తన కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 2009 సెప్టెంబర్ 2న పోలవరం స్పిల్‌వే, ఎర్త్‌డ్యామ్ పనుల కోసం, పవర్ ప్రాజెక్టు కొట్టెయ్యడానికి చేసిన కుతంత్రాల గురించి జగన్‌ను అడుగుతున్నానని, వాటికి జవాబులు చెప్పాలన్నారు. 16 నెలలు జైలులో ఉన్న వ్యక్తి దొంగే దొంగా.. దొంగా అని అరుస్తున్నారన్నారు. తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై పెద్దఎత్తున నిరాధార ఆరోపణలు చేయడం బదులు, తనపై ప్రత్యక్షంగా ఆరోపణలు చేయకుండా చిట్‌చాట్‌గా మాట్లాడటం అతని వ్యక్తిత్వాన్ని తెలుపుతోందన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ద్వారా పోలవరం పనులు ఆపడానికి నిరంతరం కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. 1991లోనే పోలవరం నిర్మాణం కోసం రాష్ట్రం కలలు కన్నదని, ఇప్పటికి పోలవరానికి ఒక రూపం తేగలిగామన్నారు. 2018, 2019 సంవత్సరాలను లక్ష్యంగా నిర్దేశించుకుని వెళుతుంటే కాంగ్రెస్ పార్టీ 7 ముంపు మండలాల్లో ఇప్పుడు పాదయాత్ర తలపెట్టిందని మంత్రి ఉమా ఎద్దేవా చేశారు.

తెలుగు ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: రాష్ట్ర ప్రజలకు, దేశంలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ వివిధ పక్షాల నేతలు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు ఆదివారం ఇక్కడ వేర్వేరు ప్రకటనల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2018లో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోభివృద్ధిలో పయనించాలని ఆకాంక్షించారు. తెలుగువారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్, శాసన సభాపతి కోడెల శివప్రసాదరావు, శాసన మండలి చైర్మన్ ఎన్ఎండీ ఫరూఖ్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, రాష్ట ఉప ముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు నారా లోకేష్, కళా వెంకట్రావు, యనమల రామకృష్ణుడు, శిద్దా రాఘవరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పితాని సత్యనారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

పండుగలా యాసంగి

తెలంగాణలో నేటి నుంచి నిరంతర విద్యుత్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: తెలంగాణ రాష్ట్రంలో 'యాసంగి' పంట రైతులకు ఆనందం తెస్తోంది. 2018 జనవరి 1నుండి వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేసేందుకు నిర్ణయించడమే ఇందుకు కారణం. దేశంలో ఏ రాష్ట్రం కూడా సేద్యానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్న దాఖలాలు లేవు. తెలంగాణ రైతాంగానికి కొత్త సంవత్సరం కానుకగా ప్రభుత్వం 24 గంటల పాటు ఉచిత విద్యుత్తు ఇస్తోందని చెప్పుకోకతప్పదు. రాష్ట్రంలో 23 లక్షల బావులు, బోర్‌బావులకు విద్యుత్తు మోటార్లు ఉన్నాయి. ఇప్పటి వరకు సేద్యానికి రోజూ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా జరిగేది.

కాంగ్రెస్ హయాంలో సేద్యానికి కేవలం ఏడు గంటలు మాత్రమే ఉచిత విద్యుత్ సరఫరా చేశారు. తర్వాత మరో రెండుగంటలు కలిపి తొమ్మిది గంటల పాటు సేద్యానికి కరెంట్ ఇస్తున్నారు. ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా జరిగే సమయాల్లో రైతులు ఇతర వ్యాపకాలేవీ పెట్టుకోకుండా పొలాల్లోనే ఉండాల్సి వచ్చేది. కరెంట్ సరఫరా జరిగిన సమయాల్లోనే పంట పొలాలకు నీటిని ఇచ్చేందుకు మోటార్లను ఉపయోగించాల్సి వచ్చేది.

రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనం

తిరుపతి, డిసెంబర్ 31: తిరుమలలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రెండు రోజులు కలిపి రికార్డుస్థాయిలో 1.75 లక్షల మంది భక్తులకు టీటీడీ వైకుంఠ ద్వారదర్శనం కల్పించింది. ఈనెల 29న వైకుంఠ ఏకాదశినాడు తిరుమల మొత్తం భక్తులతో నిండిపోయింది. ఏకాదశినాడు 74,012 మంది వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. ద్వాదశినాడు మునుపెన్నడూ లేనివిధంగా 1,01,246 మంది భక్తులు వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించారు. ఈ రెండు రోజుల్లో 1,75,258 మంది భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం కల్పించి టీటీడీ సరికొత్త రికార్డును సృష్టించింది.

24న శ్రీవారి ఆలయంలో రథసప్తమి

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 24న సూర్యజయంతిని పురస్కరించుకుని రథసప్తమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ పిఆర్వో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి పర్వదినాన స్వామివారు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగే కారణంగా రథసప్తమిని ఒక్కరోజు బ్రహ్మోత్సవాలు, ఉప బ్రహ్మోత్సవాలుగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత వాహనాలపై విహరించడంతోపాటు చక్రస్నానం అనంతరం కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.



నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ తూర్పు గోదావరి జిల్లా కడియం పల్ల వెంకన్న నర్సరీలో మొక్కలతో ఏర్పాటుచేసిన ఆకృతి ఇది. మేకిన్ ఇండియా 2018 స్టార్ట్ అంటూ సందేశాన్ని ఇందులో నెలకొల్పారు.

ఇది 'ప్రకృతి సేద్య' నామ సంవత్సరం

- ప్రతి రైతు భాగస్వామి కావాలి
- వ్యవసాయ రంగ మార్పులతోనే సుస్థిర అభివృద్ధి: ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, డిసెంబర్ 31: నూతన సంవత్సరాన్ని రాష్ట్రానికి ప్రకృతి సేద్య నామ సంవత్సరంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సుప్రసిద్ధ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ నేతృత్వంలో రాష్ట్రంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రాన్ని ప్రకృతి సేద్య రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ నెల 8 వరకు వివిధ జిల్లాల రైతులకు శిక్షణనిస్తున్నట్లు వివరించారు. శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 8వేల మంది రైతులతో పాటు తెలంగాణ నుంచి మరో 500 మంది రైతులు వచ్చారన్నారు. మహారాష్ట్ర విదర్భలో పాలేకర్ అందించిన సేవలు రాష్ట్ర రైతులకు అందాలన్నారు. రైతులతో పాటు ఈ కార్యక్రమానికి 300 మంది ప్రొఫెషనల్స్ హాజరయ్యారని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సేద్యానికి ఇకపై రాష్ట్రం ఒక వేదిక కావాలన్నారు. ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రకృతి వ్యవసాయం ఉపకరిస్తుందని తెలిపారు. గత ఏడాది రాష్ట్రంలోని 700 గ్రామాల్లో 40వేల మంది రైతులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారని వివరించారు. 2017-18లో 972 గ్రామాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోందన్నారు. పైసా పెట్టుబడి లేకుండా లక్షన్నర ఎకరాల్లో ఈ విధానం ద్వారా రైతులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతులు క్రిమిసంహారక మందుల ద్వారా 5వేల కోట్లు ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నారని నూతన విధానం వల్ల హాని జరగదన్నారు. ప్రతి రైతుకు ప్రోత్సాహాన్ని అందించి వ్యవసాయం లాభసాటి కావటానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని, వ్యవసాయరంగంలో పెనుమార్పులు సంభవిస్తేనే సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవనశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఐదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ 700 కోట్లతో 12.5 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం అవలంబించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఇందుకు అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ రూ 100 కోట్లు అందిస్తోందని తెలిపారు. దేశ, విదేశీ సంస్థలు సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చాయన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా ఉత్పత్తి అయిన పంటలకు రైతు బజార్లు, చంద్రన్న విలేజిమాల్స్, చౌక ధరల దుకాణాలలో విక్రయించే వీలు కల్పిస్తామన్నారు. పద్మశ్రీ సుభాష్ పాలేకర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు ఈ విధానాన్ని అమలులోకి తెచ్చామన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణ ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సేద్యంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు ఇందులో భాగస్వామి అయితే రానున్న మూడేళ్ల కాలంలో ప్రకృతి వ్యవసాయానికి ఏపీ కేంద్ర బిందువు కాగలదన్నారు. భారత్‌లో మారిషస్ హైకమిషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ దక్షిణాఫ్రికాలో ప్రకృతి సేద్యాన్ని పకడ్బందీగా అమలు చేయటంలో మారిషస్ ముందంజలో ఉందన్నారు. శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, రాష్ట్ర మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, కలెక్టర్ కోన శశిధర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, వ్యవసాయ శాఖ సలహాదారు విజయకుమార్, మేఘాలయ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, శాసనమండలి విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆహార కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరి జవహర్‌లాల్, ఎమ్మెల్యేలు రావెల కిషోర్‌బాబు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, గుంటూరు వ్యవసాయశాఖ జెడి విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపులపై చర్యలు తీసుకునే వరకూ అసెంబ్లీకి వెళ్లం

వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబు: వైసీపీ సీనియర్ నేత బొత్స

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, డిసెంబర్ 31: వైసీపీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, వారికి మంత్రివర్గంలో స్థానం కల్పించిన టీడీపీ ప్రభుత్వ చర్య అత్యంత హేయమని, వారిపై ఫిరాయింపుల చట్ట ప్రకారం చర్యలు తీసుకునేంత వరకూ వైసీపీ అసెంబ్లీలో అడుగుపెట్టదని ఆపార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టి చట్టసభల ప్రతిష్ఠను చంద్రబాబు భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు మంత్రులుగా చట్టాలను రూపొందించడం ద్వారా చట్టసభల గౌరవాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను అపహాస్యం చేసే విధంగా పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అనుసరిస్తున్న పలు చట్టాలకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లుపొడుస్తోందని విమర్శించారు. రైతుల అనుమతి లేకుండా భూ సేకరణ చేయకూడదని చట్టం చెబుతుంటే, రాష్ట్రంలో రాజధాని భూ సమీకరణ పేరిట సవరణలు తీసుకువచ్చి రైతుకు తీరని అన్యాయం చేశారన్నారు. అలాగే రాజధాని నిర్మాణంలో స్విస్ ఛాలెంజింగ్ విధానం అమలు అంగీకారం కాదని కేంద్ర చట్టాలు స్పష్టం చేస్తుండగా, ప్రభుత్వం సవరణల ద్వారా ముందుకెళ్తోందన్నారు. చట్టాలకు సవరణలు చేస్తూ అరాచక విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆరోపించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టును టీడీపీ ప్రభుత్వం కేవలం కమిషన్ల ప్రాజెక్టుగా భావిస్తోందని బొత్స మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి తన జీవిత ధ్యేయంగా చెప్పుకుంటున్న చంద్రబాబు 1995 నుంచి 2004 వరకూ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఏం చేశారని ప్రశ్నించారు. అప్పట్లో కేంద్రంలో ప్రధాన మంత్రులను ఎంపిక చేశానని, కీలకంగా వ్యవహరించానని ప్రచారం చేసుకునే చంద్రబాబుకు పోలవరం ఎందుకు గుర్తుకు రాలేదన్నారు. అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే పోలవరం ప్రాజెక్టు కల సాకారమైందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పోలవరం ప్రాజెక్టుకు రూ.4,500 కోట్లు వెచ్చించారని గుర్తు చేశారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ముఖ్యనేత బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం జిల్లాలో ఆరు లైన్ల హైవే!

రూ. 1800 కోట్లతో అభివృద్ధి, విస్తరణ: ఎంపి రామ్మోహన్‌నాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, డిసెంబర్ 31: భారత ప్రభుత్వం జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు రూ. 1800 కోట్లు మంజూరు చేసి, రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకూ హైవే-16 అభివృద్ధి, విస్తరణ, స్ట్రక్చర్ల నిర్మాణ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మరో రెండు జాతీయ రహదారులుగా గుర్తించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలు వచ్చే ఏడాదిలో కార్యరూపం దాల్చేనున్నట్టు తెలిపారు. డోల-పోలాకి-నౌపడ-పూండి కనెక్టివిటీగా తీరం వెంబడి కలిగిన రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి, అభివృద్ధి, విస్తరణ నిర్వహించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతోపాటు తాను కలిసి ప్రతిపాదనలు ఇచ్చామని చెప్పారు. అలాగే కళింగపట్నం-పార్వతీపురం రహదారిని కూడా జాతీయ రహదారిగా మార్పుచేయాలంటూ కేంద్ర రహదారుల శాఖ మంత్రిని కోరినట్టు రామ్మోహన్‌నాయుడు వివరించారు. ప్రస్తుతం రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకూ గల నేషనల్ హైవే-16లో రణస్థలం నుంచి జమ్ము (నరసన్నపేట) వరకూ రూ. 1200 కోట్ల రూపాయలతో ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం పనులు ప్రారంభించిందని, జమ్ము నుంచి ఇచ్ఛాపురం వరకూ గల హైవేలో పలు వంతెనలు, కాల్వల నిర్మాణాలతోపాటు రోడ్డు విస్తరణకు కావల్సిన స్టక్చర్స్ నిర్మాణాలకు మరో రూ.600 కోట్లు కేటాయించినట్టు ఎంపీ తెలిపారు. రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకూ రాబోయే ఏడాదిలో హైవే పూర్తిస్థాయిలో ఆరులైన్లుగా మారుతోందని, దీంతోపాటు మరో రెండు నేషనల్ హైవేలుగా తీరం వెంబడి రహదారితోపాటు, ఆంధ్రా-ఒడిశాను కలిపే కళింగరోడ్డును హైవేగా మార్చేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేస్తే రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా మరింత ప్రగతిపథంలోకి చేరి, వాణిజ్య, వ్యాపార రంగాల్లో అగ్రస్థానంలో నిలిచేందుకు ఆస్కారం ఉంటుందన్న ఆశాభావాన్ని రామ్మోహన్‌నాయుడు వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విశాఖపట్నంలో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు కోసం ఇటీవలే ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశపెట్టానని, దీనిని మోదీ సర్కార్ ఆమోదించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ బిల్లు వల్ల రైల్వేజోన్ కోసం ఓటింగ్ నిర్వహించడం, చర్చ సాగడంతో రాష్ట్ర ప్రజల మనోభావాలు పార్లమెంటులో విన్పించేందుకు తనకు అవకాశం దక్కిందన్నారు.



వంశధార నిర్వాసిత కాలనీకి మహర్దశ

వంశధార నిర్వాసితుల త్యాగాల ఫలితంగానే ప్రాజెక్టు పనులు సాగుతున్నాయని, వచ్చే ఏడాది మార్చి నాటికి వంశధార ప్రాజెక్టు ప్రజలకు అంకితం ఇస్తామని ఎంపీ రామ్మోహన్‌నాయుడు తెలిపారు. వంశధార ద్వారా 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు, రెండు పంటలు అన్నదాతలు వేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కాలనీలకు ఎంపీ నిధుల నుంచి ప్రతీ గ్రామానికి రూ. 10 లక్షలు అభివృద్ధి కోసం వచ్చే ఏడాదిలో విడుదల చేస్తానంటూ రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు.

ముందే ముంచేశారు!

- సాగునీటి చెరువులు పూడ్చేశారు
- 'పోలవరం' నిర్వాసితులకు అంతులేని కష్టాలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, డిసెంబర్ 31: పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో సాగుపై ఆధారపడి జీవించే నిర్వాసితులను అధికార యంత్రాంగం ముందే ముంచేసింది. ముంపు ప్రాంతాల్లో అభివృద్ధి పదేళ్ల ముందే నిలిచిపోయింది.. ఉపాధి హామీ పనులు ఇవ్వకపోవడం నుంచి కనీస మౌలిక సదుపాయాలు కూడా ఈ గ్రామాల్లో కొరవడ్డాయి. ప్రధానంగా ముంపు ప్రాంతాల్లోని సాగు నీటి చెరువులను ముందుగానే పూడ్చేయడంతో భూమికి భూమి ఇవ్వక ముందే పంటలు లేక నిర్వాసిత రైతులంతా ముందే మునిగిపోయారు. కావాలని చేశారో, యాధృచ్ఛికమో తెలియదుగానీ అధికారుల లెక్కల్లో ఈ గ్రామాలను ఎపుడో ఖాళీ చేయించేసినట్టుగా తెలుస్తోంది. మొదటి విడతలో పోలవరం హెడ్ వర్క్సు పరిధిలోకి వచ్చే గోదావరి ఎడమ గట్టు వైపు ఏడు గ్రామాలను తరలించాల్సి వుంది. దేవీపట్నం మండలం పి గొందూరు, నేలకోట, అంగుళూరు, నాగళ్ళపల్లి, పరసరపాడు, బోడుగూడెం, రావిలంక గ్రామాలను ఖాళీ చేయాల్సివుంది. అయితే పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణం నిమిత్తం అంగుళూరు గ్రామ సమీపంలోని బాబోజీచెరువును పదేళ్ల క్రితమే పూడ్చేశారు. దీంతో 2006 నుంచే ఈ ప్రాంతంలో సుమారు 450 ఎకరాల ఆయకట్టుకు నీరు లేకుండా పోయింది. ఈ చెరువు కింద సాగయ్యే భూములకు చెందిన నిర్వాసిత రైతులకు భూమికి భూమి ఇవ్వడానికి చర్యలు తీసుకున్నప్పటికీ కనీసం ఖాళీ చేయించేంత వరకైనా ఈ చెరువు ఆధారిత ఆయకట్టును పండించుకునే అవకాశం లేకుండా పోయింది. చెరువును ఎపుడో పూడ్చేసినప్పటికీ ఆయకట్టు కలిగిన ఈ రెండు గ్రామాల రైతు కుటుంబాలను ఇపుడిపుడే ఖాళీ చేయిస్తున్నారు.



గోదావరి ఎడమ గట్టు వైపు పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామం

దీనికితోడు నాగళ్లపల్లి గ్రామానికి చెందిన రైతులు సాగు చేసుకునే సుమారు 300 ఎకరాల భూమికి దారిలేకుండా పోయింది. ఈ భూమికి ఒకవైపు కొండలు, మరోవైపు నది, ఇంకోవైపు రోడ్డు వుంటుంది. ఇపుడు రోడ్డును మూసెయ్యడంతో ఇక ఆ భూములకు వెళ్లడానికి దారిలేదు. ఇది సరిగ్గా నాగళ్లపల్లి-గొందూరు మధ్యలో కొండ వారగా ఉంటుంది. ఈ భూమిపై సాగు చేసుకునే ఆధారం కూడా రైతులు కోల్పోయారు. అయితే తరతరాలుగా ఆధారపడిన ఈ భూమికి ప్రాజెక్టు నిర్మాణ పనుల డంపింగ్ యార్డు కారణంగా దారిలేకుండా పోయింది. ఇప్పటి వరకు ఈ గ్రామానికి చెందిన రైతులు ఆధారపడిన భూమి ముంపులో కోల్పోవడం జరుగుతోంది కాబట్టి ఇందుకు ప్రతిగా కూడా భూమి ఇవ్వాలని రెవెన్యూ అధికారులను నిర్వాసితులు కోరుతున్నారు. వాస్తవానికి ఇది ప్రభుత్వ భూమే అయినప్పటికీ ఇంతకాలం ఆ భూమిపై ఆధారపడి వ్యవసాయం చేసుకుని జీవించడం జరుగుతోంది కాబట్టి ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని నిర్వాసిత ఆదివాసీ రైతులు కోరుతున్నారు. పి గొందూరు గ్రామ నిర్వాసిత రైతులు సంఘం భూములు కూడా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇంత కాలం ఆధారపడిన ఈ భూములకు ప్రతిగా ఎటువంటి ప్రత్యామ్నాయం చూపించలేదని వాపోతున్నారు. ఈ మేరకు పి గొందూరులో సుమారు 300 ఎకరాల సంఘం భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్న క్రమంలో ఈ ఆధారం కాస్తా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలావుండగా ఈ రెండు గ్రామాల్లో రైతుల నుంచి తీసుకున్న భూములకు సంబంధించి భూమికి భూమి పథకంలో కొంతమందికి తోటలు ఇచ్చారు. మరి కొంతమందికి రాళ్ల రప్పలుతో నిండిన భూములు ఇచ్చారు. ఇంకొంత మంది అయితే తమకు నచ్చిన భూమి లేదంటూ రెండు చోట్ల అధికారులు చూపించిన భూములను నిరాకరించారు. భూమికి భూమి పథకంలో మాత్రం రెండున్నర ఎకరాలకు తక్కువ కాకుండా ఇవ్వాల్సివుంది. ప్రతిగా కేటాయించే ఈ భూమి నీటి వసతి కలిగిన ప్రాజెక్టు పరిధిలోనే ఉండాలి. అయితే భూమికి భూమి పథకంలో నిర్వాసితుల నుంచి తీసుకున్న భూమికి ప్రతిగా ఇచ్చే భూమి విషయంలో ఈ రెండు గ్రామాలకు డి పట్టా భూములు ఇస్తూ రెవెన్యూ అధికారులు కొత్తపుంతలు తొక్కారు. డి పట్టా అయితే అవసరమైనపుడు మళ్ళీ రైతుల నుంచి అధికారులు తిరిగి తీసేసుకోవచ్చు. ఆ ఉద్దేశ్యంతోనే డి పట్టాల రూపంలో గిరిజనుల చేతిలో పెట్టి రెవెన్యూ అధికారులు నెట్టుకొస్తున్నట్టు తెలుస్తోంది. ఈ భూములు రిజిస్ట్రేషన్లకు వీలుపడదు. పక్కా జిరాయితీ భూములు గిరిజనుల నుంచి తీసుకుని దానికి ప్రతిగా డి పట్టా భూములు తమ చేతుల్లో పెట్టడమేమిటని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. తమ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ యంత్రాంగం చేయాల్సిన మాయాజాలమంతా చేసేస్తోందని గిరిజనుల్లో కాస్తంత అవగాహన ఉన్నవారు ఆరోపిస్తున్నారు. ఏదేమైనప్పటికీ భూమికి భూమి పథకం చుట్టూ రెవెన్యూ మాయాజాలం అలుముకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వేతర రంగంలోని పాఠశాలల యాజమాన్యాలవారు ప్రతి సంవత్సరం 'శుల్కా'ల -ఫీజ్-ను పెంచడానికి వీలు కల్పించాలన్న ప్రతిపాదన సర్వజన సంక్షేమ స్ఫూర్తికి విరుద్ధం. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బెంగళూరులో మంగళవారం చేసిన విద్యాసంబంధ ప్రసంగ స్ఫూర్తికి ఈ 'విపరీత ప్రతిపాదన' విఘాతకరం! అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యాశుల్కాల అధ్యయన సంఘం వారు ఈ విపరీతమైన ప్రతిపాదన చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదించినట్టయితే విద్యారంగంలో ఇంతవరకు అక్రమ వాణిజ్యవేత్తలు నిబంధనలకు వ్యతిరేకంగా చేస్తున్న దోపిడీ అధికారికంగా వ్యవస్థీకృతం కాగలదు! వాణిజ్య పాఠశాలలవారు ఏళ్ల తరబడి ప్రజల నుంచి 'ఫీజు'ల రూపంలో, 'విరాళాల'- డొనేషన్స్ - రూపంలో, ఇంకా వివిధ రూపాలలో విద్యార్థుల తల్లిదండ్రులను 'లూటీ' చేస్తుండటం దశాబ్దులుగా నడిచిపోతున్న దారుణం. దేశవ్యాప్తంగా సాగిన ఈ అక్రమాన్ని నిరోధించిన ప్రభుత్వం లేదు. ప్రభుత్వేతర పాఠశాలల నిర్వాహకులు, ఉన్నత అధికారులు, రాజకీయవేత్తలు, దళారీలు కలిసికట్టుగా వ్యవహరించడం విద్యారంగాన్ని ఆవహించిన 'ప్రపంచీకరణ' దుష్ప్రభావ ఫలితం! అనేక సందర్భాలలో రాజకీయవేత్తలు స్వయంగా ఈ ప్రభుత్వేతర పాఠశాలలను నిర్వహించారు.ఆ తరువాత వాణిజ్యవేత్తలు రాజకీయవేత్తలుగా పరివర్తన చెందడం నడుస్తున్న చరిత్ర! ప్రభుత్వేతర పాఠశాలలకు రెండు దశాబ్దుల క్రితం కేవలం ధనవంతులు, ఉన్నత ఉద్యోగస్థులు, ఇతరేతర ప్రముఖులు, ఘరానాలు తమ పిల్లలను పంపించేవారు. ఇలా పంపించడం నగరాలకు పట్టణాలకు మాత్రమే పరిమితం అయి ఉండాలి. 'పాల కంకుల' పరిమళం చెడని పల్లెటూళ్లలోను, చెరకు గానుగలతో తయారయ్యే లేత బెల్లం సుగంధాలు సభలు తీర్చిన గ్రామ సీమలలోను ఈ 'వాణిజ్య పాఠశాలలు' పుట్టుకొని రాలేదు. అందువల్ల పల్లె సీమలలోని సాదాసీదా జనాలు ప్రభుత్వపు బడులలోనే తమ పిల్లలను చదివించేవారు! నగరాలలోని, పట్టణాలలోని సామాన్యులు సైతం తమ పిల్లలను సర్కారీ బడులకే పంపించేవారు!

అందువల్ల వాణిజ్య పాఠశాలల - కార్పొరేట్ స్కూల్స్ - యజమానులు సాగించిన 'ఫీజుల' బీభత్స విస్తృతి తక్కువగా ఉండేది. ప్రచారం తక్కువగా ఉండేది. కానీ క్రమంగా 'మమ్మీ', 'డాడీ' అని పిలిపించుకోవాలన్న జీవన రీతి - లైఫ్ స్టయిల్, విలాసం - ఫాషన్ - సామాన్య ప్రజల కుటుంబాలకు కూడా విస్తరించిపోయింది. 'ఫీజు'ల దోపిడీ గురించి వాణిజ్య పాఠశాలల వివిధ రకాల అక్రమాల గురించి ధ్యాస, ప్రచారం విస్తరించడానికి ఇదీ కారణం. ఈ నేపథ్యంలో ప్రభుత్వేతర పాఠశాలలలో 'ఫీజు'లు తగ్గించాలన్న ఉద్యమాలు తెలుగు రాష్ట్రాలలోనే కాదు దేశమంతటా జరుగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎనిమిది నెలల క్రిందట నియమించిన ఈ 'విద్యా శుల్కాల' అధ్యయన సంఘం, శుల్కాలను తగ్గించాలని 'సిఫార్సు' చేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించడం సహజం... జరిగింది మాత్రం దీనికి పూర్తిగా వ్యతిరేకం.

ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ కులపతి, సామాజిక సంవేదన శీలి, ప్రముఖ విద్యావేత్త ఆచార్య టి.తిరుపతిరావు అధ్యక్షతన ఏర్పడిన ఈ 'చతుర్దశ సభ్య సంఘం' ఇలాంటి ప్రజా వ్యతిరేక ప్రతిపాదనను చేయడం విస్మయకరం! ప్రభుత్వం అనుమతి లేకుండా ప్రతి ప్రభుత్వేతర పాఠశాల యాజమాన్యం ప్రతి ఏటా పదిశాతం మేర 'ఫీజు'లను పెంచవచ్చునట! అంతకంటే ఎక్కువ కూడ ఎంతైనా పెంచవచ్చు. దీనికి మాత్రం ప్రభుత్వం అనుమతి కావాలి. 'క్షేత్రీయ శుల్క క్రమబద్ధీకరణ సంఘం' - జోనల్ ఫీ రెగ్యులేషన్ సమితి - జెడ్‌ఎఫ్ ఆర్‌సి - వారికి ముందుగా ఫీజుల అవసరాలను సమర్పించుకోవాలి! 'సమర్పించుకోవడం' అన్న విధానాన్ని అధికాధిక పాఠశాలల వారు బహుశా పాటించవచ్చు. అందువల్ల జెడ్‌ఎఫ్‌ఆర్‌సి వారు, ప్రభుత్వంవారు అనుమతులు ఇవ్వడం కూడా సహజం. అందువల్ల వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వేతర పాఠశాలలలో, అధికాధిక పాఠశాలలలో విద్యార్థులు చెల్లించవలసిన 'ఫీజు'లు పది శాతం మాత్రమే ఇంకా ఎక్కువ శాతం పెరగనున్నాయి. విద్యార్థుల వద్ద వసూలు చేస్తున్న ఫీజుల మొత్తం సొమ్ములో కనీసం యాభై శాతం పాఠశాలల్లో పనిచేసే అధ్యాపకులకు ఫీజుల రూపంలో చెల్లించాలన్న నిబంధనను తొలగించాలని కూడా ఈ అధ్యయన సంఘం తెలంగాణ ప్రభుత్వానికి 'సిఫార్సు' చేసిందట! ఇదే నిజమైతే యాజమాన్యం వారు ఏళ్ల తరబడి ఉపాధ్యాయులకు జీతాలు పెంచకుండా వారిచేత వెట్టిచాకిరీ చేయించడం ఖాయం!

విజ్ఞత వికసించాలి. సామాజిక న్యాయసాధనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఈ 'సంఘం' ప్రతిపాదనలను తిరస్కరించాలి. ఇప్పుడు వసూలు చేస్తున్న 'ఫీజు'లను కనీసం ఇరవై శాతం తగ్గించడంద్వారా నిరుపేదలైన విద్యార్థుల తల్లిదండ్రులను ఆదుకోవాలి. ప్రాథమిక స్థాయి పేద విద్యార్థులు ప్రభుత్వేతర పాఠశాలలకు చెల్లిస్తున్న ఫీజులను ప్రభుత్వం ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లిస్తోందా? ఇలా రీయింబర్స్‌మెంట్ జరుగుతున్నట్టయితే సామాన్య ప్రజలకు వెసులుబాటు ఉండగలదు. కానీ ఇలాంటి రీయింబర్స్‌మెంట్ ఇంకా మొదలయినట్టు లేదు. ఎప్పుడు మొదలుపెడుతుందో మరి! ఇప్పుడు వ్యవసాయ శ్రామికులు, చిన్న రైతులు, వివిధ వృత్తులవారు గ్రామలలోను, నిర్మాణ కార్మికులు, గృహసహాయికలు, కూరలు అమ్ముకునేవారు, కిల్లీకొట్టు యజమానులు పట్టణాలలోను నగరాలలోను తమ పిల్లలను ప్రభుత్వేతర పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇదంతా ప్రపంచీకరణ వ్యామోహం. ప్రభుత్వేతర పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమంలో చదివితే తమ పిల్లలకు పెద్ద ఉద్యోగాలు వస్తాయని, అమెరికాలోను ఆస్ట్రేలియాలోను ఉపాధి లభిస్తుందని ప్రజలలో అత్యధికులు 'భ్రాంతి'కి గురికావడం ప్రపంచీకరణ ఫలితం! అందువల్ల ప్రభుత్వం పాఠశాలలకు వెళ్లేవారి సంఖ్య అడుగంటిపోయింది. దీన్ని నిరోధించడానికి ఏకైక ప్రత్యామ్నాయం కనీసం ఎనిమిదవ తరగతి వరకు మాతృభాష మాధ్యమంగా, తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాష మాధ్యమంగా విద్యాబోధన జరగాలి. ఇందుకు కృషి చేయవలసిన రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలలలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాయి. ప్రపంచీకరణ ప్రభుత్వాలను ప్రభావితం చేస్తున్న తీరు ఇది.

ప్రతి సంవత్సరం పది శాతం ఫీజులు పెరిగినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు, సంఘటిత, ప్రభుత్వేతర రంగాల ఉద్యోగులు, సంపన్నులు, ఘరానాలు చెల్లించగలరు. ఎందుకంటే 'ద్రవ్యోల్బణం'తో పాటు వారికి జీతాలు పెరుగుతాయి కానీ అసంఘటిత రంగాలవారు, చిరు ఉద్యోగులు, స్వయం ఉపాధితో జీవించే సామాన్యులు, చిల్లర కొట్టు వ్యాపారులు, గ్రామీణ శ్రామికులు ఎలా చెల్లించగలరు? విద్యాదానం గురించి, విద్యా దానం భారతీయ సంప్రదాయమన్న వాస్తవం గురించి 'బెంగళూరు సభ'లో రాష్ట్రపతి ప్రస్తావించారు. కానీ ప్రభుత్వేతర, వాణిజ్య - కార్పొరేట్ విద్యాలయాల నిర్వాహకులు చేస్తున్నది ఏమిటి??

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
సోమవారం, 1 జనవరి 2018

విద్యావ్యాపారికి వెసులుబాటు!

కొత్త ఊహలు! పాత ఊసులు!!

నేరాల రొంపి, కుంభకోణాల కంపు. అయినా నేరస్థులే లేని దేశం మనది. కారంచేడు, వాకపల్లిలలో హత్యలు, అత్యాచారాలు! అయితేనేమి హంతకులెవరూ కారు. కీచకులెవరూ లేరు. దశాబ్దాలుగా నాన్చబడే కేసులు, పరిమళాలు వెదజల్లే తీర్పులు. నిన్నటి కథ, నేటి వ్యథ, రేపటి పథాలే! ఆడపిల్లల్ని ఎలా వలవేసి పట్టాలో, వ్యతిరేకించే తల్లిదండ్రుల్ని విలన్లలా ఎలా ముద్రవేసి హింసించాలో బోధించే సినిమాలు. లొంగని అమ్మాయిల్ని యాసిడ్‌తో, యమకింకర్లుగా (యముడు క్షమించాలి) చూపించే ఎప్పటికీ తెగని సీరియళ్లు! ఇలా మనకు మనమే సాటి! కారెవ్వరూ మనకు పోటీ!

పాలకులకు ఇబ్బంది కలిగించే ఎపిసోడ్లు మరోవైపు. దారి మళ్లించే మియాపూర్ భూకుంభకోణం. దీంతో మిషన్ కథలు, వ్యథలు కొంత విరామాన్ని పొందుతాయి. అంతలోకే చిత్ర విచిత్ర డ్రగ్గు మాఫియాలు బయటపడతాయి. ఎంతవారైనా చట్టానికి చుట్టాలు కారనే ఫీంకారాలు. అంతలోనే అందరూ చుట్టాలే! ఇలా ఈ కథ కంచికి చేరకముందే ఉస్మానియా వంద వత్సరాల సంబురాలు. అధినాయకుడే మాట్లాడని విపత్కర స్థితి. తోడు రైతుల ఏడుపు. అన్నదాతల కన్నీటిని తుడవడానికే ప్రాజెక్టులంటే వినని మూర్ఖులు. భూసేకరణ వ్యతిరేక గళాలు! అభివృద్ధి నిరోధక నిరసనలు. ఇలాంటి వాటి నుంచి దృష్టి మళ్లించడానికే నెలవంకలాంటి ఇవాంక ఆటవిడుపులు, తెలుగు మహాసభలు, భువన విజయాలు. భళ్లున తెల్లారినా, అప్పుడే ముగిసే రాత్రుళ్లు. జనవరి, ఫిబ్రవరి లెక్కించేలోపే డిసెంబర్! నీటి చక్రంలా జీవనయానం. అంతులేని అగాధం. తెరిపిలేని వేదన. అయినా స్వాగతిస్తాం! సంతోషిస్తాం! సంతృప్తి పడుతాం! రాజీపడుతూనే ఉదయించే భానుడికై ఎదురు చూస్తాం! మాటలు మాటలే! చేతల దారి వేరు. ఉపాధి ఉంటేనేమి? పోతేనేమి? ఉద్యోగాలు లేకపోతేనేమి? లే ఆఫ్‌లు టేక్ ఆఫ్ (takeoff)లు కాకపోతేనేమి? హబ్బులు, క్లబ్బులు, పబ్బులుంటే పదివేలే! చుక్కల్లా మెరవచ్చు! విలువలకన్నా వినోదమేగా కావాల్సింది. వైఫైలు, ఉచిత నెట్‌లు... అడుగడుగునా అందుబాటే! కానీ, అడుగంటిన జలం పైకిరాదు. వచ్చినా గొంతు జారదు. అందుకే బాటిళ్లలో నీరు బజారుకెక్కింది. ఇలాంటి మత్తులకే అప్పులు అవసరమంటారు. అసలు అప్పు చేయకుండా అభివృద్ధి ఎలా అంటారు. ఆహా ప్రగతి అంటే ఓహో అనాలి. లేదంటే వెధవ బతుకు! కాదంటే సన్యాసి బతుకు. అయినా కాదంటే సన్యాసి బతుకే!

మనసులోమాట. నెలకోసారి ముత్యాల మూట! సలహాలు, సూచనలు. వెరసి మన్‌కీబాత్! మాట్లాడాల్సిన వాటిపై మౌనం. పక్క దేశంతో స్నేహమంటే 'ఊ' అనాలి. ఆగర్భ శతృత్వం అంటే 'ఆ' అనాలి. లక్ష్మణరేఖలు ఎప్పుడు దాగుడుమూతలే! ముష్కరులు మూషికాల్లో చొరబడతారు. మన రహస్య వేగులకు మాత్రం ఎప్పుడు ఏనుగుపైన వానలే. మనకు వీరమరణమైతే, వారు ఖతమవుతారు. ఆ పత్రికా కథనాలు మనను హిమాలయాలనెక్కిస్తాయి. ఆరంభమే రాని, అంతమేలేని యుద్ధంకాని యుద్ధం. బోడిగుండువాడు దువ్వెనకై పోట్లాడినట్టు మన సైనికులు ఉత్త పుణ్యానికి మంచులో కూరుకునిపోతారు. విగతజీవులవుతారు. కుటుంబాలకు కుటుంబాలే దిక్కు దివాణం లేకుండాపోతారు. వారికి ఆవేదనే జీవిత పరమార్థం అవుతుంది. అయినా మన నాయకుల పిల్లలు ఎవరూ ఇలా వీరమరణం పొందే ఉద్యోగాలు చేయరు. వీరి దేశభక్తి అలాంటిది. వారసత్వ రాజకీయాలతో, దేశాన్ని చక్రం తిప్పడంలో ఉన్న మజా నిజంగా సైనికులకు తెలిస్తే... ఇది వేసుకోకూడదని ప్రశ్న! అందుకే, భగత్‌సింగ్ నుంచి పూలేదాకా, వివేకానందుడి నుంచి అంబేద్కర్ దాకా ఆదర్శాలెలా ఉండాలో వల్లెవేస్తారు. జనాలకు ఉద్బోధ చేస్తారు. వీరికెవరు ఆదర్శమో ఎప్పుడూ చిదంబర రహస్యమే!

ఒకే దేశం, ఒకే పన్ను! చక్కని నినాదం! కాని, సమాన విద్య, ఒకే తీరు వైద్యం అంటరాని నినాదం. ఇలాంటి ఆలోచనల్ని దరికి రానియ్యని గడసరితనం! స్వచ్ఛభారత్! కాదనే ధైర్యం ఎవరికీ లేదు. వసూలు చేసిన సెస్సులో (రూ.16,401) 4001 వేల కోట్లు ఖర్చు కాకున్నా ఫరవాలేదు, కాని బిగ్ 'బీ'కి ఇస్తున్నదెంత? ఏనాటికీ తేలదు. పోతే, స్వచ్ఛందంగా 'బి' ఎందుకు తెరపై కనపడడో మనకు అర్థమైచావదు. విద్యాహక్కు చట్టం వచ్చి అప్పుడే ఏడేండ్లు దాటింది. చదువుల బడి ఎంత గమ్మత్తో పక్కనపెడదాం! వీధిలో పిల్లలెందుకు కాగితాలు ఏరుకుంటున్నారో ఏడు దశాబ్దాలకు కూడా అర్థంకాని వైనం!



అయినా సెస్ వసూలవుతూనే ఉంటుంది. ఇప్పటికే (2006-2017) వసూలైన రూ. 83,497 వేల కోట్లు ఏం చెయ్యాలో తోచని రాజకీయం! అయిదు పద్దులకుగాను వసూలైన రూ. 4,04,831 కోట్లలో ఖర్చు చేసింది రూ.2,23,443 కోట్లే! ఇలా జనాల ముక్కుపిండి వసూలు చేసిన రొక్కాన్ని ఖర్చు చేయకుండా, సంక్షేమ పథకాలకు దారి మళ్లించడం ఈ దేశంలో అనాదిగా జరుగుతున్నది. అరే! సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తే తప్పా అనే ప్రశ్నను రేకెత్తిస్తున్నాయి. ఈ సంక్షేమ పథకాల ముసుగులో పబ్లిక్‌రంగ సంస్థల్ని ఎలా బజారుపాలు చేస్తూ తెగనమ్ముతున్నారో మనకు తెలియడం లేదు. ఉద్యోగాలనెలా ఊడబీకుతున్నారో తెలియదు. దళారుల్ని మేపడానికై ఔట్‌సోర్సింగ్ పేరున కార్మికుల్ని, ఉద్యోగుల్ని ఎలా దోపిడీ చేస్తున్నారో తెలియదు. అయితేనేమి, నాయకులు జీతాలే కాదు, న్యాయకోవిదుల జీతాలు వారికై వారే పెంచుకునే వ్యవస్థ మనది. ఇలా తమకు నచ్చినంతగా వేతనాల్ని నిర్ణయించుకునే వ్యక్తులు ఇంకా 'గౌరవనీయులైన' అనే పదాన్ని వారి పేరుకు ముందు వాడేలా జనాల్ని ఎలా మసిపూసి మారేడుకాయ చేసారో ఎన్ని జన్మలెత్తినా మనకు అర్థం కాదు.

పది రూపాయల వస్తాయంటే, వంద రూపాయల పనిని పోగొట్టుకొని ఆధారాలపై, ఆధారాల్ని సమర్పిస్తూ ఆ పది రూపాయలను పొంది తెగ సంతోషించే బాపతు, బళ్లో నేర్చుకోకున్నా గుళ్లు కూడా విలువల్ని కేసులతో తూస్తాయి కాబట్టి, ఆరోగ్యశ్రీ నుంచి ఉపాధి హామీ పథకం దాకా అంతటా మనమే అవుతాం. కారుంటేమి? తెల్లకాలరుంటేమి తెల్లకార్డే మహాభాగ్యమని తలిచే ఘనులు. నోట్ల రద్దుతో కోట్లాది రూపాయల నల్లధనాన్ని వెలికి తీశామని కూడ బతుకుతున్న మోదీకి, బైటిల్లీకి గాలి జనార్దన్‌లాంటి వాళ్లు ఎన్ని సవాళ్లు, విసిరినా వినిపించదు. కనిపించదు. జనాల్ని దిక్కుమాలిన వారిగా చేసి వారి డబ్బుకు వారే బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇంతా చేస్తే, దేశంలోని మొత్తం జనాభాలో పన్ను చెల్లించేవారు రమారమి రెండు కోట్లు (1.7 శాతం) మాత్రమేనా? ఇందులో అత్యధికులు ఉద్యోగులేగా? దేశంలో శఠగోపం పెట్టిన మాల్యా (బ్యాంకు ఎగవేతలో విజయుడు)లాంటివారి నిరర్థక ఆస్తులు రూ. 7.34 లక్షల కోట్లు. ఇవన్నీ వచ్చే బాకీలా! ఏమో? రిజర్వు బ్యాంకు గవర్నర్‌కే కాదు, స్వయాన ఆర్థికశాఖామాత్యులకే తెలియదు. అందుకే కాబోలు ఇలాంటి దోషుల నుంచి బ్యాంకుల్ని రక్షించడానికై అమాయకుల డిపాజిట్లకు ఎసరు పెట్టే ఫైనాన్షియల్ రిసల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (FRDI) అనే ఓ నల్లచట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం తలుస్తున్నది. దీంతో విద్యుత్ మాత్రమే కాదు, బ్యాంకులు ఇక నుండి షాక్ కొడతాయి. ఫైనాన్స్ కంపెనీలు దివాలా తీసి ప్రజలను శంకరగిరి మాన్యాలకు పంపిస్తాయి.

'భరతదేశము భాగ్యసీమరా..' అంటూ ఓ నాలుగు దశాబ్దాల క్రితం సభల్లో పాట మార్మోగేది. పరిస్థితి ఎంతమారిందో తెలియదు. గాని 2017లో మాత్రం 119 దేశాల్లో ఆకలి రాజ్యంగా భారత్ 100వ స్థానంలో నిలిచింది. మనదేశ గణాంకాల ప్రకారమే కాదు, ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారమే ప్రభుత్వం అందిస్తున్న ఆహార సబ్సిడీలు 60 శాతం దాకా జనాలకు చేరడం లేదని. అసోచామ్ (asocham) లెక్కల ప్రకారమే, పంట నూర్పిళ్ల తర్వాత రెండు లక్షల కోట్ల విలువైన ఆహార ధాన్యాలు గోదాముల్లో, ఆరుబయట వృధా అవుతున్నాయి. లక్షలాది మంది దేశవ్యాపితంగా నిద్రపోయే ముందు ఓ ముద్దకూడా లేకుండా ఉంటే, సంవత్సరానికి రూ. 58,000 కోట్ల విలువైన వండిన పదార్థాలు పెద్దల పెళ్లిళ్లలో, ఇతర విందుల్లో, హోటళ్లలో పాచిపోతున్నాయి. ఇలా లెక్కలు పెట్టుకుంటూపోతే కడుపులో దేవినట్లు అనిపించినా ఇది మన ఆహార ఉత్పత్తిలో 7 శాతం. సంవత్సరానికోసారి ప్రభుత్వ లెక్కల్ని సరితూచే 'కాగ్' (CAG) ఇలాంటి చేదు నిజాల్ని ప్రతి సంవత్సరం బయటపెడుతూనే ఉంటుంది. వీటిని తీపి గుళికలుగా ప్రభుత్వాలు దిగమింగి, మౌనం వహించడం చూస్తూనే ఉన్నాం.

ప్రస్తుతం ఉన్న మన ఇ-కామర్స్ (e-commerce) వ్యాపారం రూ. 38.5 బిలియన్ డాలర్ల నుంచి 2018 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందనేది అంచనా! అంటే పేటీఎం, కార్డు గీకుతా చేసే కొనుగోలన్నమాట! గత జూలై నుంచి గుడ్, సింపుల్, ట్రాన్స్‌పరెన్సీ (గూడ్స్ సర్వీస్ టాక్స్) అని మోదీ ప్రవచించిన మాటలతో దేశవ్యాపితంగా జిఎస్‌టి (GST) కి రిజిస్టర్ చేసుకున్న వ్యాపారులు కేవలం 99 లక్షలేనా? మిగతా వ్యాపారమంతా జిఎస్‌టి పరిధిలోకి ఎందుకు రావడం లేదు? ఇది చీమల్ని కొట్టి పాములకు వేయడం కాదా?

అయితేనేమి? మన ఆర్థిక ప్రగతి అమోఘమే! బడ్జెట్‌లో రెండంకెలంటూ ఉవాచలు. ప్రతీ మూడు మాసాల లెక్కలు 6-7 శాతం దాటవు. అయినా, 2018-19లో 7.7 శాతం దాటదని స్వయాన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (IMF) ప్రస్తావిస్తే, కాదుకాదు ఆర్థిక ప్రగతిలో ప్రపంచస్థాయిలో నేడు 7వ స్థానంలోనున్న భారత్ 2018 నాటికి ఫ్రాన్స్, బ్రిటన్‌లను కిందికి తోసి 5వ స్థానానికి ఎదుగుతుందని వరల్డ్ ఎకనమిక్ లీగ్ అప్పుడే ఎరుకల సోది చెప్పేసింది. ఇదంతా నిజంగా జరగాలంటే, మనం నిజంగానే అప్పులు చేయాల్సిందే! ఇలా చేస్తేనే కదా 2027 నాటికి మూడో స్థానంలో వున్న జపాన్ స్థానాన్ని ఆక్రమించగలుగుతుంది. గాడ్జిల్లాలాంటి సినిమాను మన బాటా వుడ్‌లు తీయగలుగుతాయి. ఆ ఉషోదయం కోసం ఎదురు చూడడం తప్ప ఈ నూతన సంవత్సరంలో చేసేది ఏమీ ఉండకపోవచ్చు!

- డా. జి.లచ్చయ్య | సెల్: 94401 16162

కొత్త సంవత్సరం వేడుకలు వద్దా?

భారతీయులమైన మనం ఉగాది పండగ చేసుకుంటున్నా, జనవరి ఒకటిన కొత్త గ్రేగోరియన్ క్యాలెండర్ ప్రారంభంరోజు 'హ్యాపీ న్యూ ఇయర్' జరుపుకోవడం దశాబ్దాలుగా పాటిస్తూనే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో కోట్లాది మంది ప్రజలు జనవరి 1 వ తేదీని కొత్తసంవత్సరంగా జరుపుకుంటున్నారు. సౌదీ అరేబియా, ఇజ్రాయిల్, ఇరాన్‌తో సహా. సౌదీ అరేబియాలో కొత్త సంవత్సరం వేడుకలపై నిషేధం విధించారు. ఏకంగా న్యూ ఇయర్ వేడుకలపై నిషేధం విధిస్తూ, ఫత్వా జారీ చేసి వేడుకలు జరుపుకోవద్దంటూ విదేశీయులను కూడా హెచ్చరించారు. చైనాలో జనవరి 1న గ్రేగోరియన్ నూతన సంవత్సరం మరియు సాంప్రదాయ చాంద్రమాన నూతన సంవత్సరం కూడా జరుపుకుంటున్నారు. దేశం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే, విదేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే పాశ్చాత్యీకరణ తప్పదని గ్రహించిన జపాన్ 19వ శతాబ్దంలో సౌర క్యాలెండర్‌ని అనుసరించింది. వైవిధ్యమైన సంస్కృతులు, సాంప్రదాయాలు, మతాలు, కులాలు కలిగి ఉన్నా, 'భిన్నత్వంలో ఏకత్వం' భారతదేశం ప్రత్యేకత. భారతదేశం కూడా సౌదీ అరేబియా లాంటి మత ఛాందస వైఖరిని అవలంబించడం సమంజసమా? ప్రపంచీకరణతో సాంకేతిక అభివృద్ధి సాధించి, సోషల్ మీడియా, డిజిటల్ ప్రపంచ యుగంలో గూగుల్ ఒక దేశం, ఫెస్‌బుక్, ట్విట్టర్ మొదలైనవి మతాలు. వాట్సాప్ ఒక కులంగా ఏర్పడ్డ ఈ ఆధునిక యుగంలో ఇంకా మతమౌఢ్యాల ముసుగులో చాదస్తం భ్రమలో మనిషిగా, మానసికంగా వెనక్కు వెళ్లిపోతున్నామా అని అనిపిస్తోంది.

జనవరి ఒకటిన న్యూ ఇయర్ మన సంప్రదాయం కాదు కాబట్టి తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేకమైన అలంకరణలు, వేడుకలు జరపరాదని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేశాయి. అదనపు ఖర్చు తగ్గించుకునే కోణంలో ఈ ఉత్తర్వులు బాగానే ఉన్నాయి. కాని న్యూ ఇయర్ మన పండగ కాదు, ఉగాది మాత్రమే మనకు కొత్త సంవత్సరం అంటూ ఒక వైపు చెబుతున్న టిటిడి దేవస్థానం వారు మరోవైపు 2018 క్యాలెండర్, డైరీలు ప్రచురించడం గమనార్హం. 2018 సంవత్సరం డైరీలు, క్యాలెండర్‌ల స్థానంలో చాంద్రమాన ప్రకారం చైత్రమాసం ఉగాది నుండే ఉపయోగపడే విధంగా డైరీలు, క్యాలెండర్‌లు ఎందుకు ముద్రించడం లేదు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలా ఉండగా చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు మరికాస్త ముందుకు వెళ్లి, కొన్ని ఇబ్బందికరమైన వ్యాఖ్యలు చేశారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అన్న వారిని గుంజీలు తీయిస్తామని ప్రకటించారు. ఈ తరహా ప్రకటన సమంజసం కాదేమో అనిపిస్తోంది. వాస్తవంగా చిలుకూరి బాలాజీ దేవుడిని 'వీసా'ల దేవుడిగా మొక్కుతుంటారు. వీసాలు వచ్చేవారు సప్తసముద్రాలు దాటి విదేశాలకు వెళ్లవచ్చు, ఉద్యోగాలు చేయవచ్చు, డాలర్లు సంపాదించి ఆలయాలకు విరాళాలు ఇవ్వవచ్చు, కానీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకోకూడదనడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖుల జన్మదినోత్సవాలు, దివంగత నేతల వర్ధంతులను ఆంగ్లసంవత్సరం తేదీల ప్రకారమే జరుపుతున్నారు కదా!

బహుళజాతి సంస్థలు, విదేశీ సంస్థలు, తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పిన ఆఫీసులకు ఉగాదిరోజుతో పాటు భారతీయ పండగల రోజుల్లో సెలవులు ప్రకటిస్తున్నాయి. ఈ పండగలు తమ పండగలు కాదంటూ తిరస్కరించడం లేదు. అమెరికాలో వైట్ హౌస్‌లో దేశాధ్యక్షుడు దీపావళి పండగను జరుపుకున్నారు. ఇతర మతాలు ప్రధానంగా ఉండే దేశాల్లో కూడా భారతీయ పండగలు జరుపుకుంటున్నారు. మన పిల్లలు విదేశాల్లో చదువుకుని మైక్రోసాఫ్ట్, అమెజాన్ తదితర సంస్థల్లో ఉద్యోగం చేసి డాలర్లు సంపాదించాలి. విదేశీ పెట్టుబడులు వచ్చి మన దేశం ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలి. మన వ్యాపారం ఉత్పత్తి, సేవలు ఇతర దేశాలు కొనుగోలు చేసేలా బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలి. మనకు ఆరోగ్యం బాగా లేకపోతే విదేశీ సంస్థల ఔషధాలు, స్టెంట్లే గతి. విదేశీ టెక్నాలజీని మనం పూర్తిగా ఉపయోగించుకోవాలి. గూగుల్, ఫేస్‌బుక్, ఐఫోన్, ఇంటర్నెట్ మనం నిత్యం వాడుతూ, మనోరంజనం పొందాలి. కాని విదేశీయుల న్యూ ఇయర్ మాత్రం జరుపుకోకూడదనడంలో ఔచిత్యం ఏమిటో ఆలోచించాల్సిన తరుణమిది. ఆధునిక యుగంలో శాంతి, విజయం, అభివృద్ధి, మనుగడ ఉండాలంటే మతాచారాలని మంట కలపకుండా, అన్ని సంస్కృతులు, సాంప్రదాయాలను గౌరవించడం, భిన్న వర్గాలను కలుపుకుని పోవడం ముఖ్యం.

గూగుల్, ఫేస్‌బుక్, ఐఫోన్, ఇంటర్నెట్ మనం నిత్యం వాడుతూ, మనోరంజనం పొందాలి. కాని విదేశీయుల న్యూ ఇయర్ మాత్రం జరుపుకోకూడదనడంలో ఔచిత్యం ఏమిటో ఆలోచించాల్సిన తరుణమిది. ఆధునిక యుగంలో శాంతి, విజయం, అభివృద్ధి, మనుగడ ఉండాలంటే మతాచారాలని మంట కలపకుండా, అన్ని సంస్కృతులు, సాంప్రదాయాలను గౌరవించడం, భిన్న వర్గాలను కలుపుకుని పోవడం ముఖ్యం.

మన శాస్త్రవేత్తలు 104 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించి చరిత్ర సృష్టించారు. మరోవైపు డ్రైవర్ రహిత కారు నుండి మానవరహిత రోబోటిక్ శస్త్రచికిత్స వరకు, డ్రోన్‌ల ద్వారా ప్యాకేజీలను రవాణా చేయడం తదితర విధానాల్లో సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నాం. సాంకేతిక పురోగతి కాలానుగుణ దృష్టిని ఆకర్షించినప్పటికీ, కుల మత సామరస్యం మరియు సామూహిక సామర్థ్యాలను పెంపొందించుకోవడంలో విఫలమవడమే కాకుండా రాను రాను వెనక్కు వెళ్లిపోతున్నామా అనిపిస్తోంది. భారతీయులు స్వేచ్ఛగా, శాంతియుతంగా వ్యవహరించే రీతి, వాతావరణాలను సృష్టించేందుకు ప్రభుత్వ, ప్రజా విధానాల్లో మార్పునకు ప్రయత్నాలు చేయాలి.

భారతీయులు విదేశాలకు వెళుతున్నారు. అక్కడ పుట్టిన పిల్లలు విదేశీ సంస్కృతికి అలవాటు పడుతున్నారు. వాళ్లతో పాటు విదేశీ సంస్కృతి కూడా మన దేశంలోకి దిగుమతి అవుతోంది. గతంలో లేని విధంగా వాలంటైన్స్ డే, అక్షయ తృతీయ అంటూ వ్యాపార సంస్థలు కొత్త పండగలను మనపై రుద్దుతున్నారు. ఇవన్నీ ప్రపంచీకరణలో భాగమే, ఆధునీకరణలో భాగమే.

ముఖ్యంగా ఈ జనరేషన్లో పుట్టిన వాళ్లు ఇంగ్లీషు క్యాలెండర్లు, పంచాంగాల మధ్య పాశ్చాత్య నాగరికత, సాంప్రదాయ నాగరికతల మధ్య నలిగిపోతున్నారు. బహుళజాతి సంస్థల్లో ఉద్యోగం చేస్తున్నప్పుడు లేదా వాటితో వ్యాపారపరంగా క్లయింట్స్‌తో విందులు, వినోదాలకు హాజరు కావడం, పుట్టిన రోజులకి కార్యాలయాల్లో కేకులు కట్‌చేయడం పరిపాటిగా మారింది. పెద్దనగరాల్లో నివసిస్తున్నప్పుడు గ్రామీణ సంస్కృతి వారసత్వం మత సాంప్రదాయం కొనసాగించడానికి వీలుకాకపోవచ్చు. సంఘంలో నలుగురికీ ఆమోదయోగ్యంగా ఉండేట్టు మరో కులం, మరో మతస్తులకు ఇబ్బంది కలగకుండా తటస్థ వైఖరి అవలంబిస్తున్నాం.

అత్తరు దుకాణాల్లో పనిచేస్తున్నప్పుడు దుస్తులకు పరిమళం అంటకుండా, వ్యవసాయం చేస్తూ చేతికి మట్టి అంటకుండా ఎలా ఉండలేమో, అదేవిధంగా ప్రపంచీకరణలో మరొక సంస్కృతికి ఆమడ దూరంలో ఉండలేము.

మనం రోడ్ల కూడళ్లలో 'భగవద్గీత' విక్రయించే విదేశీయులను చూస్తున్నాం కదా! లక్షలాది మంది విదేశీయులు 'హరేరామ హరేరామ రామ రామ హరేహరే- హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే' అంటూ ఇస్కాన్ దేవాలయాల్లో సేవ చేస్తున్నారు. హిమాలయాల నుండి కన్యాకుమారి వరకు, కాశీ, అరుణాచలం, పుష్కర్, కుంభమేళాతో సహా అనేక హిందూ ప్రార్థనా స్థలాలను విదేశీయులు దర్శిస్తుంటారు. విదేశీయుల పోప్ దానికి అభ్యంతరం వ్యక్తం చేశారా? లేదు కదా!

పూజలు, దేవాలయాల్లో న్యూఇయర్ వేడుకలు జరుపుకోవద్దనడం కన్నా, ఈ రోజు సారా, వైన్‌షాపుల దుకాణాలు మూసివేయించాలి అని డిమాండ్ చేయడం సమంజసంగా, శ్రేష్టంగా ఉంటుంది.



- సునీల్ ధవళ,
09741747700

పనిచేద్దామా.. విశ్రమిద్దామా?!

శ్రమ విలువైనది.. శ్రమ సంపద.. ప్రాచీనకాలం నుండీ మానవుడు శ్రమతోనే మనుగడ సాగిస్తున్నాడు. రాతియుగం నుండీ మనిషి శ్రమపడకుండా చెట్లనుండి దొరికిన కాయలను, భూమిలో లభించిన దుంపలనూ తింటూ కాలక్షేపం చేసుంటే, ఈనాడు కూడా అలాగే వుండేవారు. మేథస్సుతో కష్టపడి పనిచేసే శరీర నిర్మాణం మనిషికుంది. మనిషి శ్రమనుండే ఇంతటి వికాసము, నాగరికత నిర్మించబడ్డాయి. శ్రమతోపాటు శరీరానికి విశ్రాంతి కూడా అవసరం. అయితే, విశ్రాంతి పేరుతో ఎక్కువ సమయాన్నీ, కాలాన్నీ కూర్చుని గడిపేయడం అభివృద్ధికి విరుద్ధమే. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండీ దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలో కాలంగాని, శ్రమగాని వృథా కాకూడదు. అవి వృథా అయితే జరగవలసిన అభివృద్ధి బాగా తగ్గిపోతుంది. మనదేశంలో సెలవుల పేరుతో సంవత్సరంలో సుమారు సగం రోజులు వృథాగా గడిచిపోతున్నాయి. మిగిలిన రోజుల్లో మాత్రమే పని జరుగుతోంది. అంటే, ఉత్పత్తికి వినియోగించవలసిన పనిదినాలు అధిక సెలవులతో తగ్గిపోతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ సంస్థలకూ, ప్రభుత్వ రంగ సంస్థలకూ ఉన్న సెలవులు అర్థరహితంగా అనిపిస్తాయి. వారం రోజుల్లో ఒక రోజు విశ్రాంతి సరిపోతుంది. కాని కేంద్ర ప్రభుత్వోద్యోగులకు వారానికి రెండు రోజులు సెలవు. రాష్ట్ర ఉద్యోగులకు వారానికి ఒక రోజు, ప్రతి నెలా రెండవ శనివారం సెలవు. ఈలోగా వారం మధ్యలో ఏదైనా పండగకుగాని, జాతీయ దినోత్సవానికిగాని ఒకటి రెండు రోజులు సెలవొస్తే, ఆ వారమంతా ఖాళీ! మిగిలిన పనిదినాల్లో కూడా ఏదో రకమైన సెలవు పెట్టేస్తారు కొందరు.

శ్రమ విలువ, సమయం విలువ గుర్తించబడాలి. శ్రమ, విశ్రాంతి మతాలపరంగా, కులాలపరంగా, వర్గాలపరంగా నిర్ణయం కావు. శ్రమ, ఉత్పత్తి, సంపద, సంపద పంపకంపరంగా నిర్ణయించబడాలి. జాతీయ భావనా దృక్పథంతో నిర్ణయించబడాలి.

ఇవికాక పండుగలు, జాతీయ దినోత్సవాల సెలవులు. మన దేశంలో ఎన్నో మతాలున్నాయి. వీటిలో ప్రధానమైనవి- హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు మతాలు. ఈ మతాల్లోని పండుగలకు సెలవులు. ఇవిగాక, జాతీయ నాయకుల జన్మదినాలకు, వర్ధంతులకు సెలవులు. ఆనాటి జాతీయ నాయకులెవరైనా తాము పుట్టిన రోజున ఏ పనీ చేయకుండా ఖాళీగా కూర్చోమని ప్రజలకు చెప్పారా? ఆ రోజుల్లో కూడా పనిచేసి ఉత్పత్తిని పెంచితే, నిజంగా ఆ నాయకుల ఆత్మలు సంతోషిస్తాయి. ఎందుకంటే, ఆ నాయకులు దేశాభివృద్ధినీ, ప్రజా శ్రేయస్సునూ కోరారు. ఆ రోజుల్లో ఉదయాన్నే వారి విగ్రహాలకు గాని, చిత్రపటాలకు గాని దండలు వేసి వారిని, వారి సేవలను గుర్తుచేసుకుంటే సరిపోతుంది. ఇందుకోసం ఒక అరగంట చాలు. ఆ రోజు మిగిలిన సమయమంతా పని చేసుకోవచ్చు. మొరార్జీ దేశాయ్ సుమారు వంద సంవత్సరాలు బతికారు. తాను చనిపోయిన రోజున సెలవు ఇవ్వొద్దని చెప్పారాయన. కాని ప్రభుత్వం ఆయన చనిపోయినపుడు రెండు రోజులు సెలవు ప్రకటించింది!

అయితే, ఇతర రంగాల్లో శ్రమిస్తున్నవారికి ఇన్ని సెలవులు లేవు. ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకూ ఇన్ని సెలవులున్నాయా? అసంఘటిత వర్గాలైన రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారులు, కుమ్మరి, కమ్మరి మొదలైన వృత్తుల పనివార్లకు అసలు సెలవులే ఉండవు. వీరు విశ్రమించాలన్నా ఏదైనా పని చేసుకోవాలన్నా, ఆ రోజుల్లో ఆదాయాన్ని వదులుకోవాల్సిందే. సామాజిక సమన్యాయం విషయంలో ఇదొక కొత్తకోణం! విశ్రాంతి లేకుండా శ్రమించేవారు ఉత్పత్తి చేస్తుంటే, ఆ ఫలితాలను విశ్రాంతి తీసుకునే వర్గాలు కూడా పొందుతాయి. ఇది సమన్యాయమా? సోషలిజమా? ప్రజలంతా దేశ పౌరులే అయినపుడు, అందరికీ సమన్యాయాన్ని రాజ్యాంగం కల్పించినపుడు, ఈ వివక్షతను ఏ నాయకుడూ, ఏ సిద్ధాంతకర్తా ఎందుకు ప్రశ్నించరు? ఈ విషయంలో మనకర్థమయ్యేదొక్కటే- ఈ అసంఘటిత వర్గాల ప్రజల ఓట్లు అసంఘటితంగా ఉంటాయి కనుక, వారి కష్టనష్టాలను వీరెవరూ పట్టించుకోరు.

సంపద, పెట్టుబడి పెరగడానికి మనిషి యొక్క శ్రమ ముఖ్యపాత్ర వహిస్తుందని కారల్‌మార్క్స్, ఇతర సామాజిక, ఆర్థిక సిద్ధాంతకర్తలు చెప్పారు. అలాంటి శ్రమయొక్క ఫలితం- ఇప్పుడు వివక్షతో దేశంలో ప్రజల మధ్య పంచబడుతున్నది. ఇది నిజం. కష్టపడి పనిచేస్తున్నవారికి విశ్రాంతి కూడా కావాలి. విశ్రాంతికోసం సెలవులుండాలి. అయితే, ఈ సెలవులు అనే విశ్రాంతి సమయం హేతుబద్ధంగా నిర్ణయించబడాలి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులు, అసంఘటిత రంగాల్లోని రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు, వృత్తి పనివారు- అందరూ పనితోపాటు విశ్రాంతిని కూడా పొందుతూనే, ఆయా సెలవుదినాల్లో కూడా కొంత ఆదాయాన్ని పొందగలిగేలాగున హేతుబద్ధీకరించబడాలి. ఇది మానవతా దృక్కోణం. ఈ దృక్కోణానికి ఏ సిద్ధాంతాలైనా, చట్టాలైనా అడ్డురావు.

శ్రమ విలువ, సమయం విలువ గుర్తించబడాలి. శ్రమ, విశ్రాంతి మతాలపరంగా, కులాలపరంగా, వర్గాలపరంగా నిర్ణయం కావు. శ్రమ, ఉత్పత్తి, సంపద, సంపద పంపకంపరంగా నిర్ణయించబడాలి. జాతీయ భావనా దృక్పథంతో నిర్ణయించబడాలి. ఎందుకంటే దేశ సంపద అందరికీ చెందుతుంది. రాజకీయ కారణాలు, పార్టీల ప్రయోజనాలూ ఈ నిర్ణయాన్ని ప్రభావితం చేయకూడదు. శ్రమ విలువను కూడా సమానంగా గౌరవించేదే శ్రేయోరాజ్యం. ప్రజల యొక్క జాగృతితోనే ఇది సాధ్యమవుతుంది.

- మన్నె సత్యనారాయణ
ఫోన్: 99890 76150

కొత్త ఓటర్లే పునాది

నవ భారత నిర్మాణంలో పాలుపంచుకోండి ▪ యువతకు ప్రధాని మోదీ పిలుపు



కేరళలోని శివగిరిమఠ్ యాత్రికుల నుద్దేశించి ఆదివారం ఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: నవభారత నిర్మాణంలో యువతే కీలకమని, వారు ఎన్నికల ప్రక్రియలో ఎంత క్రియాశీలకంగా పాల్గొంటే అంతగానూ ప్రజాస్వామ్య వ్యవస్థ శక్తియుక్తులను సంతరించుకుంటుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కొత్త సంవత్సరం తొలి రోజున 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కూడా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఆ విధంగా భారత ప్రజాస్వామ్య పునాదులను పటిష్ఠం చేయాలని మోదీ అన్నారు. ఈ ఏడాదిలో చివరి మన్‌కీ బాత్ ద్వారా జాతి నుద్దేశించి మాట్లాడిన మోదీ అనేక జాతీయ, అంతర్జాతీయ అంశాలను, యువత ప్రాధాన్యతను, అలాగే ప్రజాస్వామ్య విలువల గురించి, స్వచ్ఛభారత్‌ను మరింత ముందుకు తీసుకు వెళ్లాల్సిన ఆవశ్యకత గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఓ కీలక సూచన చేశారు. ఆగస్టు 15న ఢిల్లీలో మాక్ పార్లమెంట్ నిర్వహించాలని, ఇందులో దేశంలోని ప్రతి జిల్లానుంచి ఓ యువకుడు లేదా యువతిని ఎంపిక చేసి రానున్న ఐదేళ్ల కాలంలో నవ భారత నిర్మాణం గురించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరగాలన్నారు. ఈ తరహా పార్లమెంట్‌లను ప్రతి జిల్లాలోనూ ఆగస్టు 15కు ముందే నిర్వహించాలని సూచించారు. కొత్త సంవత్సరం ఆరంభం రోజున ప్రతి ఒక్కరూ ప్రగతిశీల భారతానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాశ్మీర్ పాలనా సర్వీసు పరీక్షలో మొదటి స్థానాన్ని సంతరించుకున్న అంజుమ్ బషీర్‌ఖాన్ స్ఫూర్తిదాయక ఉదంతాన్ని మోదీ ప్రస్తావించారు. ఉగ్రవాదం నుంచి బయటపడ్డ బషీర్‌ఖాన్ కాశ్మీర్ పాలనా సర్వీసు పరీక్షలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యాడని పేర్కొన్న మోదీ, 1990లో బషీర్‌ఖాన్ పూర్వీకుల ఇంటిని ఉగ్రవాదులు తగులబెట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

ఉగ్రవాదం, తీవ్రవాదం కారణంగా బషీర్‌ఖాన్ కుటుంబం తమ సొంత గ్రామాన్ని, ఇంటిని వదిలి పారిపోయిందని, బషీర్‌ఖాన్‌పై ఎలాంటి ఉగ్రవాద ప్రభావం పడకుండా సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నాడని, ఆ విధంగా స్ఫూర్తిదాయక విజయాన్ని సాధించాడని తెలిపారు. అలాగే రాష్ట్రం నుంచి అనేకమంది బాలికలను తాను కలుసుకున్నానని, వారిలో ఉత్సాహం, స్ఫూర్తి తనకు నిజంగానే విస్మయాన్ని కలిగించిందని మోదీ తెలిపారు. 2000 సంవత్సరం ఆ తర్వాత జన్మించిన ప్రతి ఒక్కరూ 2018 జనవరి 1న ఓటు హక్కును పొందే వయస్సును సంతరించుకుంటారని పేర్కొన్న మోదీ, 'ఈ 21వ శతాబ్దపు ఓటర్లకు భారత ప్రజాస్వామ్యం ఆహ్వానం పలుకుతోంది' అని అన్నారు. ప్రతి ఓటరు కూడా నమోదు చేసుకోవాలని వీరి ఆశలు, ఆకాంక్షలను ఈడేర్చాలా జాతి నిర్మాణానికి నడుం బిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. నవ భారతానికి సరికొత్త పునాది ఈ కొత్త ఓటర్లు తమ ఆశలను, ఆకాంక్షలను రంగరించి వేయబోయే ఓటేనని మోదీ స్పష్టం చేశారు. ఇలా కొత్త ఓటర్లు ఎంతమంది నమోదైతే అంతగానూ ప్రజాస్వామ్య స్ఫూర్తి మరింత తేజోవంతం అవుతుందని, అలాగే కోటాను కోట్ల మంది జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకురావడానికి కూడా ఇదే బలమైన సాధనమని మోదీ అన్నారు. కుల, మత, ఉగ్రవాదం, అవినీతి, పేదరికాలకు తావులేని విధంగానే యువత కొత్త భారతాన్ని నిర్మించుకోవాలని మోదీ అన్నారు. అలాగే సమాన అవకాశాలకు ఇది వేదిక కావాలన్నారు. అలాగే శాంతి, సమత, సమైక్యత బలమైన చోదక శక్తిగా ప్రజలను ముందుకు నడిపించాలని మన్‌కీ బాత్‌లో మోదీ ఉద్ఘాటించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియలో ప్రజలు క్రియాశీలకంగా పాల్గొనడమే కాకుండా స్వచ్ఛ భారత్‌లోనూ అదే స్థాయిలో నిబద్ధతను కనబరుస్తున్నారని అన్నారు.

ముస్లిం మహిళల కడగండ్లు తీరాయి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దశాబ్దాల తర్వాత ముస్లిం మహిళలకు తలాక్.. తలాక్ సమస్య నుంచి విముక్తి లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ముస్లిం మహిళల వైవాహిక జీవితాలను ఛిత్రం చేసే ఈ తలాక్ నుంచి వీరికి పూర్తి స్వేచ్ఛ లభించిందని మోదీ పేర్కొన్నారు. తక్షణ తలాక్‌ను శిక్షార్హ నేరంగా పరిగణించే ఓ కీలక బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో ఆదివారం ఈ అంశంపై మాట్లాడిన మోదీ ముస్లిం మహిళలకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించారు.

పురుష సంరక్షకుడి పర్యవేక్షణలోనే ముస్లిం మహిళలు హజ్ యాత్ర జరపాలన్న విధానం అన్యాయ పూరితమైనదని, వివక్షతో కూడుకున్నదని మోదీ పేర్కొన్నారు. వేలాది మంది ముస్లిం మహిళల అభ్యర్థన మేరకు ఈ నిబంధనను తమ ప్రభుత్వం తొలగించిందని మోదీ గుర్తుచేశారు. ముస్లిం మహిళలకు సమాన అవకాశాలను కల్పించే దిశగా తమ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మోదీ ఈ సందర్భంగా వివరించారు. తలాక్ నిర్మూలన బిల్లును లోక్‌సభ ఆమోదించిన అంశాన్ని ప్రస్తావించకుండానే ముస్లిం మహిళల హక్కులను కాపాడేందుకు, వారికి సమానావకాశాలను కల్పించేందుకు తాము చేపడుతున్న చర్యలను మోదీ వివరించారు. కేరళలోని శివగిరిమఠ్ యాత్రికుల నుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ మాట్లాడారు. ఇదే అంశాన్ని తన మన్‌కీ బాత్‌లో కూడా మోదీ ప్రస్తావించారు.



లోక్‌సభలో తలాక్ బిల్లు ఆమోదం పొందినందుకు ఆదివారం ఢిల్లీలో ఆనందంతో మిఠాయిలు పంచుకుంటున్న ముస్లిం మహిళలు

కమ్మేసిన పొగమంచు

విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దట్టమైన పొగమంచు ప్రభావంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి 200కి పైగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మంచు కారణంగా 150కి పైగా విమానాలు ఆలస్యంగా ఇక్కడ నుండి బయలుదేరాయి. దాదాపు 50 విమానాలను ఇతర ప్రాంతాల మీదుగా మళ్లించగా, మరో 20 విమానాలను రద్దు చేశారు. ఆదివారం ఉదయం ఏడున్నర గంటల నుండి 11.05 నిమిషాల వరకు విమానాలు బయలుదేరిన జాడలేదు. సాధారణంగా విమానం ఎయిర్‌పోర్టులో దిగే సమయంలో కనీసం 125 మీటర్ల దూరం చాలా స్పష్టంగా కనిపించాలి. ఢిల్లీ విమానాశ్రయంలో అత్యంత ఆధునికమైన సీఏటీ ఐఐఐబీ విధానాన్ని అనుసరిస్తున్న నేపథ్యంలో 20 నుండి 50 మీటర్ల దూరం మాత్రమే కనిపిస్తున్నప్పటికీ విమానాలు దిగేందుకు ఎలాంటి సమస్య ఉండదని అధికారులు అంటున్నారు. కానీ ఉదయం ఐదున్నర సమయంలో పొగమంచు దట్టంగా అలుముకోవడంతో ల్యాండింగ్ అసాధ్యమవుతోందని పలువురు పైలెట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనిరీతిలో పొగమంచు సమస్య తీవ్రంగా ఉందని వారు అంటున్నారు. ప్రతిరోజూ ఉదయం ఏడున్నర నుంచి 11.05 వరకు ఢిల్లీ విమానాశ్రయం నుండి ఒక్క విమానం కూడా బయలుదేరకపోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. మధ్యాహ్నం సమయంలో రెండువేల మీటర్ల వరకు రన్‌వే స్పష్టంగా కనిపించడంతో విమానాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడడం లేదు.



పొగ మంచు వల్ల విమానాల ప్రయాణానికి అంతరాయం ఏర్పడడంతో ఆదివారం పాట్నా విమానాశ్రయంలో చిక్కుకుపోయిన ప్రయాణికులు



గుజరాత్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న నితిన్ పటేల్

అమిత్ షా హామీ.. వెనక్కి తగ్గిన నితిన్

▪ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతల స్వీకారం
▪ గుజరాత్‌లో ముగిసిన బీజేపీ వివాదం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: మంత్రివర్గంలో శాఖల కేటాయింపుల్లో అవమానం జరిగిందంటూ అలకబూనిన గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ ఎట్టకేలకు మౌనం వీడారు. ఆదివారంనాడు ఆయన తన కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలో నిర్వహించిన ఆర్థిక శాఖను నితిన్ పటేల్‌కు ముఖ్యమంత్రి విజయ్ రూపాని తిరిగి కేటాయించారు. అనంతరం నితిన్ పటేల్ విలేఖరుతో మాట్లాడుతూ బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారని, తనకు తగిన శాఖలనే కేటాయించే విషయంలో మాట ఇచ్చారని తెలిపారు. దీంతో గుజరాత్ బీజేపీలో మంత్రివర్గ కూర్పు వివాదం ముగిసినట్టయింది. మూడు రోజుల క్రితం నూతన మంత్రుల శాఖల కేటాయింపులో డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. శాఖలను కేటాయించి మూడు రోజులైనా నితిన్ బాధ్యతలను స్వీకరించలేదు. ఇది శాఖల అంశం కాదని, ఆత్మగౌరవానికి సంబంధించింది అంటూ నితిన్ పేర్కొన్నారు. దీనిపై పటేల్ ఉద్యమ నేతలు హార్దిక్ పటేల్, లాల్జీ పటేల్‌లో నితిన్‌కు మద్దతు ప్రకటించారు. అలాగే పటేల్ ఉద్యమ నేతలు బీజేపీని వీడి కాంగ్రెస్‌తో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నితిన్‌కు పిలువునివ్వడంతో గుజరాత్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

నితిన్ పటేల్ బీజేపీని విడితే మరో 10మంది బీజేపీ ఎమ్మెల్యేలు పార్టీని విడడానికి సిద్ధంగా ఉన్నారని హార్దిక్ చెప్పిన విషయం ఇక్కడ గమనార్హం. అలాగే కాంగ్రెస్ సీనియర్ శాసనసభ్యుడు వీర్జి థుమ్మర్ మాట్లాడుతూ నితిన్ పార్టీ వీడితే ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ అధినేత అమిత్ షా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించారు. స్వయంగా నితిన్‌తో ఫోన్‌లో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో డిప్యూటీ సీఎం అలకమాని ఆదివారం బాధ్యతలు చేపట్టారు. దీంతో గుజరాత్ బీజేపీలో చెలరేగిన వివాదం ముగిసినట్టయింది.



ఆత్మాహుతి దాడి జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

అఫ్గాన్‌లో ఆత్మాహుతి దాడి 15 మంది మృతి

శవదహన సమయంలో ఘాతుకం

జలాలాబాద్, డిసెంబర్ 31: తూర్పు అఫ్గానిస్తాన్‌లో ఓ శవదహన సంస్కారం జరుగుతున్న ప్రాంతంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 15 మంది మరణించారు. మరో 14మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడికి తమదే బాధ్యత అని ఏ మిలిటెంట్ సంస్థా ప్రకటించనప్పటికీ ఇటీవలి కాలంలో ఈ తరహా దాడులకు ఒడిగడుతున్న తాలిబన్, ఐసిస్ మిలిటెంట్లే ఈ దాడికి పాల్పడి ఉండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ జిల్లా గవర్నర్ దహన సంస్కారం జరుగుతున్న సమయంలో ఈ దాడి జరిగిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

ఇది మీడియా హడావిడే!

రజినీ రాజకీయ ప్రవేశంపై స్వామి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశం ఓ హడావిడి మాత్రమేనని అందులో ఎలాంటి పసా లేదని బీజేపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం స్వామి వ్యాఖ్యానించారు. పైగా రజనీకాంత్ నిరక్షరాస్యుడని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రజనీకాంత్ కొత్త రాజకీయ పార్టీ పెట్టడం అన్నది మీడియా ప్రచారాన్ని సంతరించుకోవచ్చునేమోగాని దానివల్ల ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదని రాజ్యసభ్యుడైన సుబ్రహ్మణ్యం స్వామి పేర్కొన్నారు. తమిళనాడు ప్రజలు తెలివైనవాళ్లని, రజనీకాంత్ కొత్త రాజకీయ పార్టీ వల్ల వారు ఆకర్షితులయ్యే అవకాశమే లేదని తెలిపారు. కేవలం రాజకీయాల్లో ప్రవేశిస్తున్నానని మాత్రమే రజనీ చెప్పారు తప్ప అందుకు సంబంధించిన కీలక వివరాలు గాని, పత్రాలు గాని లేవని స్వామి పేర్కొన్నారు. కాగా రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడం వల్ల రాష్ట్రంలో ఎలాంటి ప్రభావం ఉండదని అన్నాడిఎంకె శశికళ వర్గం నాయకుడు టిటివి దినకరన్ అన్నారు. రాష్ట్రంలో మరో ఎమ్జీఆర్ లేక జయలలిత పుట్టుకొచ్చే అవకాశమే లేదని అన్నారు.



రాజకీయ పెట్టనున్నట్లు తమిళనాడు సూపర్ స్టార్ రజనీకాంత్ ఆదివారం ప్రకటించడంతో సంబరాలు జరుపుకుంటున్న ఆయన అభిమానులు

నకిలీ బాబాలతో జరభద్రం

జాబితాలో తాజాగా మరో ముగ్గురు ▪ హిందూ సాధువుల సంస్థ ప్రకటన


అలహాబాద్, డిసెంబర్ 31: దేశంలో నకిలీ బాబాలు, వారి అఘాయిత్యాలు పేట్రేగుతున్న నేపథ్యంలో ఈ బూటకపు బాబాలకు సంబంధించిన సరికొత్త నివేదిక బహిర్గతమైంది. దేశంలో ఈ సాధువులకు సంబంధించిన అత్యున్నత సంస్థ 17 మంది కూడిన ఈ నకిలీ బాబాల జాబితాను వెల్లడించింది. వీరిలో నకిలీ బాబాలతోబాటు తమను తాముగా గాడ్‌మన్‌గా సంబోధించుకున్నవారు కూడా ఉన్నారని వెల్లడించింది. అఖిల భారతీయ అఖారా పరిషత్ తాజాగా వీరేంద్రదేవ్ దీక్షిత్ (ఢిల్లీ), సచ్చిదానంద సరస్వతి (యూపీ), త్రికాల్ భవంత్ (అలహాబాద్)తో కూడి కొత్త జాబితాను విడుదల చేసింది. ఇప్పటికే సెప్టెంబర్‌లో 14 మంది నకిలీ బాబాల జాబితాను ఈ హిందూ సాధువుల సంస్థ వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలోనే డేరా బాబా గుర్మీత్ సింగ్, రాధేమా, నిర్మల్ బాబా, రాంపాల్, ఆశారామ్ బాపూ, ఆయన కుమారుడు నారాయణ్ సాయి ఉన్నారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లోని వీరేంద్ర దీక్షిత్ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాల నుంచి 47 మంది మహిళలు, ఆరుగురు మైనర్ బాలికలను పోలీసులు విముక్తి చేశారు. ఈ ద్వారకా ఆశ్రమం దాదాపుగా జైలును తలపించేదిగా ఉందని, భక్తులను అందులో నిర్బంధించారని కూడా ఢిల్లీ మహిళా కమిషన్ అధినేత్రి స్వాతి మాలీవాల్ వెల్లడించిన విషయం తెలిసిందే. దేశంలోని అనేక అఖారాల మండలిగా అఖిల భారతీయ అఖారా పరిషత్ పనిచేస్తోంది. 8వ శతాబ్దం నాటి ఆది శంకరాచార్య ఆధ్యాత్మిక వారసత్వాన్ని, వారి విలువలను అందిపుచ్చుకుని ఈ సంస్థ నడుస్తోంది. ఈ తాజా జాబితాను విడుదల చేసి సంఘం అధ్యక్షుడు స్వామి నరేంద్ర గిరి మాట్లాడుతూ, ఈ తరహా నకిలీ బాబాల మాయకు లోనుకావద్దని సామాన్యులకు పిలుపునిచ్చారు. వీరందరూ కూడా ఏ రకమైన సంప్రదాయం, విలువలు లేనివారేనని, వీరి ద్వారా సాధువులు సన్యాసుల సమాజానికే తీరని కళంకం ఏర్పడుతోందని అన్నారు.



హిందూ సాధువుల సంస్థ విడుదల చేసిన నకిలీ బాబాల్లో కొందరు

'స్మార్ట్‌సిటీ' ఏమైంది?

▪ మోదీ భక్తులు ఏమంటారు?
▪ ప్రాజెక్టు వైఫల్యాలపై రాహుల్ విసుర్లు



ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వరస ట్వీట్లతో విరుచుకుపడ్డారు. ప్రియమైన మోదీ భక్తులంటూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని చూచించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ- ఈ ప్రాజెక్టుకోసం కేటాయించిన రూ.9860 కోట్లలో ఇప్పటివరకు కేవలం ఏడు శాతం నిధులనే ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆరోపించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు జూన్, 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఈ రెండేళ్ల కాలంలో కేంద్రం చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీలలో నీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ప్రజా రవాణ, ఇ-గవర్నెన్స్ లాంటి మౌలిక సాదుపాయాల కల్పనలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. అభివృద్ధిలో చైనా మనల్ని దాటి ముందుకు వెళుతుంటే మోదీ కేవలం నినాదాలకే పరిమితమయ్యారని అన్నారు. యువతకు ఉద్యోగాలను కల్పించేందుకు ఏంచేయాలో నరేంద్ర మోదీ భక్తులు తమ గురువుకు చూచించాలని రాహుల్ చురకలు అంటించారు. చైనాలోని షెంజేన్‌లో నూతన ఆవిష్కరణలు, సంస్కరణలకు సంబంధించిన వీడియోను కూడా రాహుల్ ట్వీట్ చేశారు.

నెలాంగ్ లోయలో రాజ్‌నాథ్ పర్యటన

కొత్త ఏడాది వేడుకలు అక్కడే

ఉత్తరాక్షి (ఉత్తరాఖండ్), డిసెంబర్ 31: కొత్త ఏడాది వేడుకలను హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉత్తరాఖండ్ రాష్ట్రం నెలాంగ్ లోయలో జరుపుకోబోతున్నారు. నెలాంగ్ లోయ పర్యటనకు వెళ్తున్న హోంమంత్రి చైనా బోర్డర్‌కు ఆనుకునివున్న ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్ దళాలతో కలిసి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకుంటారని హోంమంత్రి శాఖ అధికారులు వెల్లడించారు. సరిహద్దుల్లోని దళాలను కాస్త నియంత్రణలో ఉంచాలంటూ భారత్‌ను చైనా హెచ్చరించి రోజులు గడవకముందే హోంమంత్రి ఆ ప్రాంతానికి పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత సెప్టెంబర్‌లో సినో-ఇండియన్ బోర్డర్‌లో నాలుగు రోజులపాటు పర్యటించిన హోంమంత్రి, తిరిగి ఆదివారం నుంచి రెండోసారి సరిహద్దుల పర్యటనకు వెళ్తున్నారు. చైనాతో వివాదాస్పద డోక్లాం అంశంపై ప్రతిష్ఠంభన నెలకొన్న తరువాత, ఒక సీనియర్ మంత్రి రెండోసారి పర్యటనకు వెళ్లడం నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇదే ప్రథమం. సముద్ర మట్టానికి 11,700 అడుగుల ఎత్తులోవున్న నెలాంగ్ లోయలో బోర్డర్ అవుట్ పోస్ట్ వద్ద ఐటిబిపి దళాలతో కలిసి రాజ్‌నాథ్ కొత్త ఏడాది వేడుకలు జరుపుకుంటారు. చుట్టూ పర్వత సానువుల మధ్యనున్న లోయలో ఈ సీజన్ వాతావరణం భయానకంగా ఉంటుంది. మైనస్ 15 డిగ్రీల చలిలో దళాలు పహారాకాయాల్సి ఉంటుంది. భాగీరథ నదీ తీరాన 3,400 అడుగుల ఎత్తులో వున్న ఐటిబిపి 12వ బెటాలియన్ ప్రధాన కార్యాలయానికి రాజ్‌నాథ్ చేరుకుంటారు. అక్కడ జవాన్ల కుటుంబాలు ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తారు. అక్కడినుంచి పులం సుమ్ద, కోపాంగ్, భైరన్ ఘాటీలను సందర్శించి, అక్కడి జవాన్లతో మాట్లాడతారు. రాజ్‌నాథ్ వెంట ఐటిబిపి డైరెక్టర్ జనరల్ ఆర్‌కె పచండ వెళ్తున్నారు.

బాల నేరస్థుల పేర్లు వెల్లడించవద్దు

స్పష్టం చేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: మహిళలపై అత్యాచారానికి ఒడిగట్టినట్టు లేదా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక మైనర్ బాలుడికి సంబంధించిన వివరాలను ఏ దశలోనూ బహిర్గతం చేయడానికి వీల్లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. బాలనేరస్థుల న్యాయ చట్టానికి లోబడి నిందితుల పేర్లనుగానీ ఇతరత్రా వివరాలనుగానీ బయటపెట్టడానికి ఎంతమాత్రం వీల్లేదని హిమా కోహ్లీ, రేఖాపల్లితో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం తెలిపింది. జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం పన్నెండేళ్ల వయసున్నపుడు ఒక బాలుడు పాల్పడిన ఒక సంఘటన కారణంగా ఆ తర్వాత కాలంలో అతను రైల్వేలో కానిస్టేబుల్‌గా నియామకమైన తర్వాత అతనిని ఉద్యోగం నుండి తొలగించారు. ఈ సంఘటన తమ పరిశీలనలోకి వచ్చిన సందర్భంగా హైకోర్టు డివిజన్ బెంచ్‌కు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు తమ నిర్ణయాన్ని వెల్లడించారు.



రాయితీలపైనే రియల్టర్ల ఆశలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను, అలాగే ఆర్ఈఆర్ఏ ప్రభావానికి తీవ్రస్థాయిలో కునారిల్లిన రియల్టీరంగం కొత్త సంవత్సరంలోకి ఎన్నో ఆశలతో అడుగుపెట్టబోతోంది. ఈ మూడు కీలక సంస్కరణల ప్రభావానికి తీవ్రంగా లోనైన రియల్టీ రంగం ప్రస్తుతం నష్టాలను, కష్టాలను అధిగమించే కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టేందుకు సమాయత్తమవుతోంది. 2017 అంత ఆశాజనకంగా లేనప్పటికీ కొత్త సంవత్సరంలో ఈ నష్టాలన్నింటినీ అధిగమించి లాభాల బాటలో పురోగమించగలమన్న ఆశావహ దృక్పథం రియల్టర్లలో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దేశ ప్రజలందిరికీ అందుబాటులో ఉన్న ధరలకు ఆవాసాన్ని కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం, ఇందులో భాగంగా కల్పించబోతున్న రాయితీలపై రియల్టర్లు ఆశలు పెట్టుకున్నారు. కొత్త సంవత్సరంలో ఇళ్ల అమ్మకాలు భారీగా అదీ క్రమానుగతంగా పెరగడం ఖాయమని భావిస్తున్న రియల్టర్లు గత రెండు



మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు ధరల స్థిరీకరణకు దోహదం చేయగలవని ఆశిస్తున్నారు. ముఖ్యంగా ఇళ్ల రుణాలపై వడ్డీ రేట్లు తగ్గడం కూడా కొత్త ఏడాదిలో తమ పంట పండినట్టేనన్న ఆశ వీరిలో బలంగా కనిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా నిరాశమయంగానే సాగిన ఇళ్ల అమ్మకాలు కొత్త సంవత్సరంలో వేగాన్ని సంతరించుకోగలవని, ప్రస్తుతం 5 నుండి 6 లక్షల వరకు అమ్మకుండా మిగిలిపోయిన ఇళ్లను విక్రయించగలుగుతామన్న ధీమా కూడా వీరిలో కనిపిస్తోంది. ముఖ్యంగా సగంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తిచేయడంపైనే కొత్త యేడాదిలో దృష్టి పెట్టాలని, వాటి విక్రయానికి సంబంధించి కూడా వ్యూహాత్మక రీతిలో అడుగులు వేయడంతోపాటు రుణ భారాన్ని కూడా తగ్గించుకోగలమని డెవలపర్లు ఆశిస్తున్నారు. 2017లో కొత్త ప్రాజెక్టులను చేపట్టడం మాట ఎలావున్నా, కట్టిన ఇళ్లనే అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని, అందుకు ప్రధాన కారణం పెద్దనోట్ల రద్దు, రియల్టీ రంగాన్ని నియంత్రించే ఆర్ఈఆర్ఏ చట్టం, అన్నింటికీ మించి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ప్రభావమేనని రియల్టర్లు చెబుతున్నారు. వీటి కారణంగా 30 నుండి 50 శాతం వరకు ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం ఆగిపోయాయని, ఏడు ప్రధాన నగరాల్లో ఇదే పరిస్థితిని రియల్టర్లు ఎదుర్కొంటున్నట్టు ఓ కన్సల్టెన్సీ సంస్థ తెలిపింది. కొత్త సంవత్సరంలో కోటి ఆశలతో అడుగుపెడుతున్న రియాల్టీ రంగం గత వైభవాన్ని పునరుద్ధరించుకోగలమన్న ధీమాతో ఉంది.

అవినీతే అడ్డుగోడ

పెట్టుబడులకు జంకుతున్న విదేశీ ఇన్వెస్టర్లు ▪ అంతర్జాతీయ సంస్థ క్రోల్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలంటే అవినీతి ఓ పెద్ద ప్రతిబంధకంగా మారుతోందని, అందుకే విదేశీ మదుపుదారులు ధైర్యంగా ముందుకు రావడం లేదని అమెరికాకు చెందిన ఓ యాజమాన్య నిర్వహణ సంస్థ క్రోల్ వెల్లడించింది. భారతదేశంలో అనేక రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడానికి అవకాశాలు ఉన్నప్పటికి కూడా అవినీతి కారణంగానే ఇన్వెస్టర్లు ఒకటికి రెండు సార్లు ఆలోచించి అడుగులు వేయాల్సి వస్తోంది ఈ సంస్థ తెలిపింది. 2014లో మోదీ సారథ్యంలో బలమైన, స్థిరమైన కేంద్ర ప్రభుత్వం ఆవిర్భవించినప్పటికి కూడా విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడి అనుకూల అవకాశాల కోసం ఎదురుచూశారని, అలాగే వ్యాపార నిర్వహణలోనూ గుణాత్మకమైన మార్పులనూ ఆశించారని ఈ సంస్థ వెల్లడించింది. కానీ ఆశించినట్టుగా భారతదేశంలో వ్యాపార నిర్వహణకు సంబంధించి మార్పులు రాలేదని ఈ కన్సల్టెన్సీ సంస్థ తెలిపింది. ముఖ్యంగా ప్రభుత్వం ఎప్పుడు ఏరకమైన ప్రతికూల నిర్ణయం తీసుకుంటుందోన్న ఆందోళన ఇన్‌వెస్టర్లను నిరంతరం పీడిస్తోందని, అలాగే నిరుద్యోగం కారణంగా తలెత్తే అవకాశం ఉన్న సాంఘిక అనిశ్చితి కూడా ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. వీటితోపాటు రాష్ట్రస్థాయిలో ప్రతికూల రాజకీయాలు, బ్యాంకింగ్ వ్యవస్థ రాని బాకీలతో కునారిల్లం కూడా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు సంబంధించి ఉత్సాహంగా రాకపోవడానికి ప్రధాన హేతువుగా మారాయని ఈ సంస్థ తెలిపింది. అయితే, మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారానికి సంబంధిచిన ప్రతికూలతలు తొలగాయా అన్న అంశంపైన ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ భాటియా సానుకూలంగానే స్పందించారు. మోదీ హయాంలో వ్యాపార అనుకూల పరిస్థితులు బలపడినప్పటికీ ఇంకా ఎంతో జరిగి ఉండాల్సి ఉందన్న అభిప్రాయం విదేశీ ఇన్వెస్టర్లలో చాలా బలంగా కనిపించదన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం హామీల ప్రాతిపదికగా భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చినందున వ్యవస్థాగతంగా విస్తృత మార్పులు వస్తాయని విదేశీ ఇన్వెస్టర్లు ఆశించారని, కానీ దురదృష్టవశాత్తూ ఆశించిన రీతిలో వ్యవస్థాగతమైన మార్పులు చోటుచేసుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలను ప్రక్షాళన చేసే లక్ష్యంతో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టినప్పటికీ అంతమంగా అవి ఎంతమేరకు ఆశించిన ఫలితాలు అందిస్తాయన్నది ఇప్పటికీ స్పష్టం కావడం లేదని ఈ సంస్థ తెలిపింది. ప్రభుత్వ ఉదాత్త ఆశయాలతో సంస్కరణలను చేపట్టినప్పటికీ అవినీతి కారణంగా అనుకున్న ప్రయోజనాలు సిద్ధించడం లేదని, పేదలకు ప్రయోజనాలు కూడా అందడం లేదని ఈ సంస్థ తెలిపింది. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్నును ప్రవేశపెట్టడం, అన్నిరంగాల్లోనూ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడం, వ్యాపార అనుకూలతను పెంపొందించడం వంటి చర్యలు వ్యవస్థలో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని ప్రో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. అయితే, అవినీతిని అదుపు చేయడంలో ఇంకా ఎంతో కృషి జరగాల్సి ఉందని, ఇప్పటికీ అనేక రంగాలు ఈ జాఢ్యం బారిన పడి కునారిల్లడం వల్లే 20 శాతానికి పైగా విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులతో ముందుకు రావడానికి సందేహిస్తున్నారు.


జల రవాణాకు ఇక మహర్దశ

పదివేలకు పైగా జల విమానాల కొనుగోలు ▪ కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: భారత ఉపరితల, జల రవాణాకు రానున్నది మహర్దశనన్న సంకేతాలను రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అందించారు. సమీప భవిష్యత్తులోనే భారతదేశం పదివేలకు పైగా సముద్ర విమానాలను అందిపుచ్చుకోబోతోందని, అలాగే ఈ హైవేల నిర్మాణంలోనూ కొత్త పుంతలు తొక్కబోతోందని గడ్కరీ తెలిపారు. అన్నివిధాలుగా జలరవాణాను ఆసక్తికరంగా, ఉత్తేజభరితంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికేతర రీతిలో గడ్కరీ ముందుకు సాగుతున్నారు. ఈ సరికొత్త జల రవాణా విధానానికి సంబంధించి తన ఆలోచనలను ఆవిష్కరించిన గడ్కరీ పదివేలకు పైగా సముద్ర విమాన సర్వీసులను లాభదాయకమైన రీతిలో సద్వినియోగం చేసుకోగలిగే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు. దేశంలో నాలుగు లక్షల వరకు జలాశయాలు ఉన్నాయని, అలాగే వేలాది ఆనకట్టలు, రెండువేలకు పైగా సముద్ర రేవులు, రెండువందలకు పైగా చిన్న రేవు పట్టణాలు ఉన్నాయని, మరో 12 భారీ రేవులు ఉన్నాయని గడ్కరీ స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరలో ఒకే ఇంజన్ కలిగిన సముద్ర విమానాలను ప్రవేశపెట్టే అంశంపై దృష్టి సారించాలని విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజును తాను ఇప్పటికే కోరానని గడ్కరీ తెలిపారు. భారతదేశంలోనున్న జలనిధులను బట్టి చూస్తే సముద్ర విమాన రవాణాను అత్యంత సునాయాశంగా నిర్వహించే అవకాశం ఉంటుందని, కేవలం 300 మీటర్ల రన్‌వేతోనే ఇవి పనిచేయగలుగుతాయని ఆయన తెలిపారు.

గంటకు 400 కిలోమీటర్ల వేగంతో ఈ విమానాలు పయణించగలుగుతాయని, త్వరలోనే వీటిని రంగంలోకి దింపేందుకు అవసరమైన నియమనిబంధనలను ఉపరితల రవాణా, పౌరవిమానయాన మంత్రిత్వ శాఖలు ఖరారు చేస్తాయని తెలిపారు. కేవలం సముద్ర విమానాలే కాకుండా కదిలే నగరాలు కూడా సముద్ర వ్యాహాలిలో భాగంగా అందించాలన్నది తన ఆలోచనగా గడ్కరీ వెల్లడించారు. అలాగే కొత్త సంవత్సరంలో ఉపరితల, జలరవాణాను అన్నివిధాలుగా ఆశక్తికరంగా తీర్చిదిద్దేందుకు కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తానని తెలిపారు.





గత ఏడాది మొత్తంగా బిఎస్ఇ సెన్సెక్స్ ఇండెక్స్ ఏవిధంగా దూసుకుపోయిందీ ఈ గ్రాఫ్‌లో చూడవచ్చు.

మెరుగు పడితేనే మనుగడ

ఎయిరిండియా ఉద్యోగులకు ఛైర్మన్ పిలుపు



ఎయిరిండియా అధినేత ప్రదీప్‌సింగ్


ముంబయి, డిసెంబర్ 31: వృతిపరమైన నైపుణ్యాన్ని, ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకుంటేనే పోటీ మార్కెట్‌లో నిలబడి మనుగడను కాపాడే అవకాశం ఉంటుందని ఎయిరిండియా అధినేత ప్రదీప్‌సింగ్ ఖరోలా సిబ్బందికి బలమైన హెచ్చరిక సందేశాన్ని అందించారు. ప్రస్తుత జాఢ్యాల కారణంగా ఈ సంస్థ కుప్పకూలిపోకుండా ఉండాలంటే తమముందున్న బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులు ఉత్పాదకతను పెంపొందించాలని, అలాగే వృత్తిపరంగానూ మరింత పదును దేరాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత సమస్యల కూలం నుండి ఎయిరిండియా బైటపడాలంటే అందుకు ప్రతి ఉద్యోగి సహకారం ఎంతో అవసరమని ఉద్ఘాటించారు. పనితీరును మెరుగుపరుచుకుంటూ సరికొత్త ఉత్పాదకతను అలవరుచుకుంటే ఎయిరిండియా గట్టెక్కగలుతుందని, అనతికాలంలోనే లాభాల బాట పడుతుందని ఆయన వెల్లడించారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడం వల్ల నిర్వహణపరమైన కొన్ని అంశాలకు సంబంధించి ఎయిరిండియా మంచి ఫలితాలు సాధించగలిగిందని, అయినా కూడా సంస్థ పూర్తిస్థాయిలో మెరుగుపడాలంటే ప్రతిఒక్కరూ మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులకు నూతన సంవత్సర సందేశం అందించిన ఖరోలా నష్టాల్లో నడుస్తున్న ఎయిరిండియాను ఆదుకునే ఉద్దేశ్యంతో వ్యూహాత్మక డిజిన్వెస్ట్‌మెంట్ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్న ఆయన ఉద్యోగులందరూ సంస్థను గట్టెక్కించాలన్న బాధ్యతతో పనిచేయాలన్నారు. అన్నిరకాల అవరోధాలను అధిగమించి ఎయిరిండియా సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వెలుగులోకి తేవాలన్నారు.

‘ఇంధన పొదుపు’ నామ సంవత్సరం!

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరగాలని, సుఖసంతోషాలతో వర్థిల్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. 2018ని ‘సుస్థిర ఇంధన సామర్థ్యం సంవత్సరం’గా ప్రకటించిన ఆయన.. విద్యుత్ పొదుపులో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. 2018లో రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ ‘విద్యుత్ పొదుపు గృహం’గా మార్చాలని అభిలషించారు. ఇంధన సంరక్షణ ప్రయోజనాలను ప్రస్తుత, భవిష్యత్ తరాలకు అందజేసేలా ప్రణాళికను రూపొందించాలన్నారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో అమరావతిలో అంతరాయం లేని, నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలన్నారు. ఇందుకోసం దాదాపు రూ.16,383 కోట్లు వ్యయమయ్యే ప్రణాళిక సిద్ధమైందన్నారు. ప్రపంచ శ్రేణి గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా నిర్మిస్తున్న అమరావతిలో ఎక్కడా ఓవర్ హెడ్ విద్యుత్ లైన్లు కనిపించడానికి వీల్లేదని, భూగర్భంలోనే లైన్లు వేయాలని సూచించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర, ‘సుస్థిర ఇంధన సామర్థ్య ఏడాది’ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లలో విద్యుత్‌ను ఆదాచేసే సమర్థమైన (స్టార్ రేటెడ్) ఎలక్ట్రానిక్ ఉపకరణాల వాడకాన్ని మరింత పెంచాలని సూచించారు. అప్పుడే రాష్ట్రం ఇంధన పొదుపులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు విద్యుత్‌ను ఆదాచేసి ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు, బల్బ్‌లు, ఫ్యాన్లు వంటి స్టార్ రేటెడ్ గృహోపకరణాలను సరసమైన ధరలకు అందజేయాలని సీఎం తెలిపారు. ఈ ఉపకరణాలను నేరుగా లేదా

- అమరావతిలో రూ. 16,383 కోట్లతో విద్యుత్ సరఫరా వ్యవస్థ
- ప్రతి ఇంటినీ ‘విద్యుత్ సామర్థ్య గృహం’గా మార్చాలి
- జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులు ప్రజలకే అంకితం
- 30 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలతో ప్రపంచ రికార్డు సాధిద్దాం
- టెలీకాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు



సులభమైన నెలవారీ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో విక్రయించాలని సూచించారు. ఇది తమ ప్రభుత్వం ప్రజలకు అందించే నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. స్టార్ రేటెడ్ ఉపకరణాలను వాడడం వల్ల 30-40 శాతం విద్యుత్ ఆదా అవుతుందని, ఫలితంగా కరెంట్ బిల్లులు తగ్గడమేక గాక, పర్యావరణానికి హానిచేసే గ్రీన్ హౌస్ వాయువులు కూడా తగ్గుతాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలు, నెడ్‌క్యాప్, సోలార్ పవర్ కార్పొరేషన్ గత మూడేళ్లలో దాదాపు 20 ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించడం మన పనితీరుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా ఇంధన పొదుపులో ఆంధ్రప్రదేశ్ వరసగా మూడేళ్లు జాతీయ అవార్డులు అందుకుని హ్యాట్రిక్ సాధించడం మనందరికీ గర్వకారణమని, ఈ అవార్డులు ప్రభుత్వంపై మరింత బాధ్యతను పెంచాయన్నారు.

జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులన్నింటినీ రాష్ట్ర ప్రజలకు అంకితం ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ప్రతిష్ఠాత్మక ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించిందంటూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కితాబివ్వడం మనకెంతో గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు సహా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్‌ను అందించడం ద్వారా ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనుందని రాష్ట్రపతి పేర్కొనడం మనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీలన్నింటిలో 30లక్షల ఎల్ఈడీ వీధిదీపాలను అమర్చడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాలని ఆకాంక్షించారు. దీనివల్ల ఏటా 333 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని, ఫలితంగా దాదాపు రూ.200 కోట్ల మేర ఆర్థిక లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి వివరించారు. ఇంధన సంరక్షణలో ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుందని, ఒక అంచనా మేరకు 1800 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పొదుపు చేయడం ద్వారా సుమారు రూ.900 కోట్లు ఆదా అయ్యాయని, 4.5 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించగలిగామని వెల్లడించారు.

ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి కళావెంకటరావు, ఐటీ, కమ్యూనికేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, సీఎం ప్రత్యేక సీఎస్ సతీష్‌చంద్ర, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ జవహర్‌రెడ్డి, ఇంధన, ఐ అండ్ ఐ, సీఆర్‌డీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ, జెన్‌కో ఎండీ కె విజయానంద్, ఇంధన శాఖ సలహాదారు కె రంగనాథం, ట్రాన్స్‌కో జాయింట్ ఎండీలు దినేష్ పరుచూరి, ఉమాపతి, డిస్కంల సీఎండీలు ఎంఎం నాయక్, హెచ్‌వై దొర, కమిషనర్ రామాంజనేయులుతో అనేక రంగాలపై టెలిఫోన్ ద్వారా చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో ఇంధన సంరక్షణకు చేపడుతున్న, చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి అజయ్ జైన్ ముఖ్యమంత్రికి వివరించారు.

ఆర్థిక ఫలితాలు ఎలా ఉంటాయో?

మార్కెట్ వర్గాల ఎదురుచూపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: సూక్ష్మ ఆర్థిక అంచనాల సానుకూలత, ఆటోమొబైల్ అమ్మకాలపైనే మార్కెట్ ఎదురుచూస్తోందని, ఇదే ఆశతో కొత్త సంవత్సరం తొలి వారంలో అడుగుపెట్టబోతోందని నిపుణులు చెబుతున్నారు. అలాగే అనేక కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఏవిధంగా ఉంటాయన్నది కూడా మార్కెట్ లావాదేవీలను ప్రభావితచేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అనేక కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు లాభదాయకమైన రీతిలో ఉండడమేకాకుండా వృద్ధి అంచనాలను సంతృప్తి పరచగలమన్న నమ్మకాన్ని ఇన్వెస్టర్లు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దేశీయ మార్కెట్ ప్రాథమికంగా సానుకూల అంశాలతో సాగడం వల్ల కొత్తవారం ఆశాజనకంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. అలాగే చమురు ధరలు, అలాగే అమెరికా ఫెడరల్ బ్యాంకు అంచనాలపై కూడా విదేశీ ఇన్వెస్టర్లు ఆశలు పెట్టుకున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ కొత్త బడ్జెట్, ప్రభుత్వం చేపట్టనున్న సంస్కరణలు కూడా ఏఏ రంగాలకు పెట్టుబడులు తరలివచ్చే అవకాశం ఉందన్న అంశాన్ని నిర్దేశించే అవకాశం ఉంది. అలాగే ఉత్పాదక, సర్వీసు రంగాలకు సంబంధించిన వివరాలు కూడా కొత్త వారంలో మార్కెట్ గతిని నిర్దేశించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అన్నిటికంటే మించి మూడో త్రైమాసిక ఫలితాలే మార్కెట్‌కు ఊతాన్నిచ్చే అవకాశం ఉంటుదని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ అధికారంలోకి రావడం కూడా 2018 ఆర్థిక బడ్జెట్‌పై అంచనాలను పెంచిందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగానూ కొత్త బడ్జెట్ ఉండే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.



ద్విచక్ర వాహనంపై ఇద్దరు మించి ప్రయాణించడానికి వీలులేదు. అలాంటిది ఓ చిన్న స్కూటర్ మీద ఏకంగా 9 మంది పిల్లలతో ప్రయాణం సాగిస్తున్నాడు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆదివారం నాటి దృశ్యమిది

అందుబాటులోకి పౌష్టికాహారం

కేంద్ర ప్రభుత్వానికి అసోచామ్ సూచన

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశ ప్రజలందరికీ పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తెచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఇందుకు వీలు కల్పించేలా విధానపరమైన, అమలు యోగ్యమైన సంస్కరణలను తీసుకురావాలని అసోచామ్ ఓ నివేదికలో స్పష్టం చేసింది. అందరికీ పౌష్టికాహారం అందుబాటులోకి వచ్చేవిధంగా తక్కువ ధరకే ఇది లభ్యమయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. దేశంలో వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు పౌష్టికాహార ఉత్పత్తికి సంబంధించి తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అసోచామ్ తెలిపింది. ఈ సమస్యను పరిష్కరించి సవాళ్లను అధిగమించేందుకు రెండంచల విధానాన్ని ప్రభుత్వానికి సూచించింది. స్థూల, సూక్ష్మ పౌష్టికాహార అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇటు కంపెనీలు, అటు ప్రభుత్వం కలసికట్టుగా పనిచేయాలని, ఆవిధంగా ఆరోగ్యాన్ని పెంపొందించే ఆరోగ్య పదార్థాలను అందరికీ అందుబాటులో ఉండే ధరలకే అందించాలని అసోచామ్ తెలిపింది. అలాగే సమతూకంతో కూడిన, వైవిధ్య ఆహార ఆవశ్యకతపై కూడా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసిన అసోచామ్ వ్యవసాయ రంగానికి సంబంధించి కూడా కొన్ని మార్పులను తీసుకురాలని కూడా తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లల్లో యాభై శాతం మంది భారత్‌లోనే ఉన్నారని తెలిపింది. మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసే దిశగా రైతాంగాన్ని ప్రోత్సహించాలని, ఇందులో భాగంగా దిగుబడి, తటస్థ వ్యవసాయ విధానాన్ని పెంపొందించాలని ప్రభుత్వానికి సూచించింది.

ASSOCHAM INDIA

Market Capitalisation

(in ₹ Crores)

TOTAL GAIN 19740 · TOTAL LOSS -21319

Company	Gain/Loss	29 DEC	22 DEC
RIL	1615	583347	581732
TCS	11601	516934	505334
HDFC BANK	-598	485273	485870
ITC	-246	320731	320976
HUL	3561	296122	292562
MARUTI	939	293965	293025
HDFC	420	273252	272832
SBI	-8934	267162	276096
ONGC	1604	249799	248195
Infosys	-11542	226978	238520

గత వారం మార్కెట్ ముగిసేనాటికి టాప్- కంపెనీల మార్కెట్ విలువలు ఇలా ఉన్నాయి

బెజవాడలో నేటి నుంచి పుస్తకాల పండగ

★ హాజరుకానున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: నూతన సంవత్సరంలోకి అడుగిడబోతున్నామంటే తొలుత అందరికీ గుర్తుకొచ్చేది గత 28ఏళ్లుగా నిరాటంకంగా జరుగుతూ వస్తున్న బెజవాడ పుస్తక మహోత్సవం. పుస్తకప్రియులు నూతన సంవత్సరం రాకతో పాటే పుస్తకాల పండుగ కోసం నిరీక్షిస్తుంటారు. దీనికి కారణం లేకపోలేదు. నగరంలోని స్వరాజ్య మైదానంలో ఈసారి ఏకంగా 300 స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. ప్రపంచంలో మూల మూలలా దొరికే పుస్తకాలు సైతం ఇక్కడ లభిస్తాయి. సంక్రాంతి పర్వదినానికి తరలివచ్చేవారు ఈ పుస్తక మహోత్సవాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని నగరానికి రావడం సంప్రదాయంగా మారింది. ఈసారి ప్రత్యేకత ఏమిటంటే పుస్తక సంబరాలను ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించబోతున్నారు.

అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే సదస్సులోనూ వీరు పాల్గొంటారు. ఈ నెల 11 వరకు జరిగే పుస్తక మహోత్సవానికి భారీగా పాఠకులు, పుస్తక ప్రియులు తరలివచ్చేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షుడు డి అశోక్‌కుమార్, అధ్యక్షుడు ఎస్ వెంకటనారాయణ, కార్యదర్శి కె లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు టి మనోహరనాయుడు, కోశాధికారి కె రవి, మీడియా కన్వీనర్ బాబ్జీ, తదితరులు ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజూ సాయంత్రం పలు పుస్తకాల ఆవిష్కరణలతో పాటు సాహితీ సదస్సులు జరుగనున్నాయి. తొలిరోజు సాయంత్రం అన్ని పక్షాల ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

1వ తేదీన 'నన్ను ప్రభావితం చేసే పుస్తకం', 2న తెలుగు భాష - వికాసం, 3న 'సాహితీ సృజనలో మహిళలు' అంశాలపై చర్చ జరుగుతుంది. 4న సాయంత్రం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ నుంచి పుస్తక ప్రియుల పాదయాత్ర జరుగుతుంది. 5న 'కథ', 6న 'తెలుగు సాహిత్యంలో హాస్యం', 7న 'నవల - విమర్శ - తీరుతెన్నులు', 8న 'తెలుగు సాహిత్యంలో యువ స్వరాలు', అనంతరం కవి సమ్మేళనం, 9న 'కవిత్వం', 10న 'తెలుగువారికే ప్రత్యేకమైన ప్రక్రియలు' తదితర అంశాలపై చర్చాగోష్టులు, ప్రసంగాలు ఉంటాయి. 11న ముగింపు సదస్సులో విద్యార్థులకు పోటీలు, బహుమతి ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

క్లినికల్ ట్రయల్స్‌లో ఫార్మ్-డి అభ్యర్థుల సేవలు

★ పరిశీలించాలని కేంద్రానికి ఎమ్మెల్సీ వీర్రాజు లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: అమెరికా ఎఫ్‌డీఏ అనుసరిస్తున్న తరహాలో దేశంలో కూడా డాక్టర్ ఆఫ్ ఫార్మసీ (ఫార్మ్-డి) పూర్తి చేసిన వారి సేవలను క్లినికల్ ట్రయల్స్‌లో ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకాష్ నడ్డాకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు లేఖ ఆదివారం రాశారు. వీరిని క్లినికల్ ట్రయల్స్‌లో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించాలని సూచించారు. ఫార్మకాలజీ, ఫార్మకోథెరపీ, క్లినికల్ రీసెర్చి, బయో ఫార్మటిక్స్ వంటి అంశాలతో వీరికి సంబంధం ఉంటుందని గుర్తుచేశారు.

వేర్వేరు సంఘటనల్లో తొమ్మిదిమంది మృతి

గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని అడిగొప్పల యర్రవాగు మూలమలుపు వద్ద మినీ ట్రాలీ వ్యాన్, కమాండర్ జీపు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, కడప జిల్లా మైదుకూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో కేసీ కెనాల్ కల్వర్టు వద్ద ఆదివారం బొలెరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. అదేవిధంగా అనంతపురం జిల్లాలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో నీటిగుంతల్లో పడి ముగ్గురు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే...




గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని అడిగొప్పల యర్రవాగు మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కమాండర్ జీపు, మినీ వ్యాన్

దుర్గి, డిసెంబర్ 31: మినీ ట్రాలీ వ్యాన్, కమాండర్ జీపు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని అడిగొప్పల యర్రవాగు మూలమలుపు వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కారంపూడి నుండి ప్రయాణికులతో మాచర్ల వెళుతున్న కమాండర్ జీపు, అడిగొప్పల యర్రవాగు బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న మినీ ట్రాలీ వ్యాను ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో జీపు డ్రైవర్ ఎస్‌కె మస్తాన్ వలీ(38), దుర్గి మండలం కాకిరాల గ్రామానికి చెందిన పిట్టా మంగమ్మ(70), మరో గుర్తు తెలియని వృద్ధురాలు(62) అక్కడికక్కడే మృతి చెందారు. మినీ ట్రాలీ వ్యాన్ డ్రైవర్ అజయ్‌తో పాటు వేమవరం గ్రామానికి చెందిన పొదిలి సైదమ్మ, కంకణాల పద్మ, గురులక్ష్మి, మంగమ్మ, మల్లీశ్వరి, అడిగొప్పల గ్రామానికి చెందిన ఆవుల పుల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న గురజాల డీఎస్పీ ప్రసాద్, మాచర్ల సీఐ దిలీప్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ బి సుబ్బానాయుడు, కారంపూడి ఎస్‌ఐ మురళీ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ వివరించారు.

నీటిగుంతలో పడి ముగ్గురి మృతి

అగళి: అనంతపురం జిల్లాలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో నీటిగుంతల్లో పడి ముగ్గురు మృతిచెందారు. వివరాలు..


అగళి మండల పరిధిలోని ఇరిగేపల్లి గొల్లహట్టికి చెందిన చిత్తన్న భార్య పుట్టమ్మ(28), తిమ్మన్న భార్య పుట్టమ్మ(30) మధ్యాహ్నం దుస్తులు ఉతకడానికి ఇరిగేపల్లిచెరువు సమీపంలో ఉన్న కుంట వద్దకు వెళ్లారు. అయితే వారు కాలు జారి నీటి గుంతలో పడడంతో మృతిచెందారు. అలాగే లేపాక్షి మండల పరిధిలోని చోళసముద్రం ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న నీటి కుంటలో దుస్తులు ఉతికేందుకు వెళ్లి పులమతి గంగమ్మ(70) ప్రమాదవశాత్తూ నీటికుంటలో పడి మృతి చెందింది. ఆయా సంఘటనలపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని ముగ్గురి దుర్మరణం

మైదుకూరు : కడప జిల్లా మైదుకూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో కేసీ కెనాల్ కల్వర్టు వద్ద ఆదివారం బొలెరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. వివరాలు.. మైదుకూరు పట్టణానికి చెందిన రామిశెట్టి రవి(35), దొర్ల సుబ్బరాయుడు(28), జోసఫ్‌పేటకు చెందిన సిద్దికుంట చంద్ర(40)తో పాటు మరికొందరు రాత్రి 8:30 గంటల సమయంలో కేసీ కెనాల్ కల్వర్టుపై కూర్చుని ఉన్నారు. అయితే అదే సమయంలో కడప నుంచి అతివేగంగా వచ్చిన బొలెరో వాహనం మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కల్వర్టుపై కూర్చుని ఉన్న వీరిని ఢీకొనడంతో రవి, సుబ్బరాయుడు, చంద్ర అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే మరికొందరు కేసీ కాలువలోకి పడిపోవడంతో తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ బీఆర్ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అలాగే మృతదేహాలను ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా బొలెరో వాహనం డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఖాజీపేటకు చెందిన డ్రైవర్ బాషాను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

తెలంగాణలో సింగరేణి విద్యుత్ వెలుగులు

★ జాతీయ స్థాయిలో 4వ స్థానానికి ఎదిగిన ఎన్‌టీపీసీ
★ రాష్ట్రానికి 10,658 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా
★ సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ వెల్లడి



సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం

కొత్తగూడెం, డిసెంబర్ 31: సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి సంస్థ రికార్డు సృష్టిస్తోంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీరుస్తూ దేశంలోని పలు రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేస్తూ జాతీయ స్థాయిలో నాలుగో స్థానానికి ఎదిగింది.

ఈ ఏడాది డిసెంబర్‌లో అత్యధికంగా 99.5 శాతం పిఎల్‌ఎఫ్‌తో కొత్త రికార్డు నెలకొల్పింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి విద్యుత్ సంస్థ 10 వేల 658 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తోందని సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ శ్రీధర్ ప్రకటించారు. సెంట్రల్ ఎలక్ట్రికల్ అథారిటీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంపిక చేసిన అత్యుత్తమ థర్మల్ విద్యుత్ కేంద్రాలలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు.

18 నెలల వ్యవధిలో ప్రారంభమైన సింగరేణి విద్యుత్ కేంద్రం జాతీయ స్థాయిలో 4వ స్థానానికి ఎదగడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు.

డిసెంబర్ చివరి నాటికి 1వ యూనిట్ 5.977 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా 5.590 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసిందన్నారు. 2వ యూనిట్‌లో ఇప్పటివరకు 5.415 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా 5.068 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ రాష్ట్రం చేయూత అందిస్తోందని చెప్పారు.

బంగారు తెలంగాణ రాష్ట్ర లక్ష్యం కోసం తెలంగాణ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరాకు కృషి చేస్తోందన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సేవలను అభినందించారు.

కొత్త సంవత్సరంలోనైనా

నిర్మాణాత్మక పాత్ర పోషించండి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, డిసెంబర్ 31: నూతన సంవత్సరంలోనైనా ప్రభుత్వంపై వైసీపీ బురద జల్లడం మానుకుని నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని బనగానపల్లి ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి హితవు పలికారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పనిని విమర్శించడం, అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా 2017లో వైసీపీ వ్యవహరించిందని, ఇకనైనా ఆ లక్షణాన్ని వదులుకోవాలని నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఇక్కడో ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై వైసీపీ నేత బొత్స సత్యనారాయణ చేసిన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి వైసీపీ తనవంతు బాధ్యతగా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కష్టాల్లో ఉన్న ఏపీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు తెలుగుదేశం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. వీధివీధినా సిమెంట్ రోడ్లు వేసేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో రాజధాని నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు.

1వ పేజీ తరువాయి

శాంతి భద్రతలపై రాజీ పడొద్దు

నిర్వహించింది. పెద్దఎత్తున పోలీసు సాయుధ దళాలు పరేడ్ నిర్వహించాయి. ప్రత్యేక వాహనంపై ముందుకు సాగుతూ బెటాలియన్ కంటింజెన్సీ బృందాల గౌరవ వందనం స్వీకరిస్తూ బలగాల కవాతును ఆయన పరిశీలించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో నండూరి మాట్లాడుతూ తన 33ఏళ్ల పోలీసు సర్వీసులో తల్లిదండ్రులు, భార్యాపిల్లల నుంచి కావాల్సినంత సహకారం లభించిందని చెప్పారు. తన హైస్కూలు స్థాయిలో చదువుచెప్పి తీర్చిదిద్ది ఇంతటి ఉన్నత స్థాయికి కారకులైన అధ్యాపకులు బాలకృష్ణమూర్తి, రామకృష్ణారావులకు పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. తాను 1985లో నాగపూర్ సివిల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందిన తర్వాత 1987లో బెల్లంపల్లి ఎఎస్పీగా తొలి బాధ్యతలు చేపట్టానన్నారు. అప్పట్లో రాష్ట్రంలో తీవ్రవాద సమస్య ఉండేదని, ఐపీఎస్ అధికారులు కేఎస్ వ్యాస్, ఉమేష్‌చంద్ర, పరదేశీనాయుడుతో పాటు 600 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. శిక్షణ సమయంలో ఓ పీఇటీ ఇచ్చిన సలహాను ఇప్పటికీ పాటించడం వల్లే విధి నిర్వహణలో తప్పుచేసిన వారిని మందలించడం తప్ప శాఖాపరమైన చర్యలు ఏనాడూ తీసుకోలేదని, మాటలతో తప్ప రాతలతో బాధించలేదన్నారు. గత దశాబ్దకాలంగా నిర్వహించిన పదవులకు తాను అలంకారమే తప్ప పదవులు తనకు అలంకారం కాదన్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన సహకారం మరువలేనిదని, అప్పుడే సంస్కరణలకు శ్రీకారం చుట్టానన్నారు. దీనిలోభాగంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు 120 బస్టేషన్లు ఆధునీకరించినట్లు చెప్పారు. తర్వాత డీజీపీగా వచ్చాక పోలీసు శాఖ ఇమేజ్‌ను పెంచేందుకు అనేక ఆవిష్కరణలు చేపట్టినట్లు చెప్పారు. డీజీపీ కార్యాలయం నిర్మాణం ప్రధానమైందన్నారు. 18 మాసాల తన పదవీకాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి చినరాజప్ప ఎంతగానో సహకరించారని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

కొత్త డీజీపీ ఎం మాలకొండయ్య మాట్లాడుతూ నండూరి తనకు అన్నలాంటి వారని, ఆయన నుంచి తాను బాధ్యతలు స్వీకరించడం ఇది ఐదోసారి అని చెప్పారు. గతంలో మెదక్, గుంటూరు, పోలీసు అకాడమీ, కాకినాడ, ఆర్టీసీ, తదితరచోట్ల ఆయన నుంచి బాధ్యతలు అందుకున్నాని గుర్తుచేశారు. పని విషయంలో నండూరి స్పష్టంగా ఉంటారని, తనకు శాఖాపరంగా, వ్యక్తిగతంగా ఎంతో సహకారం అందించారని, ఇదే సహకారం రానున్న రోజుల్లో కూడా తీసుకుంటానన్నారు. పోలీసు సంక్షేమం, శిక్షణ విభాగాల్లో ఆయన తీసుకొచ్చిన కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు. తర్వాత బాధ్యతల నుంచి రిలీవ్ అయిన నండూరిని బయటకు తోడ్కొని వచ్చి ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంలో ఎక్కించి ముందుకు లాగుతూ సాదర వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాన్ని ఐజీ బెటాలియన్స్ ఆర్పీ మీనా నిర్వహించగా విజయవాడ పోలీసు కమిషనర్ దామోదర గౌతం సవాంగ్, ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్, ఇంటిలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, అదనపు డీజీలు ద్వారకాతిరుమలరావు, ఎన్వీ సురేంద్రబాబు, హరీష్‌కుమార్ గుప్తా, ఐజీలు, డీఐజీలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం

అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని డీజీపీ ఛాంబర్‌లో నండూరి నుంచి మాలకొండయ్య బాధ్యతలు తీసుకుని రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. ఈసందర్భంగా ఉన్నతాధికారులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈసందర్భంగా ఉన్నతాధికారులతో సమావేశమైన డీజీపీ మాలకొండయ్య శాంతిభద్రతలపై సమీక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడరాదని ఆదేశించారు. పోలీసు శాఖలో సాంకేతికత, నేరాల కట్టడి, సైబర్ నేరాలను నిలువరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచించారు.

ప్రధాని పదవిపై ఆశ లేదు

ఏకబిగిన అన్నేళ్లు చేసిన వారెవరూ లేరనుకుంటా. మా సిఫార్సులు ఏకగ్రీవంగా ఉండేవ'ని చెప్పారు. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ నగరంలో నిర్వహించే పుస్తక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వపు రోజులను గుర్తుకు తెస్తుందన్నారు. 2017లో తన జీవితం ఒక పెద్ద మలుపు తిరిగిందని, రాజ్యాంగ పరంగా దేశంలో రెండవ పెద్ద పదవైన ఉప రాష్ట్రపతి పదవిని అధిష్ఠించానన్నారు. మోదీ చెప్పిన మాట ప్రకారం ఉప రాష్ట్రపతి పదవి చేపట్టడానికి ఒప్పుకున్నానన్నారు. ప్రపంచ ఆర్థిక రంగంలో ఒడిదుడుకులు వచ్చినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ దాన్ని తట్టుకొని నిలబడిందన్నారు. ఇన్‌క్లూజివ్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని, యావరేజ్ పెర్‌ఫార్మెన్స్, జీడీపీ పెరిగే విధంగా రాష్ట్రం, దేశంలో మార్పులు చోటుచేసుకోవాల్సి ఉందని జనం కోరుకుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో, దేశంలో మౌళిక రంగాలు అభివృద్ధి చెందాలని జనం ఎక్కువగా కోరుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయ డిగ్రీ పట్టా పొందేవారు 6 నెలలపాటు రైతులతో మమేకం కావాలని, అప్పుడే వారికి రైతు సమస్యలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో కోల్డ్‌స్టోరేజ్ సౌకర్యాలు మెరుగుపడాలన్నారు. రైతు పండించిన పంటను పొలాల్లోనే అమ్ముకోకుండా, గోడౌన్లలో ఉంచే విధంగా బ్యాంకులతో లింకు ఏర్పాటు చేసి, ఆ పంటపై రైతుకు 60 శాతం రుణం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తే రైతుకు లాభదాయకంగా ఉంటుందని సూచించారు. రాజ్యసభలో కూడా వ్యవసాయ అనుబంధ రంగాలపై ఎక్కువగా చర్చించేలాగా దృష్టి పెడుతున్నామన్నారు. రాష్ట్రం, జిల్లా నాది అనే భావం రావాలన్నారు. మన దేశం సమాజం, భాష పట్ల గౌరవం పెంచుకోవాలని, ఇతర భాషలు నేర్చుకోవచ్చు కానీ అమ్మభాషను మర్చిపోవద్దని తెలిపారు. విదేశీయులు ఇక్కడకు వచ్చినప్పుడు వారి భాషలోనే మాట్లాడితే దుబాసీలు అనువదిస్తారని గుర్తుచేశారు. వ్యక్తిగత క్రమశిక్షణ, అంకితభావం అలవాటు చేసుకోవాలని, దానికి ఉదాహరణగా తానే నిలుస్తానని, తాను సమయపాలన కచ్చితంగా పాటించటం అలవాటుగా చేసుకున్నానన్నారు. పత్రికలు కూడా సానుకూల దృక్పథంతో వ్యవహరించి సత్యానికి దగ్గరగా పని చేస్తూ సమన్వయం పాటిస్తే మంచే జరుగుతుందని, ఇది జరగాలని కోరుకుంటున్నానని తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకలకు దూరం

తాను మొదటి నుంచీ న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా వుంటానని వెంకయ్య నాయుడు చెప్పారు. రైతులకు పంట చేతికొచ్చినప్పుడు సంక్రాంతి తొలి పండుగ అన్నారు. అందుకే తాను న్యూయర్ రోజు ఎవరికీ అందుబాటులో ఉండనన్నారు. ఈసారి విజయవాడ పుస్తక ప్రదర్శన కోసం ఇక్కడకు రావలసి వచ్చిందని ఆయన వివరించారు.

నిజం.. నేనొస్తున్నా!

నిలదీయగల గుండెధైర్యం ఉన్న ప్రజా సేవకులు తన పార్టీకి అవసరమని నొక్కి చెప్పారు. 'అలాంటి ప్రజా సేవకులతో కలిసి పని చేసే ప్రతినిధిని మాత్రమే'నని తనను ప్రకటించుకున్నారు. రాజకీయ ప్రస్థానంలో తొలి లక్ష్యం అభిమాన సంఘాలను బలోపేతం చేయడమేనన్నారు. 'అన్ని వర్గాల ప్రజలను అభిమాన సంఘాల పరిధిలోకి తీసుకురండి. అప్పటి వరకూ మీరైనా, నేనైనా రాజకీయాల గురించి మాట్లాడొద్దు' అని ఫ్యాన్స్‌కు సూచించారు. 'రాజకీయం, ప్రజాస్వామ్యం అవహేళన అవుతోంది' అంటూనే, ఏడాది కాలంలో తమిళనాడులో దిగజారిన రాజకీయాలను చూసి సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. 'మనల్ని చూసి అంతా నవ్వుతున్నారు' అని రజనీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఏడిఎంకెలో వివాదాలు, అవినీతి వ్యవహారాలు, రాజకీయ అస్థిరత్వం, అధికారపక్ష సభ్యుల ఇళ్లపై పన్నుదాడులను ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు. 'ఇప్పుడు కనుక నేనీ నిర్ణయం తీసుకోకుంటే, ఇక ఎప్పటికీ తీసుకోలేను. నాకు జన్మనిచ్చిన తమిళులు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశానన్న బాధ జీవితాంతం వెంటాడుతుంది' అని ఉద్వేగంతో ప్రకటించారు. 'ఒక రాజకీయ పార్టీని స్థాపించి అధికారంలోకి తీసుకురావడమంటే సముద్రం నుంచి ముత్యాన్ని బయటకు తీయడమే. దైవ కృప, ప్రజాశీర్వాదం ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు' అన్నారు. 'అధికారం నన్ను వెతుక్కుంటూ వస్తుందని చెబితే నమ్మేసేంత పిచ్చోడిని కాద'ని వ్యాఖ్యానిస్తూ, లక్ష్య సాధనకు ఏంచేయాలో తనకు బాగా తెలుసని తమిళ తలైవా రజనీకాంత్ ప్రకటించారు.

2017.. బాబు పాలనా వైఫల్యా నామ వత్సరం!

★ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఎద్దేవా

విజయవాడ (కార్పొరేషన్), డిసెంబర్ 31: 2017వ సంవత్సరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా వైఫల్య నామ సంవత్సరంగా ముగిసిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, అభివృద్ధిలోనూ ఘోరంగా విఫలమైన చంద్రబాబు తన కుమారుడు లోకేష్‌కు మాత్రం మంత్రిగా బాధ్యతలు అప్పగించడంలో విజయం సాధించారని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి ఎద్దేవా చేశారు.

అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గడిచిన మూడున్నరేళ్లలో ప్రచార ఆర్భాటం చేయటం తప్ప రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆదివారం ఆయన ఇక్కడో ప్రకటనలో విమర్శించారు. బాబు జాబితాలో అన్నీ అపజయాలే మిగిలాయని ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో బాబు సర్కార్ రైతులను మోసం చేసిందన్నారు. ఎలాంటి సీలింగ్ లేకుండా అందరికీ బంగారు రుణాలు కూడా మాఫీ చేస్తానని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక షరతులు వర్తిస్తాయనడం, ప్రత్యేక హోదా, విభజన హామీ హామీలపై చంద్రబాబు ఎన్నిసార్లు మాటలు మార్చారో అందరికీ తెలిసిందేనన్నారు. డ్వాక్రా మహిళల రుణాల మాఫీలోనూ అదే తంతు జరిగిందన్న ఆయన ఇంటింటికీ ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ యువతకు అతిపెద్ద హామీ ఇచ్చి దాన్ని కూడా అటకెక్కించారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఐటీ రంగం పరుగులు పెడుతోందని, పరిశ్రమలు క్యూ కడతాయంటూ ప్రభుత్వ పెద్దలు చెప్పుకురాగా, గూగుల్ వంటి కంపెనీలు వస్తాయని ప్రచారం చేసినా అదీ బోగస్ అని తేలిపోయిందన్నారు. అలాగే హీరో వంటి కంపెనీలతో చేసుకున్న ఎంఓయులకూ అతీగతీ లేదన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఇసుక రీచ్‌లు పెద్ద కుంభకోణంగా మారాయన్నారు.

స్విస్ ఛాలెంజ్ విషయంలోనూ చంద్రబాబుకు చుక్కెదురు కావడం గమనార్హమని, వర్షానికి నీరు కారి జలమయమైన వెలగపూడి తాత్కాలిక సచివాలయం ఆయన వైఫల్యాలలో అతి పెద్దదన్నారు. కోట్లు ఖర్చుచేసి వైజాగ్‌లో నిర్వహించిన పరిశ్రమల భాగస్వామ్య సదస్సు ఫెయిల్యూర్ స్టోరీనేనని, ఇలా అనేక విధానపరమైన విషయాల్లో చంద్రబాబు డొల్లతనం బహిర్గతమైందని విమర్శించారు. గత కాంగ్రెస్ హయాంలో ఏపీకి వచ్చిన తన సొంత జిల్లా చిత్తూరులోని మన్నవరం ప్రాజెక్టును కూడా చంద్రబాబు కాపాడుకోలేకపోవడం విడ్డూరమని రఘువీరారెడ్డి దెప్పిపొడిచారు.

వైఎస్సార్ పథకాలు అమలు చేస్తాం

★ వైకాపా అధినేత జగన్ హామీ

తంబళ్ళపల్లె, డిసెంబర్ 31: తమ పార్టీ అధికారంలోకి రాగానే దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ అమలు చేస్తామని వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. జగన్ చేపట్టిన మహా సంకల్ప పాదయాత్ర ఆదివారం 48వ రోజు చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లె మండలంలో కొనసాగింది. జగన్‌తో పాటు ఎంపి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తంబళ్ళపల్లె ఇన్‌చార్జి ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూర్బా, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయినులు తమ సమస్యలను జగన్‌కు విన్నవించారు. గత పన్నెండేళ్ల క్రితం దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కస్తుర్బా, గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసి కాంట్రాక్టు పద్ధతిపై ఉపాధ్యాయులను నియమించారని తెలిపారు. అనంతరం 2009లో జరిగిన ఎన్నికలలో తమను పర్మినెంట్ చేస్తామని వైఎస్సార్ హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. నాన్న ఆశయాలు కచ్చితంగా అమలుచేస్తానని, కస్తుర్బా, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. మీ సహకారంతో ప్రభుత్వం ఏర్పడగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని జగన్ వారికి భరోసా ఇచ్చారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy,** Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

క్రీడ

వాడ్కర్ సెంచరీ

- విదర్భ 7 వికెట్లకు 528
- ఢిల్లీతో రంజీ ట్రోఫీ ఫైనల్

ఇండోర్, డిసెంబర్ 31: మొట్టమొదటిసారి రంజీ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకునే దిశగా విదర్భ దూసుకెళుతున్నది. ఢిల్లీతో జరుగుతున్న ఫైనల్‌లో, మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఈ జట్టు ఏడు వికెట్లకు 528 పరుగులు సాధించింది. అక్షయ్ వినోద్ వాడ్కర్ సెంచరీ (133), సిద్దేశ్ నెరాల్ హాఫ్ సెంచరీ (56)తో నాటౌట్‌గా నిలవడంతో విదర్భకు ఈ స్కోరు సాధ్యమైంది. ఢిల్లీ తొలి ఇన్నింగ్స్ స్కోరు 295 పరుగులకు సమాధానంగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసిన విదర్భ, మూడో రోజు 322 పరుగులు జోడించి, మూడు వికెట్లు కోల్పోయింది. ఆదిత్య సర్వాతే 79 పరుగులు సాధించడం కూడా విదర్భకు కలిసొచ్చింది. మరొక్క రోజు ఆట మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో, ఈ మ్యాచ్ డ్రా కావడం ఖాయంగా కనిపిస్తున్నది. అదే జరిగితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా రంజీ ట్రోఫీని విదర్భ దక్కించుకుంటుంది.



అక్షయ్ వినోద్ వాడ్కర్ (133 నాటౌట్)

క్రీడా క్యాలెండర్ విడుదల



వశిష్ఠ్

కొయికోడ్, డిసెంబర్ 31: కొత్త సంవత్సరానికి క్రీడా క్యాలెండర్‌ను కాలికట్ యూనివర్శిటీ చరిత్ర విభాగాధిపతి, ప్రముఖ క్రీడా రచయిత వశిష్ఠ్ ఆవిష్కరించారు. గతంలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్‌పై ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీపై ఒక పాటను రాసిన ఆయన తాజాగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నీలు, సిరీస్‌లను పేర్కొంటూ ఈ క్యాలెండర్‌ను రూపొందించారు. 2018లో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆధ్వర్యంలో అండర్-19 వరల్డ్ కప్, వింటర్ ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య 'ఫిఫా' వరల్డ్ కప్, ఆసియా క్రీడలు, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటన, పురుషులు, మహిళల విభాగాల్లో హాకీ ప్రపంచ కప్, వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్ వంటి కీలక పోటీలు జరగనున్నాయి. పురుషుల హాకీ టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వడం విశేషం.

కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి..



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ప్రపంచ క్రీడారంగం కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్నది. క్రికెట్, హాకీ, బాడ్మింటన్, బాక్సింగ్, టెన్నిస్ తదితర క్రీడల్లో 2017 ఎన్నో మరపురాని సంఘటలను, ఎత్తుపల్లాలను చూసిన క్రీడాభిమానులు కొత్త ఏడాది ఏ విధంగా ఉండబోతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భవిష్యత్తుకు గతమే పునాది కాబట్టి, గతంలో దొర్లిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని కొందరు.. ఫామ్‌ను అదే స్థాయిలో కొనసాగించాలని మరి కొందరు.. లక్ష్యాలు ఏవైతేనేం.. ప్రతి ఒక్కరూ మెరుగైన రేపటిని కోరుకుంటున్నారు.

క్రికెట్‌లో భారత్ ఆధిపత్యం ఎంత వరకూ కొనసాగుతుందనేది, కొత్త ఏడాది ఆరంభంలోనే దక్షిణాఫ్రికాతో మొదలయ్యే సిరీస్ ఫలితంతో స్పష్టమవుతుంది. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, స్టాండ్ ఇన్ కెప్టెన్ రోహిత్ శర్మ కొత్త ఏడాదిలోనూ అదే స్థాయిలో సంచలనాలు సృష్టిస్తారా? లేదా? అన్నది కూడా ఆసక్తి రేపుతున్నది. సహజంగా ఒక సీజన్‌లో అద్భుత ప్రతిభ కనబరచిన వారు మరో సీజన్‌లో అదే దూకుడును కొనసాగించడం కష్టం. అతి కొద్ది మందికి మాత్రమే ఇది సాధ్యమైంది. అలాంటి అరుదైన క్రీడాకారుల జాబితాలో కోహ్లీ, రోహిత్ తదితరులు కూడా చేరుతారో లేదో చూడాలి. కొత్త సంవత్సరం తమదేనని అజింక్య రహానే, శిఖర్ ధావన్ ధీమాగా ప్రకటించుకున్నారు. వీరి ఆట ఏ తీరులో ఉండబోతుందనేది అభిమానుల ముందున్న ప్రశ్న. అనిల్ కుంబ్లే స్థానంలో జట్టు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన రవి శాస్త్రి ఇప్పటి వరకూ మెరుగైన ఫలితాలనే రాబట్టాడు. దక్షిణాఫ్రికా టూర్‌తో అతను టీమిండియాకు అదే తరహా మార్గదర్శకం చేస్తాడన్న నమ్మకం వ్యక్తమవుతున్నది. మొత్తం మీద ఏడాదిపాటు ఆధిక్యాన్ని కొనసాగించిన భారత్, ఎక్కువ మ్యాచ్‌లు, సిరీస్‌లు, టోర్నీలు స్వదేశంలోనే ఆడింది. విదేశాల్లోనూ అదే తరహాలో రాణిస్తేనే నిజమైన బలమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

అంతర్జాతీయ క్రికెట్ విషయానికి వస్తే 'పసికూన' అఫ్గానిస్తాన్ క్రికెట్ జట్టు గొప్ప సంచలనాలతో ముందుకు దూసుకెళుతున్నది. వెస్టిండీస్ టూర్‌కు వెళ్లి, సెయింట్ లూసియాలో జరిగిన మొదటి మ్యాచ్‌లో 63 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేయడాన్ని ఒక సంచలనంగానే పేర్కోవాలి. ఆ మ్యాచ్‌లో యువ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ విశ్లేషణతో రాణించాడు. 18 పరుగులకే ఏడు వికెట్లు పడగొట్టిన అతను అఫ్గాన్ విజయంలో కీలక భూమిక పోషించాడు. రెండో వనే్డలో వెస్టిండీస్ గెలవగా, కీలకమైన మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. సిరీస్ 1-1గా డ్రా అయినప్పటికీ, వెస్టిండీస్‌పై గెలవడం అఫ్గాన్ క్రికెట్‌కు కొత్త ఊతాన్నిచ్చింది. కొత్త ఏడాదిలోనూ అఫ్గాన్ సంచలనాలు సృష్టించడానికి సిద్ధమవుతున్నది. ప్రపంచ దేశాలకు ఆ జట్టును ఢీకొనడం అసాధ్యం కాకపోయినా, సులభం మాత్రం కాదని స్పష్టమవుతున్నది. ఇప్పటికే ఐర్లాండ్‌తోపాటు టెస్టు హోదాను సంపాదించిన అఫ్గాన్ అంతర్జాతీయంగా తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ఆ సామర్థ్యం కూడా దీనికి ఉందనడంలో అనుమానం లేదు. అఫ్గాన్‌తోపాటు జింబాబ్వే కూడా తన ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నది. శ్రీలంక టూర్‌కు వెళ్లిన జింబాబ్వే వనే్డ ఇంటర్నేషనల్ సిరీస్‌ను గెల్చుకొని, కొత్త చరిత్ర సృష్టించింది. ఒకవైపు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, స్వదేశంలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడం, మరోవైపు అంతర్జాతీయ ప్రమాణాలున్న ఆటగాళ్లు కొరవడం సుమారు అర్ధ దశకంపాటు జింబాబ్వేను వేధించాయి. ఈ సమస్యలను సమర్థంగా ఎదుర్కొన్న జింబాబ్వే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో లంకపై గెలిచి, తనను నిరూపించుకుంది. ఇరు జట్లు చెరి రెండు విజయాలను సాధించి సమవుజ్జీలుగా నిలిచాయి. కీలకమైన చివరి మ్యాచ్‌లో సికందర్ రజా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచి, లంకపై జింబాబ్వేకు మూడు వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు. అంతేగాక, 3-2 తేడాతో సిరీస్‌ను గెలిపించాడు. లంకపై ఆ జట్టుకు అదే తొలి వనే్డ సిరీస్ విజయం. అంతేగాక, ఎనిమిదేళ్ల కాలంలో మొదటిసారి విదేశీ గడ్డపై సిరీస్‌ను గెల్చుకుంది. జింబాబ్వే కొత్త సంవత్సరంలో మరింతగా రాణించేందుకు ఈ విజయం తోడ్పడుతుందనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. ఈసారి షెడ్యూల్ కూడా ఆసక్తికరంగా ఉంది.

వనే్డ ఇంటర్నేషనల్స్‌లో టాపర్ భారత కెప్టెన్

దుబాయ్, డిసెంబర్ 31: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన సంవత్సరాంతపు వనే్డ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అతను మొత్తం 876 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ వరుసగా రెండు, మూడు స్థానాలను ఆక్రమించారు. రోహిత్ శర్మ ఐదో స్థానంలో ఉన్నాడు. బౌలింగ్ విభాగంలో భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే 'టాప్-10'లో ఉన్నాడు. అతనికి మూడో స్థానం దక్కింది. అక్షర్ పటేల్ 11, భువనేశ్వర్ కుమార్ 15 స్థానాల్లో ఉన్న బౌలింగ్ విభాగంలో హసన్ అలీ, ఇమ్రాన్ తాహిర్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించారు.

ఐసీసీ వనే్డ క్రికెటర్ల ర్యాంకింగ్స్

బ్యాటింగ్ విభాగం: 1. విరాట్ కోహ్లీ (876 పాయింట్లు), 2. ఏబీ డివిలియర్స్ (872), 3. డేవిడ్ వార్నర్ (865), 4. బాబర్ ఆజమ్ (846), 5. రోహిత్ శర్మ (816), 6. క్వింటన్ డి కాక్ (808), 7. జో రూట్ (802), 8. ఫఫ్ డు ప్లెసిస్ (773), 9. హషీం ఆమ్లా (766), 10. కేన్ విలియమ్‌సన్ (750 పాయింట్లు).

- మహేంద్ర సింగ్ ధోనీ 729 పాయింట్లతో 12, శిఖర్ ధావన్ 726 పాయింట్లతో 15 స్థానాల్లో ఉన్నారు.


బౌలింగ్ విభాగం: 1. హసన్ అలీ (759 పాయింట్లు), 2. ఇమ్రాన్ తాహిర్ (743), 3. జస్‌ప్రీత్ బుమ్రా (729), 4. ట్రెంట్ బౌల్ట్ (723), 5. జొష్ హాజెల్‌వుడ్ (714), 6. కాగిసో రబదా (708), 7. మిచెల్ స్టార్క్ (684), 8. రషీద్ ఖాన్ (649), 9. లియామ్ ప్లంకెట్ (646), 10. మిచెల్ సాంట్నర్ (644 పాయింట్లు).

- అక్షర్ పటేల్ 643 పాయింట్లతో 11, భువనేశ్వర్ కుమార్ 621 పాయింట్లతో 15 స్థానాల్లో ఉన్నారు.

ఆల్‌రౌండర్స్ విభాగం: 1. మహమ్మద్ హఫీజ్ (352 పాయింట్లు), 2. షకీబ్ అల్ హసన్ (345), 3. ఏంజెలో మాథ్యూస్ (321), 4. మహమ్మద్ నబీ (316), 5. బెన్ స్టోక్స్ (292), 6. జాసన్ హోల్డర్ (282), 7. జేమ్స్ ఫాల్క్‌నెర్ (280), 8. మోయిన్ అలీ (267), 9. మిచెల్ సాంట్నర్ (264), 10. మిచెల్ మార్ష్ (259 పాయింట్లు).

- భారత క్రికెటర్లలో హార్దిక్ పాండ్య ఒక్కడే 'టాప్-20' జాబితాలోకి చేరాడు. అతను 244 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచాడు.

టెన్నిస్‌లో ఆధిపత్య పోరు



సెరెనా విలియమ్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: గతంలో ఎన్నడూ లేని విధంగా టెన్నిస్‌లో కొత్త సంవత్సరం ఆధిపత్య పోరు తీవ్ర స్థాయికి చేరుకోనుంది. ఎవరు అందలాలు ఎక్కుతారో, ఎవరు వైఫల్యాలను ఎదుర్కొంటారో చెప్పలేని పరిస్థితి టెన్నిస్‌లో నెలకొంది. ప్రత్యేకించి మహిళల విభాగంలో రేసు ఆసక్తిని రేపుతున్నది. ఇక ప్రపంచ మాజీ నంబర్ వన్ సెరెనా విలియమ్స్ పునరాగమనం హాట్ టాపిక్‌గా మారిందనడంలో సందేహం లేదు. ఆడ పిల్ల తల్లి హోదాలో ఆమె సుమారు ఏడాది విరామం తర్వాత మళ్లీ టైటిళ్ల వేటను ఆస్ట్రేలియా ఓపెన్‌తో ప్రారంభించనుంది. ప్రస్తుతం 22వ ర్యాంక్‌లో ఉన్న ఆమె, మళ్లీ నంబర్ వన్ స్థానం కోసం శ్రమించడం ఖాయం. మహిళల విభాగంలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితి సెరెనాకు అనుకూలించవచ్చు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మొదటి మూడు స్థానాలను ఆక్రమించిన సిమోనా హాలెప్, గార్బినె ముగురుజా, కరోలినా వొజ్నియాకి నిలకడగా రాణించలేకపోతున్నారు. ఏ టోర్నీలో ఎవరు బాగా ఆడతారో, ఎవరు విఫలమవుతారో ఎవరూ చెప్పలేని పరిస్థితి. అందుకే, నంబర్ వన్ స్థానాన్ని మళ్లీ దక్కించుకునే దిశగా ఆమె ప్రస్థానం సులభంగానే సాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ, మహిళల టెన్నిస్‌లో ఆధిపత్య పోరు తీవ్రంగా ఉంటుందనేది వాస్తవం.

పురుషుల విభాగానికి వస్తే, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో చాలా వెనుకబడి ఉన్నప్పటికీ, ఆతర్వాత పుంజుకొని, 2017 సంవత్సరాన్ని నంబర్ వన్, నంబర్ టూ ఆటగాళ్లుగా పూర్తి చేసిన రాఫెల్ నాదల్, రోజర్ ఫెదరర్ మరోసారి ఆధిపత్యాన్ని కనబరచేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టోర్నీతోనే వీరి పోరాటం మొదలవుతుంది. ఇక గాయాల సమస్యల నుంచి కోలుకొని, తిరిగి తమ నంబర్ వన్ స్థానాలను ఆక్రమించడానికి ప్రయత్నించే నొవాక్ జొకోవిచ్, ఆండీ ముర్రే నుంచి నాదల్, ఫెదరర్‌కు గట్టిపోటీ తప్పకపోవచ్చు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం జొకోవిచ్ 12, ముర్రే 16 స్థానాల్లో ఉన్నారు. వీరికి నాదల్, ఫెదరర్ నుంచేగాక, ఏడాది కాలంలో ఎవరూ ఊహించని రీతిలో అంతర్జాతీయ సర్క్యూట్‌లో సంచలనాలను సృష్టించి, నాలుగో స్థానాన్ని ఆక్రమించిన యువ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్, ఐదో స్థానంలో ఉన్న డామినిక్ థియెమ్ నుంచి కూడా సవాళ్లు తప్పవు. ర్యాంకింగ్స్‌లో మారిన్ సిలిక్ ఆరు, స్టానిస్లాస్ వావ్రిన్కా తొమ్మిది స్థానాల్లో ఉన్నప్పటికీ, మేటి ఆటగాళ్ల దూకుడుకు చెక్ పెట్టే సామర్థ్యం వారికి ఉంది. ఈ అంశాలే కొత్త ఏడాదిలో టెన్నిస్‌ను ఆసక్తికరమైన పోరాటాల వేదికగా మార్చనున్నాయి.

టెన్నిస్‌లో భారత్‌కు పెద్దగా ఆశలు కనిపించడం లేదు. రోహన్ బొపన్న ఫ్రెంచ్ ఓపెన్‌ను సాధించడం తప్ప గత ఏడాది భారత్ అందుకున్న గొప్ప టైటిళ్లేవీ లేవు. కొత్త సంవత్సరంలోనూ అతనిపైనే ఆశలు పెట్టుకోవాలి. స్టార్ క్రీడాకారిణి సానియా మీర్జా మళ్లీ ఫామ్‌లోకి వస్తే పరిస్థితి ఎంతో కొంత మెరుగవుతుంది.

మేము సిద్ధం

భారత్‌తో టెస్టు సిరీస్‌పై డివిలియర్స్

జొహానె్నస్‌బర్గ్, డిసెంబర్ 31: భారత్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు తాము అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని దక్షిణాఫ్రికా స్టాండ్ ఇన్ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ అన్నాడు. ఒక చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను మాట్లాడుతూ, భారత్‌తో టెస్టు సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని, జింబాబ్వేతో ఖరారు చేసిన ఏకైక టెస్టును దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో గెల్చుకుంది. మొదటి ఇన్నింగ్స్‌ను ఈ జట్టు 9 వికెట్లకు 309 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అల్డెన్ మర్‌క్రామ్ 125, డివిలియర్స్ 53, టెంబా బవూమా 44 చొప్పున పరుగులు చేశారు. అనంతరం జింబాబ్వేను మొదటి ఇన్నింగ్స్‌లో 30.1 ఓవర్లలో 68 పరుగులకే కట్టడి చేసింది. మోర్న్ మోర్కెల్ 21 పరుగులకే ఐదు వికెట్లు పడగొడితే, కాగిసో రబదా, అదిలె ఫెహ్లూక్వాయో చెరి 12 పరుగులిచ్చి, రెండేసి వికెట్లు కూల్చారు. అనంతరం ప్రత్యర్థికి ఫాలోఆన్ ఇచ్చిన దక్షిణాఫ్రికా మరోసారి ఆధిపత్యాన్ని కనబరచి 121 పరుగులకే కుప్పకూల్చింది. కేశవ్ మహారాజ్ 59 పరుగులలిచ్చి ఐదు వికెట్లు సాధించాడు. అదిలె ఫెహ్లూక్వాయో 13 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌ని ప్రస్తావిస్తూ, అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శనను కనబరచడం తమ జట్టుకు శుభసూచకమని డివిలియర్స్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియాను బలమైన జట్టుగా అతను అభివర్ణించాడు. అయితే, సవాళ్లను ఎదుర్కోవడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నాడు. నిజానికి తామందరికీ ఈ సిరీస్ ఒక పరీక్ష అవుతుందని, ఇందులో గెలుస్తామన్న ధీమా తనకు ఉందని చెప్పాడు. గాయాల కారణంగా టెస్టు క్రికెట్‌కు దూరమైన డివిలియర్స్ 23 నెలల తర్వాత జింబాబ్వేతో టెస్టు ఆడి అర్ధ శతకంతో రాణించాడు. అంతేగాక, రెగ్యులర్ కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ పూర్తిగా కోలుకోని కారణంగా, అతని స్థానంలో జట్టుకు నాయకత్వం వహించాడు. కెప్టెన్సీ బాధ్యతలను, బ్యాట్స్‌మన్‌గా తన పాత్రను అద్భుతంగా పోషించిన డివిలియర్స్ తన ఫిట్నెస్ స్థాయిపై సంతృప్తి వ్యక్తం చేశాడు. స్వదేశంలో జరుగుతున్నంత మాత్రాన భారత్‌తో టెస్టు సిరీస్‌ను తేలిగ్గా తీసుకోడం లేదని అతను స్పష్టం చేశాడు. క్వింటన్ డికాక్ కండరాలు బెణకడంతో విశ్రాంతి తీసుకోగా, జింబాబ్వేతో జరిగిన టెస్టులో వికెట్‌కీపర్‌గా కూడా సేవలు అందించిన విషయాన్ని ప్రస్తావించగా, బ్యాట్స్‌మన్‌గానేగాక, కెప్టెన్‌గా, కీపర్‌గా కూడా బాధ్యతలను నిర్వహించడానికి వెనుకంజ వేసేది లేదని స్పష్టం చేశాడు. భారత్‌తో సిరీస్ సమయానికి డికాక్ పూర్తిగా కోలుకుంటాడన్న ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఇలావుంటే, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో భారత జట్టు ఆదివారం ప్రాక్టీస్ ఇన్‌డోర్‌కే పరిమితమైంది.

సింధు, శ్రీకాంత్‌వైపే చూపు..



పీవీ సింధు కిడాంబి శ్రీకాంత్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: తెలుగు కిరణాలు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ పైనే బాడ్మింటన్ అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. సైనా నెహ్వాల్ గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. పారుపల్లి కశ్యప్ ఫిట్నెస్‌ను తిరిగి సంపాదించినప్పటికీ, గతంలో మాదిరి అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించడం లేదు. అజయ్ జయరామ్, హెచ్‌ఎస్ ప్రణయ్ తదితరులకు అంతర్జాతీయ టోర్నీల్లో మెరిసే అవకాశం లేదని చెప్పలేం. అయితే, నిలకడగా రాణించలేకపోతున్న వీరు సంచలనాలు సృష్టిస్తారనుకోవడం అత్యాసే అవుతుంది. 'బెస్ట్ ప్లేయర్స్' అవార్డులను అందుకున్న సింధు, శ్రీకాంత్ తప్ప ప్రస్తుతానికి ఇతరుల పేర్లు తెరపైకి రావడం లేదన్నది వాస్తవం. అందుకు కారణాలు లేకపోలేదు. గత ఏడాది ఆమె సయ్యద్ మోదీ స్మారక టోర్నమెంట్, ఇండియన్ ఓపెన్‌తోపాటు కొరియా ఓపెన్ సూపర్ సిరీస్‌ను కూడా తన ఖాతాలో వేసుకుంది. అంతేగాక, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో సింధు రజత పతకాన్ని సాధించింది. దుబాయ్‌లో జరిగిన సూపర్ సిరీస్ ఫైనల్స్ టోర్నీలోనూ రన్నరప్‌గా నిలిచింది. హాంకాంగ్ ఓపెన్‌లో ద్వితీయ స్థానాన్ని సంపాదించింది. ఏడాది కాలంగా ఆమె సాధిస్తున్న విజయాలను పరిగణలోకి తీసుకుంటే, కొత్త సంవత్సరంలో ఆమె నుంచి మరిన్ని విజయాలను ఆశించడం తప్పుకాదు. అదే విధంగా శ్రీకాంత్ కూడా చక్కటి ఆటతో రాణిస్తూ, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం వరకూ వెళ్లగలిగాడు. కొత్త ఏడాది నంబర్ వన్‌గా నిలవడమే అంటున్న ఈ యువ ఆటగాడికి అనుకున్నది సాధించడం అసాధ్యమేమీ కాదు. ఇండోనేషియా సూపర్ సిరీస్ ప్రీమియర్, ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ సిరీస్, డెన్మార్క్ సూపర్ సిరీస్ ప్రీమియర్, ఫ్రెంచ్ సూపర్ సిరీస్ టోర్నీలను గెల్చుకొని, ఒక క్యాలెండర్ ఇయర్‌లో నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లను సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శ్రీకాంత్ కొత్త ఏడాది అదే స్థాయిలో ఆడతాడని అభిమానుల విశ్వాసం.

email:
sahiti@andhrabhoomi.net

కొత్త క్యాలెండర్

కొత్త క్యాలెండర్ వచ్చిందని
రోజూ వచ్చే ఉదయం మారదు
విచ్చుకునే పుష్పం ఆగదు
కొత్త సంవత్సరం వచ్చిందని
రోజూ సాయంత్రం సూర్యుడికి చీకటి మసిపూయక మానదు
వెలుతురు బంగారం దోచుకోవడం ఆపదు

క్యాలెండరు మారుతున్నదని
క్యాలెండరు గడుల గుండెలలో దాగి
భయపెడుతున్న తిథి వార నక్షత్ర గ్రహాలు మారవు
కొత్త సంవత్సరం పనికొచ్చేది
నరాల నూపేసే నదుల మీద పడి మత్తుగా జుర్రుకోటానికి
నోరు లేని జంతువుల మీద పడి కమ్మగా నమిలేయటానికి
బరువు బాధ్యతలు మోస్తున్న రహదారులమీద పడి
వాటి పరువు తీయటానికి

పుట్టినరోజు వచ్చిందన్నా
కొత్త క్యాలెండరు పండగ తెచ్చిందన్నా
బతుకు చెట్టుకు ఒక ఆకు రాలిపోవటం
పుడుతూ వెంట తెచ్చుకున్న
అగ్గిపెట్టెలోని ఒక అగ్గిపుల్ల కాలిపోవటం

క్యాలెండర్ మారిందని
బతుకులు మారవు, కాకపోతే
బతుకు రంగును ఓసారి చూసుకోవచ్చు
ఏవేవో కొత్త రంగులు మన తృప్తి కోసం పూసుకోవచ్చు

కొత్త సంవత్సరం అంటే
పాత క్యాలెండరును చీకటిలోకి తోసెయ్యటం
కొత్త క్యాలెండరును నిట్టనిలువునా దేవుడిలా నిలబెట్టటం
కొత్త క్యాలెండర్ అంటే
కొత్త స్మార్ట్‌ఫోను, కొత్త మోడల్ కారు..
ఇంకా ఎన్నెన్నో కొత్త కొత్త ఆవిష్కరణలు
బాగున్నా సరే పాత మోడళ్ళు తీసి పారేస్తున్నారు
ఎలా ఉన్నా సరే కొత్త మోడళ్ళు తెచ్చుకుంటున్నారు

క్యాలెండర్ మారిందని
పూసే పూలు ఆగవు, పూసినవి రాలకా మానవు
పండే కాయలు ఆగవు, పండినవి పడిపోకా మానవు
కాకపోతే మొక్క బాగుండాలని శుభాకాంక్షలు చెబుదాం
అప్పుడే కొత్త క్యాలెండరుకు విలువ
మొక్కను బతకనిద్దామని సంకల్పం చెప్పుకుందాం
అప్పుడే సంతోషిస్తాడు క్యాలెండర్లు సృజించే నలువ...

జీవనం పరుగులో అలిసిన మనిషికి
క్షణకాలం ఆగినపుడు మంచినీళ్లు అందించే దారి సత్రం
ఈ కొత్త సంవత్సరం
మళ్ళా మనిషి పరుగు పెట్టాల్సిందే
చేరాల్సిన చివరి మైలురాయి చేరి పడిపోయేదాకా సాగాల్సిందే

నీ ప్రయాణంలో నీ చీకటి ముక్కలు కింద పడితే
అవి రేపు ముళ్ళ చెట్లయి జాతి గమనాన్ని చంపేస్తాయి
నీ ప్రయాణంలో చెమట కిరణాలు వదిలిపెడితే
అవి రేపు నేలమీద మొలిచి నలుగురినీ బతికిస్తాయి

- డా. రావి రంగారావు, 9247581825





నూతనోత్సాహం

వస్తూ పోతున్నాయి
వత్సరాలెన్నో
వడి వడిగా విచ్చేస్తూ
వలపును పంచుతూ

నిత్యనూతనంగా
నిండు యవ్వనంతో
నిటారుగా నిలబడుతూ
నిజాల్ని గమనిస్తూ

సహజత్వాన్ని ఆహ్వానిస్తూ
సక్రమ మార్గాల్ని ఆశిస్తూ
సకల జనుల క్షేమం కోసం
సద్వినియోగ ఆశల కోసం

ప్రజల్లో మెదలుతూ
పర్యావరణ సంరక్షణకై చూస్తూ
ప్రగతిని సూచిస్తూనే
ప్రాచీనతను కాపాడాలంటూ..

- సుతారపు వెంకట నారాయణ
9848958690



హిమ ధూమం

అరుణ కిరణాల గిలిగింతలకు,
కితకితలకు,
కించిత్తు బద్ధకంగా ఒళ్లు విరుచుకొనే
నిర్లిప్తతకు నిలువుటద్దం,
ఆనందానికి అవరోధం,
పొంగివచ్చే దుఃఖం పేరుకుపోయినట్లు
ప్రయాణ పురోగమనానికి ప్రమాద హేతువు
శతృశిబిర నిఘా నేత్రానికి అడ్డుతెరలా
సువిశాల శ్వేత కుడ్యం
సుదూర శ్వేతనగం
ప్రేమికుల పెన్నిధి
వృద్ధ, వ్యాధిగ్రస్తుల నిషేధం
పరిమితి లేని పారిశ్రామికీకరణ ప్రభావం
కురిసిందంటే కొందరికి మోదం
మరికొందరికి ఖేదం
ఈ మాసపు హిమధూమం.

- వేదం సూర్యప్రకాశం

కొంగ్రొత్త వెలుగులతో తెలుగు ప్రసరించేలా...

కొత్త ఏడాది మళ్లా మున్నూటరవై అయిదు వేకువలను తీసుకురాబోతున్నది. వెయ్యేళ్ళ ముందర శాసన హోదా గల భాషగా, ఒక సహస్రం నుంచి సృజన సంపదగా, నన్నయ, పాల్కురికి రెండు తీరులుగా అందించిన రచనలుగా వేల పదాలు మన ముందర కుప్పలుగా పడివున్నాయి. అవి ప్రతి శతాబ్దంలో విస్తృతమవుతూ వచ్చాయి. గత వెయ్యేళ్లుగా నిర్విరామ సాహిత్య రచన భిన్న రూపాల్లో జరుగుతూనే ఉన్నది. తొలి సహస్రం మనకు అందీ అందని చరిత్ర నీడల్లో ఉన్నా, రెండో సహస్రం తెలుగు సారస్వతంలో చిరంజీవిగా ఉన్నది. ఆనాటి రాత పద్ధతులు, భద్రపరిచే పద్ధతులు, రాజులకు, కొద్దిమంది పండితులకు పరిమితం అయిన కాలం నుంచీ, అక్షరాలు అచ్చు పుస్తకాలుగా లభ్యత పెరిగి, చదువరుల సంఖ్య పెరిగి, సాంకేతిక దోహదం పెరిగి, మూడో సహస్రారంభ దశాబ్దాల్లో, వేగంగా పోయే విశ్వభాషల సరసన, తెలుగు మన అస్తిత్వంగా నిలబడి ఉన్నాము.

ఈ రెండో సహస్రంలో భాషలు విశాలం అయ్యాయి. భారత ఉపఖండం విషయానికి పరిమితం అయినా, ఆసియా పొత్తికడుపు నుంచి వచ్చి, ముందు దాడులు, దోపిడీలే చేసినా, ఆరువందల ఏళ్లుగా పాలించిన మహమ్మదీయుల భాష, ఇక్కడి వ్యవహార పరిభాష పదాలుగా సమస్త జీవన రంగాలను ప్రభావితం చేస్తూ కలగలిసి పోయింది. తరువాత పెనుగులాడిన మూడు వందలేళ్ళ పాశ్చాత్య ఆంగ్ల పాలన సైతం, పారిశ్రామిక నాగరికతలను, వాటితో బాటే వచ్చిన మార్పులను, కొత్త పదాలను జన సంపర్కంలో వదిలి, ప్రపంచ పోకడలు మన దేశీయులకు ఆకళింపు అయ్యేలా, విస్తృత వాడుక గల భాషను ఇచ్చింది. విదేశీ పాలకులు అంతరించారు. సాంస్కృతిక పలుకుబడులు మిగిలిపోయాయి. లోకానికి కిటికీలు తెరుచుకున్నాయి. ఇదీ స్థూలంగా గత సహస్రం ఒనర్చిన మేలు. నన్నయ లోకం కన్నా మన లోకం నేడు వెయ్యేళ్ళ తరువాత చాలా పెద్దది. కానీ, ఆయన ఏర్పరచిన లక్ష్యమే నేటికీ సాహిత్యానికి గొప్పది. అంతకుమించి మనం ఏమీ కొత్తగా చెప్పలేకపోయాము. 'విశ్వశ్రేయం కావ్యం' అన్నాడాయన ఒక వ్యాకరణ పుస్తకంలో. 'ఏ భాష వారైనా, భాష క్షుణ్ణంగా ఎరిగి లోకోపకారి అయిన కావ్యం రాయాలి' అన్నది ఆయన సూచన. సామాజిక నిబద్ధత ఉండాలా అంటే, మనం నన్నయను ఉదహరిస్తే చాలు. అభివ్యక్తి మార్పులను పూర్వ తరాలపై తిరుగుబాటుగా చూడటం పాత పద్ధతి. అప్పటివారు అభివ్యక్తిలో, ఇతివృత్త శక్తిలో వేసిన దారులు మరింత విస్తరింప చేయడమే ఏ కొత్త తరంలోనైనా జరిగేది. ఇది ఎంత మహత్తరంగా జరిగింది అన్నదే కలుపుగోలు దృష్టి. ఇన్‌క్లూసివ్ దృష్టి అంటారు. ప్రపంచంలో ఏదీ దానంతట అదే, మరే దానితో సంబంధం లేకుండా జరగదు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ అంతే. మన లాక్షణికుల నుంచీ, గురజాడ, టి.ఎస్.ఇలియట్ దాకా ఇది పాత కొత్తల మేలు కలయిక అనే చెప్పారు వారి వారి భాషల్లో.

నన్నయ తెనుగు భారత రచన మొదలు తరువాత దాదాపు ఒక వెయ్యేళ్ల కాలచక్రం తిరిగి, మూడోకొత్త సహస్రం మొదట్లో ఉన్న మన ముందున్న బరువు బాధ్యతలు నన్నయ, పాల్కురికి ముందర ఉన్నవాటికన్నా తక్కువేమీ కావు. తెలుగును మరో సహస్రం బతికించి 3018కి మనం అందివ్వగలమా? ఇదీ ప్రశ్న. తొమ్మిది వందల ఏళ్ల గ్రాంథికం ఆనాటి అవసరాలకు, నెమ్మది సహజ జీవనానికి సరిపోయినా, ముందు ముందు ఇది చాలదు అని ఎరిగిన వైతాళికులు భారతదేశం అంతటా తమ అభ్యుదయ వాణి వినిపిస్తూ, 'రాబోయే శతాబ్దాలు ప్రజలవే కనుక, ప్రజల భాష రాయండి, ప్రజలకు తెలిసేలా విజ్ఞాన విషయ వినిమయం జరగాలి' అని కోరారు. ఇది ఒక శతాబ్ది ముందర, జటిల గ్రాంథికంతో జరిగిన పేచీ కాగా, తెలుగు నాట 1927 ప్రాంతాలకు గానీ నవ్యసాహిత్య పరిషత్తు, వ్యవహారిక భాషను అంగీకరించలేదు. విశ్వవిద్యాలయాలు అంగీకరించేటప్పటికి మరికొన్ని దశాబ్దాలు గడిచాయి. ఆ నేపథ్యం స్వరూపం మారి ఇప్పుడు జటిల గ్రాంథికంతో వ్యవహారిక భాష ఎలా నెగ్గుకుని వస్తుందా అని కాక, విద్యతో ఇంగ్లీష్ దాడి, ప్రభావం పెరిగిపోయిన వర్తమానంలో అసలు తెలుగు ఉండాలా, ఉంటే ఏ మేరకు ఉండాలి అన్న కీలక అంశం శాస్త్రీయ దృష్టి లేని రాజకీయ వర్గాల, విద్యావ్యాపార వర్గాల పాలైంది. చదువరులు లేకపోతే, సాహిత్యం ఎవరికోసం ఎన్నాళ్లు బతుకుతుంది? అదే ఇప్పుడు దేశి భాషల ముందున్న ప్రశ్న. 2018లో తెలుగు సమాజం, తెలుగు సాహిత్యం, సాంస్కృతికతను ఎలా నిలబెట్టుకుంటుంది?

నిఘంటు విస్తృతీకరణ

గత యాభై ఏళ్లుగా మన తెలుగులో (ఇతర భారతీయ భాషల వలెనే) కొన్ని వేల పాశ్చాత్య పదాలు కలిసిపోయి, ప్రజల వాడుకలో ఉన్నాయి. వీటికి అనుగుణంగా, మన పదకోశాల, శబ్ద సంకలనాల విస్తృతి జరగాలి. శబ్ద రత్నాకరం అంటేనే అర్థం, నిత్యం కొత్త అలలు (పదాలు) పుడుతూ ఉంటాయని. ఈ కొత్త పదాల పట్ల మన వైఖరి ఏమిటి? నైఘంటు అవసరాల మేరకు ఒక మాట నిఘంటువులోకి ఎక్కాలి అంటే, అది సమాజ ప్రజల వాడుకలో విస్తృతంగా ఉండాలి. అలాగే సాహిత్య వాడకం, ప్రయోగం జరిగి ఉండాలి. ఇది రెండూ కూడా నిండుగా ఉన్న వేల అన్య పదాల పట్ల ఏమిటి మన వైఖరి? నిఘంటువులు మనం సమీక్ష జరిపి అరవై డెబ్భై ఏళ్లు దాటింది. ఆమధ్య పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నిఘంటు ప్రచురణ చేసినా, అది ఆధునికతకు దూరంగానే ఉన్నదని కొంచెం పరిశీలిస్తే తెలుస్తుంది. ఇతర ప్రపంచ భాషలు, మనకన్నా తక్కువ సంఖ్య గల ఫ్రెంచ్, జపనీస్, ఇటాలియన్, జర్మన్ నిఘంటువులెలా నిర్మాణం చేస్తున్నారు అన్నది శాస్త్రీయంగా ఆకళింపు తెలుసుకుని, ప్రపంచ వ్యవహార భాష అయిన ఇంగ్లీష్ భాషావేత్తలెలా తమ మాటల లోకవ్యాప్త పునాదులు విస్తరిస్తున్నదీ కూడా చర్చకి వచ్చే సెమినార్లు జరిపి, ఎంత ఖర్చు అయినా సరే, ఈ పనికి పూనుకోవడం తెలుగు ప్రభుత్వాల స్థాయిలో చాలా అవసరం.

తెలుగు ఆధునీకరణ సాధ్యమేనా?

సాధ్యమే! ముందుగా ఏది సంప్రదాయ తెలుగు, ఏది ఉపయుక్త/ఆధునిక తెలుగు అన్నది తేలాక, ప్రపంచ జ్ఞాన విస్తారత అంతా పలు విషయాల గురించి ఉన్నది, నిత్యం జమవుతుండేది, ఎప్పటికప్పుడు మనం తెలుగులోకి మార్చగలిగే ప్రక్రియలో వేలాదిమంది సాంకేతిక సహాయాలతో పనిచేస్తే అందుకు అనుగుణంగా ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ (కళా, మానవీయ రంగాలు) బలోపేతం చేస్తే ఇది సాధ్యపడుతుంది. వీటిలో వ్యవహార విషయ అనువాదం, సాహిత్య అనువాదం (ఇది అటునుంచి, ఇటునుంచి కూడా) రెండు శాఖలుగా ఉండాలి. వెయ్యేళ్ల సారస్వత సంపద, ప్రస్తుత తెలుగువారికి అస్తిత్వమూలం గనుక, విద్యార్థులకు ఎంత ఉన్నత విద్యలోనైనా, ఆ విద్యాస్థాయి తీరుకు అనుసారంగా ఒక తెలుగు రచన నిర్బంధ అంశంగా ఉండాలి. దీనిలో వారు సాధించే మార్కులు, వారికి కెరీర్‌లో ఉన్నతి, ప్రాధాన్యత కోసం పరిగణించబడతాయి అన్నది పొందుపరుస్తూ, తెలుగు ఒకటో తరగతి నుంచి ఉన్నత చదువుల్లో ఒక భాగంగా ఉండేలా చూడాలి. (ఒక వెయ్యేళ్ల దూరదృష్టి ఉంటే తప్ప ప్రభుత్వాలకు ఇది అమలుచేయడం సాధ్యం కాదు). ఇలా అమలు అవుతుంటే, చదువుకున్నది మర్చిపోలేరు కనుక, తెలుగుపై ఒక పరిచయం, వీలైతే ఇంకా ఎక్కువ ఆసక్తి ఎవరికైనా కలిగే అవకాశం, సృజనకారులుగా మారే వెసులుబాటు, ఇలా తెలుగు అన్ని స్థాయిల్లో కొత్త తరాలకు విద్యాబోధన అంశంగా ఉన్నప్పుడే సాధ్యం. దీనికి అనుగుణంగా మన విద్యావ్యవస్థలో సవరింపులు చేస్తే, అప్పుడు తెలుగు చదివేవారు సమాజంలో సంఖ్యాపరంగా పెరుగుతారు. మాకు తెలుగు రాదు అని చెప్పుకునే దశలో ఉండరు. ఇది కనీసం రెండు తరాల కాలం పట్టే ప్రక్రియ.

> **నన్నయ లోకం కన్నా మన లోకం నేడు వెయ్యేళ్ళ తరువాత చాలా పెద్దది. కానీ, ఆయన ఏర్పరచిన లక్ష్యమే నేటికీ సాహిత్యానికి గొప్పది. అంతకు మించి మనం ఏమీ కొత్తగా చెప్పలేకపోయాము. 'విశ్వశ్రేయం కావ్యం' అన్నాడాయన ఒక వ్యాకరణ పుస్తకంలో. 'ఏ భాష వారైనా, భాష క్షుణ్ణంగా ఎరిగి లోకోపకారి అయిన కావ్యం రాయాలి' అన్నది ఆయన సూచన. సామాజిక నిబద్ధత ఉండాలా అంటే, మనం నన్నయను ఉదహరిస్తే చాలు. అభివ్యక్తి మార్పులను పూర్వ తరాలపై తిరుగుబాటుగా చూడటం పాత పద్ధతి. అప్పటి వారు అభివ్యక్తిలో, ఇతివృత్త శక్తిలో వేసిన దారులు మరింత విస్తరింప చేయడమే ఏ కొత్త తరంలోనైనా జరిగేది. ఇది ఎంత మహత్తరంగా జరిగింది అన్నదే కలుపుగోలు దృష్టి.**

చదువరులు పెరగాలంటే ఎలాంటి సాహిత్యం రావాలి?

సాహిత్యం సమాజంలో పలు వర్గాలవారు పాల్గొనే ఒక మాధ్యమం అవుతుంది. అత్యధిక ప్రజల జీవన న్యాయాన్ని కోరడం ద్వారా, నేటి రాజకీయ వ్యాపార నియంతలు కడుతున్న ఆధిపత్య, అణుబాంబుల వంతెనలు దాటి మానవుడి ముందర ఉన్న ఎన్నో సహస్రాల జీవన ధ్యాసను తెలుగు రచయితలు సజీవంగా ఉంచగలరు. వేర్వేరు జీవన రంగ నైపుణ్యాలు, ఆయా రంగాలకు చెందిన వారైతే బాగా చెప్పగలరు. అటువంటి స్వీయ స్వరాలు నమోదు చేయవలసిన ఇరవయ్యో శతాబ్దపు ఎన్నో వృత్తి పరమైన రంగాల గురించి తెలుగు రచయితలు సృజనాంశాలుగా రాయవలసిన విశ్వశ్రేయస్సే. మనమే కాదు ప్రపంచంలోనే ఇవాళ ఎక్కువగా రాస్తున్న విషయాలివి. ఇప్పుడు రాయవలసినంత విశాలంగా రావడం లేదు అన్నది ఒక స్థితి. జీవన సంక్లిష్టతలను కావ్యాలు చేయలేని అసహాయత ఎక్కడుందో ఆలోచించడం కూడా మన బాధ్యతే.

నాటక దర్శనం

మన నాటక ప్రక్రియ ఎంతలా ఇరవయ్యో శతాబ్దంలో వికాసం చెందింది, ఇవాళ మనం క్షుణ్ణంగా పట్టించుకోవలసి ఉన్నది. వాడుక భాషలో కథలు, కవితల రచనకు ముందరే మన నాటక రచనను చిలకమర్తి, గురజాడ, తిరుపతి వేంకట కవులు, బలిజేపల్లి వంటివారు రంగస్థలాన్ని దృశ్యప్రబంధ వేదికలుగా మలిచారు. ఈ దారిలో తరువాతి దశాబ్దాల్లో తెలుగు నాటకం ఇంకొందరు నాటక శిల్పుల ద్వారా ఎంత దూరం నడిచిందో చూడడం కూడా 2018లో మన పరిశీలనకు సిద్ధంగా ఉన్న సజీవ సమాచార వాహిని.

నవలకు పునరుజ్జీవం

నవల నానాటికీ చిన్నదై కేవలం నూట ముప్ఫై పేజీలే అని ప్రచురణకర్తలు చెప్పడం, అవున్లే అని రచయితలు అనుకునే పరిస్థితి ఒక్క తెలుగు నవలా సాహిత్యంలోనే ఉన్నది. ఈ పరిస్థితి బాగుపడేందుకు కూడా మనం దారులు వెతకాలి. వట్టికోట, మహీధర, వుప్పల వంటి విలక్షణ నవలాకారుల కోసమని రంగం ఏర్పాటుచేయాలి.

విమర్శ జీవద్వంతం కావడం ఎలా?

ఒక సిద్ధాంతం నేపథ్యం నుంచి చెప్పడం ఎంత ముఖ్యమో, ఒక రచన కళాత్మ బాధ్యతలను ముతకగా నిర్వహించినప్పుడు ఆ మాటలు స్పష్టంగా చెప్పలేని మొగమాటాల్లో ఉన్న తెలుగు విమర్శ, కొత్త అవలక్షణాలుగా, మితిమీరిన ప్రాంతీయదనాలు, సామాజిక పరిష్కార కోణాలను పరిగణించని అస్తిత్వ ప్రాధాన్యతా ధోరణులు, వీటిలో ఎప్పుడూ ఒక లోముట్టడిలో బతుకుతున్నది. దీన్నుంచి విడుదల కావాలంటే, విశ్వభాషల సాహిత్య విస్తృత అధ్యయనం విమర్శకుడికి రచయిత కన్నా ఎక్కువ అవసరం. ఎందుకంటే సమాంతర, తులనాత్మక చిత్రం గీసి, రచయితలు ఎక్కడ వెలిగారో, ఎక్కడ మలిగారో చెప్పాలంటే, తెలుగుకు ఉన్న విమర్శ దీపకాంతులు, చిన్నవిగా కాక పెద్దవి కావాల్సిన అవసరం ఉన్నది.

బాలసాహిత్యం

తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషల్లో ఈ త్రి-భాషా పత్రిక నడపడం ప్రభుత్వానికి గల దూరదృష్టికి మంచి ఉదాహరణ కావచ్చు. ఐక్య రాజ్య సమితి కూడా ఆనందించి ఈ కృషిలో మనకు సహాయపడవచ్చు. ఈ ప్రోత్సాహక విధానం భాషలో రచనా సామర్థ్యాలను చిన్నప్పట్నుంచీ అభివృద్ధి చేయడమే కాక, నేటి బాలలే రేపటి పౌరులు, కళాకారులు, రచయితలు అని చాటిచెప్తుంది. ప్రతిదీ లాభనష్టాలతో నడవదు. లక్షల సంఖ్యలో ఉన్న ప్రైవేటు స్కూళ్లకు వివిధ స్థాయిల్లో అనుమతులిచ్చిన ప్రభుత్వం ఒక అనుబంధ ఆదేశంగా, ప్రతి స్కూల్ కనీస ధరకు, ఒక యాభై పత్రికలు కొనాలని ప్రభుత్వ ఆదేశాలు ఉంటే, ఈ పత్రిక కొన్ని వేల కాపీలు పిల్లలకు, లైబ్రరీలకు అందుబాటులో ఉంటుంది.

విశ్వభాషగా తెలుగెలా?

దేశ భాషలందు తెలుగు లెస్స అనుకుంటున్న, చెప్పుకుంటున్న స్థాయినుంచి విశ్వభాషలందు తెలుగు లెస్స అనేలా, ప్రభుత్వాలే ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల్లో కొన్నింటిలోనైనా తెలుగు పీఠాలు ఏర్పాటుచేయాలి. తద్వారా అక్కడి ఆ దేశ విద్యార్థులకు తెలుగు ఒక బోధనాంశంగా డిగ్రీ, పీజీలో పరిశోధనలు ఉండేలా, వారికి అక్కడే మనం తిరిగి ఉద్యోగావకాశాలు ఇచ్చేలా ప్రభుత్వ స్థాయి ఒప్పందాలు, భాషా, సాహిత్య, సాంస్కృతిక స్థాయి సంయుక్త కృషికి బాటలు వేయాలి. అన్నీ 2018లో చేసేస్తామని కాదు - భాష, ఆ భాషలో సాహిత్యం, అది ప్రతిఫలించే సాంస్కృతికత కుంటుపడ్డ దశలో మనం ఉన్నాం. అందుకే ఆలోచనలు పెద్దగా చేయాలి. ఇవి నెరవేర్చడం ఒక ఎరుకగల సమాజ పౌరులు, వారెన్నుకున్న ప్రభుత్వాల బాధ్యత. విశ్వభాషగా ఎదగాలంటే ప్రయాణం పెద్దదే. మరి కృషిబద్ధులమౌదామా?

- రామతీర్థ, 9849200385

స్వాగతిద్దాం

నూతన సంవత్సరానికి స్వాగతిస్తూనే
నూతన ఆలోచనల సరళిని కూడా
స్వాగతమివ్వాలి
నూతన సంవత్సరమంటేనే హృదయం నిండా
నూతన భావాలతో కూడిన ప్రణాళికలను
సిద్ధపరచుకోవడం
కొత్త ఆశయాలకు జన్మనివ్వడం

ప్రతి ఉషోదయం హృదయాన్ని
ఆనందపరుస్తున్నప్పుడు
ప్రతి సంవత్సర ఆరంభం కూడా హృదయాన్ని
రంజింపజేస్తుంది
ఎందుకంటే ప్రతి మనిషి మార్పును కోరతాడు
నూతన సంవత్సరం జీవితంలో మార్పులు
తెస్తుందనీ
కలలు సాకారమవుతాయనే ఆశయంతో
కలిగి వుంటాడు

ఎప్పుడైతే హృదయం నిండా మబ్బులు
కమ్ముకుంటాయో
ఆ హృదయంలో జన్మించే ఆలోచనలకు అవరోధం
నల్లని వస్త్రంలా కప్పబడి వుంటుంది
ఎన్ని మబ్బులు అడ్డొచ్చినా సూర్యుడు మాత్రం
తనంతట తాను ఆ మబ్బుల తెరలను
చీల్చుకుంటూ
నూతన కిరణాలతో ప్రకాశిస్తాడు

అలాగే మనిషి కూడా హృదయంలోని
మబ్బు తెరలను చీల్చుకుంటూ
నూతన ఆలోచనలకు జన్మనివ్వాలి

తలపండిన రాజకీయ నాయకులు
ఎప్పుడూ మభ్యపెట్టే కొత్త కొత్త ఆలోచనలను
ఆవిష్కరించుకుంటారు
ఎందుకంటే ప్రజలను ఎప్పుడూ భ్రమలో
ఉంచడమే వారి విప్లవ ప్రయత్నం

ప్రజలు కూడా ఎప్పుడూ నూతన భావాలను
నూతన ఆలోచనల సరళిని పుణికిపుచ్చుకోవాలి
లేనిచో ఎక్కడ వేసిన తాళం
అక్కడే చిలుము పట్టడం ఖాయం

అందుకే నూతన సంవత్సరానికి
స్వాగతిస్తున్నప్పుడు
నూతన ఆలోచనల సరళిని కూడా
స్వాగతమివ్వాలి

- మొహ్మద్ నసీరుద్దీన్, కరీంనగర్

సాధిద్దాం

కలం, గళం
కలగలిస్తే చైతన్యం

చైతన్యం చేవతో చచ్చిపోదా
సమస్య చిన్నదై

కాలం, కార్యం జోడిస్తే
జయం నీదే

నడిచి వచ్చేకాలం
నీ జయమై, నీలో విజయనాదమై
వచ్చే వత్సరమొస్తుంది వడి వడిగా
నూతన సంవత్సరమొస్తుంది
నూతనోత్సాహంతో
స్వాగతిద్దాం - సాధిద్దాం

- వెంకటేష్, కరీంనగర్



వ్యూహం

8

అలపర్తి రామకృష్ణ

అర్జెంటుగా డాక్టర్స్ కాన్ఫరెన్స్ హాల్‌కు రమ్మని డాక్టర్ లోహితకు ఫోన్ చేశాడు కాశి.

కాన్ఫరెన్స్‌హాల్‌కు వెళ్లింది.

అప్పటికే అందరూ డాక్టర్లు వచ్చి కూర్చున్నారు.

టేబుల్‌మీద డాక్టర్ మౌర్య ఫొటో పెట్టివుంది. ఆ ఫోటోకు డాక్టర్ అరవింద్ గులాబీ పూల మాల వేశాడు. లోహితకు సైగ చెయ్యడం ఆమె వెళ్లి కుందులలోని వొత్తులు సరిచేసి దీపారాధన చేసి మౌర్యకు నమస్కరించింది.

''ఫ్రెండ్స్ డాక్టర్ మౌర్య మన గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో దాదాపు పది సంవత్సరాలు పనిచేశారు. ఎఫిషియంట్ డాక్టరుగా పేరు తెచ్చుకున్నారు. మరో రెండు నెలలు ఆగితే ఆయనను మన మేనేజింగ్ ట్రస్టీలో పార్ట్‌నర్‌గా తీసుకునేవారు. మంచి రైపెన్డ్ స్టేజిలో వున్నపుడు అకస్మాత్తుగా స్విమ్మింగ్ పూల్‌లో ప్రాణాలు వదలడం అందరినీ నివ్వెరపరుస్తూ వుంది. మై డీపెస్ట్ కంటోలెన్స్ టు ద డిపార్టెడ్ సోల్ అండ్ టు ద బిలీవడ్ ఫ్యామిలీ మెంబర్స్.. రేపు నేను మౌర్య స్వగ్రామం వెళ్లి ఫ్యామిలీ మెంబర్స్‌ను కలిసి పది లక్షల చెక్ ఇచ్చి వస్తాను'' అన్నాడు డాక్టర్ అరవింద్.

అందరూ లేచి నిలబడి రెండు నిమిషాలు మౌర్య ఆత్మశాంతికి నిశ్శబ్దం పాటించారు.

కాన్ఫరెన్స్ హాల్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ''ఆయనకు బాగా స్విమ్మింగ్ వచ్చు.. స్విమ్మింగ్ పూల్‌లో నీళ్ళలో మునిగిపోవడం ఏమిటి?'' అనుమానం వ్యక్తపరిచాడు డాక్టరు.

''ఈమధ్య డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. ఆ మత్తులో స్విమ్మింగ్ పూల్‌లో దిగి వుంటాడు.. మునిగిపోయి వుంటాడు.. మనిషి జీవితం ఎంత? నీటి బుడగలా ఒక్క క్షణం.. నదిలో నావ వెళ్తున్నపుడు నీటి చార కొన్ని క్షణాలు కన్పిస్తుంది. ఆ తరువాత నావ వెళ్లిన గుర్తే వుండదు. నీటిమీద రాత రాసి నావ వెళ్లిపోయినట్లుగా మనిషి జీవితం కూడా అంతరించిపోతుంది'' వేదాంత ధోరణిలో పడిపోయాడు మరో డాక్టర్.

❖❖❖

డాక్టర్ లోహిత పనిచేస్తున్న హాస్పిటల్ చూడాలనిపించింది స్కందకు.

ఆ హాస్పిటల్ మాఫియా గ్యాంగులు నిర్వహిచేదని అతనికి తెలుసు. హాస్పిటల్లో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని కూడా తెలుసు.

వాళ్ళ ఆట కట్టించాలంటే ఆధారాలు కావాలి.

శత్రువు బలమైనవాడు.. వాళ్ళ ఆలోచనలు నిక్రుష్టమైనవి.. పేదలకు వైద్యం అనే ముసుగులో అమాయకుల శరీరభాగాలు అమ్ముకుంటున్నారు. వాటిని బయటపెట్టాలంటే ఎంతో చాకచక్యంగా ఇన్వెస్టిగేషన్ కొనసాగించాలి. బలమైన శత్రువు కోటలోకి అడుగుపెట్టినపుడు ఎంతో జాగరూకతతో వుండాలి!

తను ఎవరో వాళ్ళకు తెలిస్తే తన ప్రాణాలు తీసేయడానికి వెనుకాడరు. పటిష్ఠమైన వ్యూహంతోనే తను ముందడుగు వెయ్యాలి!

లోహిత ఉండే కాటేజ్‌కు వెళ్లి కాలింగ్ బెల్ నొక్కాడు.

డోర్ తీయగానే ఎదురుగా కన్పించిన స్కందను చూసి ''వాట్టై సర్‌ప్రైజ్! ఉదయాన్నే ప్రత్యక్షమయ్యారు'' అంది లోహిత.

కాఫీ కప్పు ఇస్తూ ఏదో మాట్లాడబోయింది లోహిత.

మాట్లాడవద్దన్నట్లు సైగ చేశాడు.

అతని చూపులు టెలిఫోన్ వున్న టేబుల్ క్రింది వైపు, సీలింగ్‌పైన, గోడలవైపు మళ్ళాయి.

ఆమెను కాటేజీలోనుంచి బయటకు తీసుకువెళ్ళాడు. చెట్టు క్రింద నిలబడ్డారు.

''నీ ఫోన్ టాప్ చేశారు.. నువ్వు ఎవరితో మాట్లాడినా హాస్పిటల్ విషయాలు మాట్లాడకు!''



అదెలా కుదురుతుంది? నర్సులు, ఇతర డాక్టర్లు నాతో మాట్లాడుతూ వుంటారు హాస్పిటల్ సంగతులు'' అందామె.

''నా ఉద్దేశ్యం అది కాదు.. హాస్పిటల్లోని లోటుపాట్లు, అవకతవకల గూర్చి ఇతరులతో చర్చించకు. నీ క్వార్టర్‌లో నువ్వు ఎవరితో మాట్లాడినా సర్వైలెన్స్ రూములో వున్న టేపుల్లో రికార్డు అవుతాయి. హాల్లో సిసిటివి కెమెరా కూడా వుంది. నీ గదిలోకి ఎవరు వస్తున్నారో వాళ్ళకు తెలిసిపోతుంది'' అన్నాడతను. మొదటిసారిగా భయపడిందామె. ప్రజలకు సేవ చేసే హాస్పిటల్లో సిసి టివి కెమెరాలు ఎందుకు? టెలిఫోన్ టాప్ చెయ్యాల్సిన అవసరం ఏముంది?

పులి గులోకి వచ్చినట్లుగా వొణికిపోయింది.

''అధైర్యపడాల్సిన అవసరంలేదు. హాస్పిటల్లో జరిగే వ్యవహారాలు గమనిస్తూ వుండి.. వ్యక్తిగతంగా కలిసినపుడే వివరాలు నాకు చెప్పాలి! టెలిఫోన్‌లో నాతో మాట్లాడొద్దు!.. మరోచోట మళ్లీ కలుద్దాం!'' అన్నాడతను.

హడావుడిగా వెళ్లిపోయాడు స్కంద.

❖❖❖

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అర్థరాత్రి దాటేకా కారులో వెళ్ళాడు స్కంద.

అతని తల్లి మానస న్యూజెర్సీలో డాక్టరు. ఆమెను రిసీవ్ చేసుకోవడానికే ఎయిర్‌పోర్టుకు వెళ్లాడతను. తెల్లవారు జామున మూడింటికి వచ్చింది ఫ్లయిట్. చెకింగ్ పూర్తి అయి బయటపడేసరికి మరో గంట పట్టింది.

ఎరైవల్ గేటు దగ్గర కన్పించిన కొడుకును చూడగానే ఆమె ఉద్వేగంతో ఊగిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతడిని హత్తుకుపోయింది.

''పెద్ద టయోటా కారు తీసుకురమ్మన్నాను. తీసుకొచ్చావా? లగేజ్ అంతా సర్దుకు వచ్చేశాను.. మళ్లీ అమెరికా వెళ్ళను'' అంది మానస కన్నీళ్ళు తుడుచుకుంటూ.

''అమెరికా నుంచి వచ్చిన ప్రతిసారీ మళ్లీ వెళ్ళనని చెబుతావ్. ఆరు నెలలు కాగానే ఇక్కడ ఎండలకు తట్టుకోలేకపోతున్నాను.. అమెరికా వెళ్ళిపోతున్నానని అంటావ్'' అన్నాడతను, ఆమె చేతిలోని లగేజ్ ట్రాలీని తీసుకుని ముందుకు నెట్టుతూ.

''ఈసారి అలా కాదు.. నాలుగైదు తరాలకు సరిపడా ఆస్తిపాస్తులు సంపాదించాను. అందరికి దూరంగా ఎన్నాళ్లని అక్కడ వుంటాను'' అందామె.

నవ్వొచ్చింది ఆమె మాటలకు.

''మీది సంపన్న కుటుంబం. నాన్నగారిది సంపన్న కుటుంబం. పెళ్లి చేసుకుని సంవత్సరం తిరక్కముందే విడిపోయారు. సుఖంగా వుండటానికి అవసరమైనవి కనుక్కోవడానికి సంపద ఉపయోగపడుతుంది గాని, సంపద సంతోషాన్ని కల్గించదు'' అన్నాడతను.

స్కంద తండ్రి ప్రస్తావన తీసుకురావడం నచ్చలేదామెకు.

- ఇంకాఉంది



మంచిమాట

శరణాగతరక్షకుడు



తిరుప్పావై 16వ పాశురం నాయక నాయ్‌నిన్ఱ

నాయకనాయ్‌నిన్ఱ నందగోపనుడైయ
కోయిల్ కాప్పానే కోడి త్తోన్ఱుమ్ తోరణ
వాయిల్ కాప్పానే మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్
ఆయర్ శిఱుమియరో ముక్కు అఱై పఱై
మాయన్ వణివణ్ణన్ నెన్నలే వాయ్ నేర్‌న్దాన్
తూయోమాయ్ వన్దోమ్ తుయిలెళ ప్పాడువాన్
వాయాల్ మున్నంమున్నం మాత్తాదే అమ్మా నీ
నేయ నిలైక్కదవం నీక్కు ఏలో రెమ్బావాయ్

భావం: ఈనాటి 16వ పాశురం నుండి 30వ పాశురం వరకు గల పదిహేను రోజులు తిరుప్పావైలో మూడవ దశగా చెప్పబడుతున్నది. ఇదే అనుభవ దశగా ఉన్నది. ఈనాటి పాశురంలో, ఆశ్రయ దశను పూరితచేసుకున్న గోపికలు నందగోపుని భవనానికి చేరి, భవన ద్వార పాలకుని మేల్కొలిపి తలుపు తెరవమని ప్రార్థిస్తారు.

నందగోప కులానికే నాయకుడిగా ఉన్న నందగోపుడి భవనాన్ని రక్షించే ద్వార పాలకుడా శ్రీకృష్ణుడు అష్టాక్షరి మంత్రం. ఆ మంత్రమే నందగోపుడి భవనము. దాన్ని రక్షిచేంచేవాడా అని, అతనికి గల గొప్పదనాన్ని గుర్తుచేస్తున్నారు గోపికలు. ఆ భవనానికి శ్రీకృష్ణపరమాత్మ నిలయమైన ఆలయానికి జెండాతో ప్రకాశిస్తూ, తోరణములతో ఒప్పుచున్న ద్వారాన్ని నిరంతరం రక్షించే పుణ్యాత్ముడివి అని ప్రశంసిస్తున్నారు గోపికలు. ప్రణవ మంత్రం 'ఓంకారం' అదే జెండా! ఓం నమో నారాయణాయ నమః అనే శరణాగతిలోని 'నమః' నేను కాదు. నాకు నేను రక్షకుడిని కాదు ఆ పరమాత్మనే అని శరణాగతి చేయండి అని సంకేతించే పచ్చ తోరణాలు ఉన్నాయి. ఆ జెండాతోబాటు ఆ తోరణాన్ని జాగ్రత్తగా రక్షించి కర్తవ్యాన్ని నిర్వహించే నీవెంత ధన్యుడివి! భవనములోని మణికవాటము యొక్క గడియతీయాలి. మేము కూడా శరణాగతి చేసిన వాళ్ళమే. గోప బాలికలైన మాకు, మాయావియైనవాడు, నీలమేఘము వంటి ప్రకాశవంతమన మణి వర్ణము గలవాడైన కృష్ణుడే స్వయంగా ధ్వని చేసే పర అనే వాద్యాన్ని మాకిస్తానని నిన్ననే వాగ్దానం చేశాడు నీవేం సందేహించక తలుపు తీయి అంటున్నారు గోపికలు.

మేము పరిశుద్ధులమై (అంతఃకరణం, శరీరం రెండూ) ఆ పరమాత్మడి గుణగానం చేయడానికై వచ్చామయ్యా! (నిన్ను ఇంతగా అర్థిస్తున్నాం, అనుగ్రహించాలి) నీవే ముందుగా నోటితో కాదని చెప్పక, దగ్గరగా లాగి ఉన్న ఆ దృఢమైన తలుపులు దయతో తీయాలి సుమా అని అర్థిస్తున్నారు గోపికలు భవన ద్వార పాలకుడిని.

ఆండాళ్ తిరువడిగళే శరణమ్

- డాక్టర్, పరవస్తు కమల

శ్రీ సాయి లీలామృతం



112

- జంగం శ్రీనివాసులు 837 489 4743

నన్ను నమ్ము'అని చెప్పాడు మహిల్సాపతి.

మహిల్సాపతి చెప్పిన మాటలను విన్నతరువాత బాలక్‌రామ్ లో కొద్దిగా మార్పు వచ్చింది. సరే నేను నా పనిని చేస్తాను. అనుకొని తన రోజువారి పనుల్లో పడ్డాడు. ఒకరోజు ఆయనకు ముంబాయికి వెళ్లవలసి వచ్చింది. సాయికి నమస్కరించుకొని ముంబాయి వెళ్లడానికి రైల్వేస్టేషన్ కు వెళ్లాడు. అక్కడ టికెట్ల దగ్గర జనం కిక్కిరిసి ఉన్నారు. తనకు టికెట్టు దొరుకుతుందని అనిపించలేదు. ఎలా చేయాలో ఏమిటో అక్కడ తప్పనిసరిగా నేను హాజరు కావాలి కదా. బాబా నీవే దిక్కు అని మనసులో అనుకొన్నాడు. కొద్దిసేపటికి ఒక ముసలాయన రగ్గుకప్పుకుని తన దగ్గరకు వచ్చాడు.అతడు అడుక్కోవడానికి వచ్చాడేమో అనుకొన్నాడు బాలక్‌రామ్. అందుకే అతడి వైపు చూశాడు. అతడు 'బాబూ నీవు ముంబాయి వెళ్లదలిచావా. నేను వెళ్లాలని టికెట్టు తీసుకొన్నాను. కాని నాకు వేరే పని పడింది. నేను వెళ్లడం కుదరడం లేదు. నీకు అవసరమైతే ఈ టికెట్టు తీసుకొంటావా ' అని అడిగాడు.

బాలక్‌రామ్ కు ఎక్కడ లేని సంతోషం వేసింది. 'తీసుకొంటాను తాతా. నీకు డబ్బులు ఇస్తాను' అంటూ టికెట్టు తీసుకొన్నాడు. 'నాకు డబ్బు అక్కర్లేదు కాని బాబూ ముంబయిలో అనాథ పిల్లలు నీ దగ్గరకు వస్తారు. నీవు విసుగు కొనక వారికి నీకు తోచినసాయం చేయి చాలు'అన్నారు.

'అదికాదు ఇదిగో' అంటూ జేబు లోంచి డబ్బు లు తీసి లెక్కపెట్టి ఎదురుగా చూసేసరికి దూరంగా పోతూ ఆ ముసలాయన కనిపించాడు. ఇంతలో అంత దూరం ఎలా వెళ్లాడా అని మళ్లీ చూసేలోపు దూరంగా నుంచి సాయి బాబా నవ్వుతూ కనిపించారు. కళ్లు నులిమి మళ్లీ చూస్తుంటే దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేసి 'బాలక్‌రామ్ సంశయాలను వదిలిపెట్టు.

నీవు చేయాల్సిన పనిని చేయి పనే దేవుడయ్యా. నిన్ను విడిచి నేను ఎక్కడికీ పోను.నీతోనే ఉన్నాను కదా'అన్నారు. బాబా చేతిస్పర్శకు పులకిస్తూ కారుతున్న కన్నీళ్లను తుడుచుకొంటూ పక్కకి తిరిగి చూసేసరికి అక్కడ ఎవరూ లేరు.

ఇదంతా బాబా మహిమ నే అనుకొని బాలక్‌రామ్ ముందుకు వెళ్లాడు. బాబా ఇచ్చిన టికెట్టుతో ముంబయి బయలుదేరాడు. ముంబయిలో దిగి దిగగానే ఓ పదిమంది పిల్లలు చుట్టుముట్టి అనాథ బాలలకు సాయం చేయమని అడిగారు. బాలక్‌రామ్ అక్కడ తాను చేయవలసిన పని గురించి ఆలోచిస్తూ 'ఛీ ఛీ .. ఎందుకింతమంది.. జరగండి జరగండి' అంటూ వారిని తప్పించుకొని ముందుకు వెళ్లాడు.

అంతే అక్కడే బాబా కనిపించి నాకు ఇచ్చిన మాటను మరిచావు. ముంబయి వచ్చేశావు కదా. అన్నారు. అదేంటి అని చూసేసరికి అక్కడ ఎవరూ లేరు. వెంటనే బాలక్‌రామ్‌కు తాను రైలు ఎక్కుతున్నపుడు జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది. ఎంత మతిమరుపువాడిని. నిన్ననే కదా బాబాకు మాటిచ్చాను. అనుకొంటూ జేబులో డబ్బులు చేతిలో పట్టుకొని ఆ పిల్లలు న్న దగ్గరకు పరుగెత్తి వెళ్లి వారికి ఇచ్చి ఇందాక తన ప్రవర్తనను మన్నించమని వారిని అడిగాడు. తిరిగి చూసేసరికి బాబా నవ్వుతూ వెళ్తున్నట్లు అనిపించింది. మళ్లీ చూస్తే అక్కడ ఎవరూలేరు. బాలక్‌రామ్ నిజమే. బాబా నాతో ఉన్నారు. నేను తప్పు చేసినపుడు, ఒప్పు చేసినపుడు కనిపించారు. నాతో నాలో ఉండేబాబాను నేను సదా గుర్తుంచుకోవాలి. బాబా చూపిన దారిలో నడవాలి అనుకొన్నాడు. బాలక్‌రామ్ మనసు ఎంతోప్రశాంతి పొందింది. కొంతమందికి సాయి నామస్మరణ చేస్తే వారికి వారి కష్టాలు దూరమయ్యేవి. మరికొంత మంది సాయి జీవిత చరిత్ర చదివితే మనశ్శాంతి దొరికేది. ఇలా ఎంతో మంది బాబాకరుణను పొందినవారు ఉన్నారు.

ఇలా ఎంతోమంది సాయి నామస్మరణతోను, సాయి జీవిత చరిత్ర, సాయిమహిమలు, సాయి లీలామృతాన్ని అనుభవించినవారు చెప్పగా విని సాయి భక్తులు గాథాని తమ తమ జీవితాలను ధన్యం చేసుకొన్నవారు ఉన్నారు. సాయితత్వాన్ని అర్థం చేసుకొన్నవారు ఎదుటివారిని దూషించరు. వారికష్టాలను తమ కష్టాలుగా భావించి వారి కష్టాలను బయటవేయడానికి చేతనైనంత కృషి చేస్తారు. ఇంకా ఎంతోమంది బాబా కృపకై ప్రతిరోజువారి స్మరించేవారు న్నారు. మనమూ ఆ సాయినాథుని అనుగ్రహాన్ని పొందడం కోసం ప్రతిరోజు సాయి నామస్మరణ చేసుకొందాం. సాయి చూపిన దారిలో నడుద్దాం.

జై సాయిరాం.

సమాప్తం

నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము



సీ. పద్మలోచన సీసపద్యముల్ నీమీదఁ
జెప్పఁబూని తివయ్య చిత్తగింపు
గణయతి ప్రాసలక్షణముఁ జూడను లేదు
పంచకావ్యశ్లోక పఠనలేదు
అమరకాండ త్రయం బరసి చూడగలేదు
శాస్త్రీయ గ్రంథముల్ చదువలేదు
నీ కటాక్షంబున నే రచించితిఁగాని
ప్రజ్ఞనాయదిగాదు ప్రస్తుతింప

తే. తప్పుపడనేమి సద్భక్తి తక్కువౌనె
చెఱకునకు వంక పోనమి చెడునె తీపి?
భూషణ వికాస! శ్రీధర్మ పుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ నరసింహస్వామీ! కమలనేత్రా! నేను నీమీద సీసపద్యాలను చెప్పాలనుకున్నాను.దయతో స్వీకరించు. చంధోనియమాలైన గణయతి ప్రాసల్ని పాటించలేదు. పంచకావ్యాలు, అమరం, శాస్త్రాలు చదువలేదు. నీ దయని ఆసరగా గ్రహించి ఈ కృతి వ్రాసినాను. అంతేకాని నా తెలివితేటలేవీ లేవు. చెరకుగడ వంకరగా పెరిగినా దాని తీపికి లోటేమీ కల్గనట్లే, ఈ కృతిలో ఏవైనా తప్పులు దొర్లినా నా భక్తికి లోపమేమీ లేదుసుమా. అని శతకకారుడు కోరుకుంటున్నాడు. వ్రతం చెడినా ఫలం దక్కాలి అంటే భక్తి మెండుగా ఉండాలి. అందుకే సీసపద్యాలనే పుష్పాలను సమర్పిస్తాను. కాని అందులో ఏదైనా లోపం ఉంటే దాన్ని మన్నించి తన్ను అనుగ్రహించమని నారసింహస్వామిని కవి కోరుకుంటున్నాడు.

మాటాట : 1526

నిర్వహణ: సుధామ

1		2		■	■	3
	■		■	4		
5		■	6		■	
■	■	7	■		■	■
8	■	9		■	10	11
12			■	13	■	
	■	■	14			

ఆధారాలు

అడ్డం:
1. ఏడాది చివర
4. సంబరం
5. కాంతి
6. దిగులు
9. వేగము
10. దారి
12. సుముహూర్తం
14. పోవననుజ్ఞ

నిలువు:
1. వస్త్రము
2.పోయేటప్పుడు ఉత్తరాది వారి కొందరి మాట , పలకరింపుక కూడాను
3. మత్తు
4. వడి
7. భిన్నాంకమునందు హారమునకు పైను ండి అంకె, లేశము
8. సమయము
11. విడిచిపెట్టు , లూజ్
13. ఇవాళ

మాటాట - 1525 సమాధానం

1 వా	■	2 ర	3 మ	ణు	లు	■
రా	■	■	స్త	■	■	4 ప
5 శి	6 ప్ర	■	కం	■	7 ఆ	టా
■	8 వ	డి	■	9 శి	వ	రాం
10 ధ	ర	■	11 భీం	■	శి	■
న	■	■	సే	■	■	12 త్ర
13 ము	రు	గ	న్	■	14 తా	వు

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు ఆభరణాలు ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు.సంఘంలో గౌరవం పెరుగుతుంది.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణ తొలిగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్యబాధలుండును. బంధు మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
అనుకూల స్థాన చలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు నెరవేరుతాయి. దూరబంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశీయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
బంధుమిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ధననష్టమేర్పడే అవకాశం ఉంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
విదేశీయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్యబాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధన నష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
బంధుమిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. అన్ని విషయాల్లో విజయాన్ని సాధిస్తారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. స్త్రీలమూలకంగా లాభం ఉంది. ఆరోగ్యం మెరుగవుతుంది.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. ఋణ బాధలు తొలగును.వృత్తి ఉద్యోగరంగాల్లోని వారికి అభివృద్ధి ఉంటుంది.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా ఉంటారు. ప్రయత్నకార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తిప్రతిష్ఠలు అధికమవుతాయి.విందులు వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ధనలాభముంది. రాజకీయ రంగంలోనివారికి, క్రీడాకారులకు అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధుమిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు.

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కష్టాలనుంచి గట్టెక్కించే కరుణామూర్తి

శనేశ్వరుని గురించి తెలియని వారుండరు. శనికి ప్రీతి కలిగించాలని శనేశ్వరుని వల్ల బాధలు ఉండకూడదని శనేశ్వరునికి తైలాభిషేకాలు, శనికి ప్రదక్షిణలు చేస్తుంటారు. శని పూజలను కూడా చేస్తారు. తిలలు దానం చేస్తుంటారు. ఇంకా కొంతమంది అయ్యప్ప పూజ చేస్తే శని సంతోషిస్తాడని మాలదీక్షలు కూడా చేపడుతారు. వేంకటేశ్వరుని పూజిస్తే వేంకటేశ్వర వ్రతం చేస్తే కూడా శని ప్రీతి చెందుతాడని ఆ కలియుగ దేవుని వ్రతమూ చేయిస్తుంటారు.

అట్లాంటి శనేశ్వరునికి ప్రత్యేక ఆలయాలు చాలా ఉన్నాయి. ప్రతి ఆలయంలో నవగ్రహ మండలాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ నవగ్రహాలలో ఏడవ వాడైన శనీశ్వరుడు. సూర్యభగవానునికి ఛాయాదేవికి కలిగిన కుమారుడని శనేశ్వరుడని ప్రఖ్యాతి. మనసారా పూజించి ఆరాధించే భక్తులను కష్టాల నుంచి గట్టెక్కించే కరుణామూర్తి శనేశ్వరుడని అంటారు.



పావగడశనేశ్వర స్వామి

శనేశ్వరుడు కొలువు తీరిన క్షేత్రాల్లో మహిమాన్వితమైన క్షేత్రమే పావగడ. దేశంలో ఉన్న ప్రముఖ శనైశ్చర స్వామివారి క్షేత్రాలలో పావగడ కూడా ఒకటి. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లాలో ఉన్న ఈ దివ్య క్షేత్రంలో సాక్షాత్తు శనేశ్వర స్వామివారు, శీతల అమ్మవారు కొలువై భక్తుల చేత నిత్య నీరాజనాలందుకుంటున్నారు. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాలను ఆవిష్కరించే కొండల నడుమ ఉన్న ఈ దివ్య క్షేత్రం శ్రీ శనేశ్వరస్వామి లీలా విశేషాలతో, మహత్వాలతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

సత్యం, న్యాయం శనీశ్వరుని రెండు కళ్ళు.

పూర్వకాలంలో ఈ ఆలయం ఉన్న ప్రాంతంలో ఒక సాధువు శనేశ్వరస్వామి వారి పటాన్ని ఉంచి పూజలు నిర్వహిస్తూ కాలం గడిపేవాడట. అయితే స్వామి వారి దృష్టి తమపై పడకూడదనుకున్న భక్తులు ఈ క్షేత్రానికి వచ్చి దూరంనుంచే స్వామివారిని దర్శించుకునేవారట. తర్వాత కట్టా కృష్ణయ్య శెట్టి, ఎ.నర్సింగరావు అనే భక్తులు విరాళాలు సేకరించి స్వామివారికి ఒక చిన్న మందిరాన్ని కట్టించారట.

ఈ ప్రదేశంలో నివసిస్తున్నవారు ఈ శనేశ్వర స్వామిదర్శనం చేసుకొన్నందుననే తమ సుఖసంతోషాలు లభిస్తున్నాయని అనుకొన్నారు. వారంతా ప్రతిరోజు స్వామిని దర్శించడం తమ దైనందిన కార్యంగా పెట్టుకొన్నారు. స్వామి వారి ఆదేశంతో ప్రఖ్యాత శిల్పకారుల సహకారంతో నిర్మించిన నవగ్రహాలను తిప్పయ్య అనే భక్తుడి నేతృత్వంలో ప్రతిష్టించడం జరిగింది. ఆనాటి నుంచి నేటివరకూ ఈ ఆలయం దినదిన ప్రవర్ధమానమవుతూనే ఉంది.

ఈ శనేశ్వరస్వామి దర్శించుకుందామనుకొని ఇక్కడికి వచ్చిన భక్తులు ఓం శనైశ్వరస్వామినే నమః

సత్యశక్తి స్వరూపం.......
సంకట హరణం దేవాం
శనీశ్వరాం ప్రణమామ్యహమ్

అంటూ భక్తిశ్రద్ధలతో ప్రణామాలు అర్పిస్తారు అంటూ ప్రధానాలయంలోకి చేరుకుంటారు. ఆలయంలో ముందు గా ప్రధానాలయానికి వెలుపల శని దేవుని మూర్తి ఒకటి దర్శనమిస్తుంది. ఇదే ఆలయంలో మరోపక్క పంచముఖ ఆంజనేయస్వామి వారు విచ్చేసిఉన్నారు.

గర్భాలయం వెలుపలి ప్రాంగణంలో శనీశ్వరస్వామి, జ్యేష్టాదేవి దర్శనమిస్తారు.

. స్వామివార్లకిచ్చిన కర్పూర హారతిని కళ్ళ కద్దుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు.

శనీశ్వరస్వామి గర్భాలయానికి మరోపక్క శీతలామాత ఆలయం ఉంది. ఈ ఆలయానికి ముందు చండి, ప్రచండి మూర్తులున్నారు. ప్రధానాలయంలో ఎడమవైపున సత్యనారాయణస్వామి, కుడివైపున వినాయకుడు, దత్తాత్రేయుని మూ ర్తుల దర్శనం లభ్యమౌతుంది. గర్భాలయంలో శ్రీ శీతలా మాత వారి దివ్య మంగళ రూపం భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది.

పావగడ శ్రీ శనైశ్చరస్వామి ఆలయంలోని స్వామి వారికి తిల తైలాభిషేకాలతోపాటు అఖండ హారతి నిర్వహిస్తే సమస్త గ్రహ బాధలనుంచి శని దేవుడు విముక్తి కల్గిస్తాడని భక్తులు నమ్ముతారు.

స్వామి దర్శనం, పూజానంతరం తమ గ్రహదోషాలు, శనిపీడలు, ఇతరత్రా బాధలను, బరువులను స్వామివారి సమక్షంలో విడిచి పెడుతున్నామంటూ వెండి దండాలను చేతబూని స్వామివారి గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అనంతరం ఆయా దండాలను స్వామివారికి సమర్పిస్తారు. ఇలా చేయడం వల్ల తమ గ్రహ బాధలను, ఇతర కష్టాలను దూరమవుతాయన్న నమ్మకంతో ఈ సంప్రదాయాన్ని ఇక్కడ పాటిస్తారు.

ఈ ఆలయంలో శని త్రయోదశికి, శని జయంతికి విశేషమైన పూజలు నిర్వహిస్తారు.

-గున్న కృష్ణమూర్తి

పావగడ క్షేత్రానికి దారిదే

ఈ దివ్య క్షేత్రాన్ని చేరుకోవడానికి అనంతపురం జిల్లా హిందూపురం వరకు వచ్చి అక్కడనుంచి మరో వాహనంలో చేరుకోవచ్చు. అలాగే కళ్యాణదుర్గం నుంచి అరవై కిలోమీటర్ల దూరంలో అలరారుతున్న ఈ దివ్య క్షేత్రం చేరుకోవడానికి ప్రయివేటు బస్సులు, కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ బస్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఆలయ దర్శనం సత్వగుణ శోభితం



మన సనాతన హిందూ ధర్మ సంప్రదాయంలో ఏ పని చేసినా దానికో ప్రత్యేకత - విశిష్టత ఉండడం సహజం. మనం భగవంతుని దర్శించడానికి ఆలయ దర్శనం చేసుకొంటూ ఉంటాం. అన్నింటా తానై ఉన్నప్పటికీ దైవాన్ని మనం ప్రత్యేకమైన ఆలయాల్లో దర్శనమూర్తిగా కొలువై ఉన్నాడని నమ్ముతాం. ఆ ఆలయాలకు వెళ్లి దైవాన్ని దర్శించుకొంటాం. అలా ఆ శుద్ధసత్వగుణ స్వరూపుణ్ణి దర్శించుకోవడానికి మనం ముందుగా శారీరిక శుద్ధిని పాటిస్తాం. ఆ తరువాత మనస్శుద్ధిని పాటిస్తాం. పరిశుభ్రమైన వస్త్రాలను ధరించి, నుదుట తిలక ధారణ చేసుకొని నిష్కల్మషమైన మనస్సుతో భగవంతుని సేవకు బయలుదేరాలి. ఏ ఆలయానికి వెళ్లినా ముందు ధ్వజస్తంభం దర్శించుకుంటాం. ఆ తరువాత భగవంతుని రూపాన్ని కళ్లారా చూసుకొని మనసా ,వాచా, కర్మణా అంతా నీవే స్వామీ మమ్ము రక్షించు అని ప్రార్థిస్తాం. మనకు తోచిన విధంగా పత్రం, తోయం, పుష్పం ఇలా దేనినైనా భగవంతునికి సమర్పిస్తాం.

అయితే వీటి అన్నింటికన్నా మన మనస్సును ఎంత సేపు వీలైతే అంతసేపు భగవంతునిపై ఏకాగ్రం చేయాలి. భగవంతుని తత్వాన్ని ఆకళింపు చేసుకోవాలి. ప్రతిమనిషిలోను అసలు ప్రతి జీవిలోను పరమాత్మ అంశ ఉన్నదని ప్రతివారినీ భగవంతుని రూపుగా భావించాలి.

అట్లాకాక ఏదో మొక్కుబడిగా తోసుకొంటూ, తిట్టుకుంటూ భగవంతుని ఆలయానికి రావడం ఏదో ఒక విధంగా దేవుని దర్శించడం, అక్కడ కూడా వారి వారి అహంభావాలను ప్రదర్శించడం చేస్తే భగవంతుని దర్శించిన ఫలితం ఏమీ మనకు అందదు.

పూర్వకాలంలో చాలామంది భక్తిభావంతోనే జీవించేవారు. అంతా భగవంతుని మాయ అనుకొనేవారు. కాని రాను రాను మనిషి ఆలోచనల్లో మార్పు వస్తోంది. విదేశీ సంస్కృతులను ఒంట బట్టించుకుంటున్నారు. వారు కూడా పనిని దైవంగా భావిస్తారు. కాని ఇక్కడ మిడిమిడి జ్ఞానజీవులు అంతటికీ కారణం మేమేననుకొని గర్వం పెంచుకుంటున్నారు. మన ఆచార సంప్రదాయాలను, సనాతన ధర్మాలను విస్మరిస్తున్నారు.

ఇట్లాంటి జరగకూడదని మన పెద్దలు పండుగలు, పర్వదినాల పేరిట ఉత్సవాలు జరిపేవారు. వాటిని అర్థం చేసుకొంటే ఎన్నో అంతరార్థాలు కనిపిస్తాయి. పండుగలు జరుపుకోవడం వల్ల అటు ఆనందమూ, ఆరోగ్యమూ చేకూరుతుంది. ఉత్సవాలను జరిపించడం వల్ల ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుంది. ఒకరికొకరుగా జీవించడం అలవడుతుంది. ఆ ఉత్సవాలలో హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియా విశేషాలు ఉండేవి. వాటి వల్ల మన పూర్వీకుల గొప్పతనాలు వారి చేసిన దానాది కార్యక్రమాలు ఎన్నో తెలిసేవి.



అన్నింటిలోకి ముఖ్యంగా జనులందరూ దేవుని బిడ్డలుగా భావించేవారు. వారిలో తరతమభేదాలు పొడచూపేవికావు. గర్వాంధకారం కలిగేది కాదు. ప్రతివారిలో సేవాభావం నెలకొనేది. ఇట్లాంటి వన్నీ ఆలయ దర్శనం వల్ల అక్కడ జరిగే ఉత్సవాలు, ఊరేగింపులు, ప్రసాద వితరణలు, జానపద విశేష ప్రదర్శన వల్ల తెలుస్తాయి. కనుకనే ఇపుడు కూడా నేటి యువత ఆలయ దర్శనం చేసుకొని అందులో దాగి ఉన్న పరమార్థాలను అర్థం చేసుకోవాలి.

- కురవ శ్రీనివాసులు

అఘాసురుడ్నీ హతమార్చాడు..!

శ్రీకృష్ణామృతం

చరణ శ్రీ


ఇలా రోజులు ఆనందంగా గడుస్తున్నాయి. కాని రాక్షసులకు వైరభావం పెరుగుతూనే ఉంది. అఘాసురుడను రాక్షసుడు కృష్ణుడి గురించి తెలుసుకొన్నాడు. ఎలాగైనా తన సోదరుని చంపిన కృష్ణుని సంగతి తేల్చాలని అనుకొన్నాడు.

ఒకసారి, కృష్ణుడు, గోపాలురు అందరూ కలసి వనవిహారానికి వెళ్లినట్లు గోవులను తీసుకొని వెళ్లి వాటిని రోజంతా మేపుకొని తిరిగి ఇంటికి వస్తున్నారు. వారికి దారిలో ఒక పెద్ద కొండచిలువ నోరు తెరుచుకొని పడుకుని ఉండడం కనిపించింది. దాన్ని వారంతా చూశారు. వారికి ఎక్కడాలేని నవ్వు వచ్చింది.

వారంతా పకపకా నవ్వుతూ ఒరేయి మన దగ్గర కృష్ణుడు ఉన్నాడు కదా. నిన్నమొన్ననే కదా బకాసురుని మట్టు పెట్టాడు. ఎంతమంది రాక్షసులు కృష్ణుని దగ్గరకు వచ్చినా వారంతా యముని దగ్గరకు వెళ్లుతూనే ఉన్నారు కదా. ఈ కొండ చిలువకు ఆ విషయం తెలిసినట్లు లేదు. పెద్ద పెద్ద రాక్షసులే తోక ముడిచి పారిపోతుంటే కదలలేని ఈ కొండచిలువ తానే మహా గొప్ప అన్నట్టు దారికడ్డంగా పడుకొంది. మనం మన దారి వెంట వెళ్దాం. అది మనలను ఏమీ చేయలేదు అనుకొన్నారు.

వారిలో కొంతమంది అరే ఈ కొండ చిలువ నోరు ఆకాశమంత ఉన్నట్టు ఉంది. ఎందుకైనా మంచిది. మనం వేరే దారి చూసుకొందామా అనుకొన్నాయి. మళ్లీ అట్లా అన్నవాళ్లే ఏమీ అక్కర్లేదు. మనతో కృష్ణుడు ఉన్నంత వరకూ మనలను ఎవరూ ఏమీ చేయలేరు. ఒకవేళ బ్రహ్మే దిగి వచ్చినా అతడూ మనలను ఏమీ చేయలేడు. పదండి ముందుకు పదండి. ఒకవేళ ఇది పిచ్చి వేషాలు వేసిందా మన వెనుక ఉన్న కృష్ణుడు దీని ఊపిరి తీసేస్తాడు. సరి పోతుంది. బిక్కచచ్చి చస్తుంది. మనలను ఏం మన్నా చేయాలని చూసిందా దాని పని సరి ధైర్యంగా అడుగులు వేయండి సుమా అంటూ ముందుకు పోతున్నారు.

మరలా ''ఓ కృష్ణా ! ఇదిగో చూడు ఇక్కడ చూడు ఇక్కడొక కొండ చిలువ నోరు తెరుచుకుని మన దారికి అడ్డుగా ఉంది. ఇక్కడే నీవు ఉన్నావని దీనికి తెలియనట్లు ఉంది. మేమే అనుకుని మమ్మల్ను భయపెడదామని అనుకొంటున్నట్టు ఉంది. నీవు మా వెనుకనే ఉన్నావని దీనికి చెప్పు.'' అంటూనే ముందుకు పోతున్న గోపాలురును కొండచిలువ రూపంలో బకాసురుని తమ్ముడు అఘాసురుడు మరింత పెద్దగా నోరు తెరిచి వారినందరినీ మింగివేయాలనుకొని ముందుకు జరిగాడు. వెనుకనంచి చూస్తున్న కృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. అయ్యో నేనున్నాననుకొంటూ వీరు ఆ రాక్షసుని నోటిలోనికి వెళ్లుతున్నారే... ఇపుడు వీరంతా ఇంటికి వెళ్లకపోతే వీరి అమ్మలంతా ఏమైపోతారు. వీరిని నేను రక్షించి తీరాల్సిందే కదా.. అమ్మో అనుకొంటూ తాను కూడా గబగబా అడుగులు వేస్తూకొండచిలువ నోటిలోకి అడుగు పెట్టాడుఅప్పటిదాకా మన్ను తిన్న పాములాగా పడుకుని ఉన్న అఘాసురుడు 'ఇపుడు నా పని



సులువు అవుతుంది. కృష్ణుడే తనంతట తాను వస్తున్నాడు. నా అన్నను చంపడం ఇతనికి సులభం అయింది. కాని నేను కంసుడు పంపగా వచ్చాను. పైగా నా అంత బలవంతులు, నేర్పరులు ఎవరూ లేరు. ఇపుడు చూడు తెలివి వీరిని అంతా ఒక్కఉదుటన మింగివేస్తాను. అపుడు కృష్ణుడు ఈ అర్భకులు అందరినీ గుటుక్కుమనిపిస్తాను. అనుకొంటూ మరింత నోరు తెరిచాడు. కొండచిలువ నోటిలోకి అడుగుపెట్టిన కృష్ణుడు గొంతు దగ్గర నిలబడిపోయాడు. తన శరీరాన్ని కూడా అమితంగా పెంచసాగాడు. కొండ చిలువ నోరు గొంతు ఎంత పెద్దదిగా ఉందో అంత పెద్దదిగా తన శరీరమూ పెంచేసాడు. కొండ చిలువ కృష్ణుడిని మింగలేక కక్కలేకపోయింది. అందరికీ ఊపిరి ఆడకుండా చేస్తానన్న కొండ చిలువ తనకే ఊపిరి అందక కొట్టుమిట్టాడింది. ఆ కొండ చిలువ కడుపులోని వాయువులన్నీ సంచరించే వీలు లేక విపరీతమైన వత్తిడితో కొండ చిలువ శరీరాన్ని పగులగొట్టుకొని బయటకు రావడానికి సిద్ధమౌతున్నాయి. కాని కృష్ణుడు మాత్రం చిరునవ్వుతూ నిలబడే ఉన్నాడు. కొండ చిలువకు అర్థమైంది. తాను కృష్ణుడిని చిక్కించుకోవడం కాదు. ఆయన్ను తాను మింగడం కాదు. ఆయనే తన్ను మింగివేశాడని. కృష్ణతత్వం అర్థమైంది. తాను మింగాననుకొన్న గోపాలురను ఒక్కసారి చూసింది. వారంతా కృష్ణుని వీరత్వాని కథలుగా చెప్పుకుంటూ నవ్వుతున్నారు. తాను ఎంత అధముడో కొండచిలువకు అర్థమైంది. అంతలో అఘాసురుని లోపల వాయువులన్నీ ఒక్కసారిగా తలనుంచి వివిధ భాగాలల్లో ఉన్న శరీరాన్ని పగులగొట్టుకొంటూ బయటకు వచ్చేశాయి. అంతే కొండచిలువ నేలకూలింది. కళ్లు తేల్చింది. వాయువులతో పాటు వచ్చిన గోపాలురు చచ్చిన కొండ చిలువను చూసి బాగయ్యింది. మాకే అడ్డువస్తావా.. మేమేమంటే ఎవరనుకొన్నాము. మాకు కృష్ణుడికి తేడా ఉందా. మమ్ము ఇబ్బంది పెడితే మా కృష్ణయ్య చూస్తూ ఊరుకొంటాడా. '' దా కృష్ణా ! ఇంటికి వెళ్దాం. మన అమ్మలంతా ఇంకా రాలేదేమీ అంటూ మనకోసం ఎదురుచూస్తుంటారు. నీ వీరత్వాన్ని ఈ కొండ చిలువ అఘాయిత్యాన్ని వారికి చెప్దాం దాదా అంటూ కృష్ణుడి చుట్టూ చేరి కొండ చిలువ దురహంకారాన్ని తిడుతూ కృష్ణుని మెచ్చుకుంటూ ముందుకు వెళ్లుతున్నారు. వాళ్లందరినీ చూసి బ్రహ్మాది దేవతలు పుష్పవృష్టికురిపించారు. ఆహా ఈ గోపాలుర అదృష్టమే అదృష్టం. పరమాత్మ వీరికి ఏమాత్రం భేదం లేదు సుమా అనుకొన్నారు. రంభాదులు ఆనందంతో నృత్యం చేస్తున్నారు.

⁂

ధర్మాచరణే మోక్షానికి మార్గం

ప్రకృతిలో భాగమైన మానవుడు తన జీవన పథం కూడా ప్రకృతికి అనుగుణంగా ఉంటాలనే కృతజతాభావనతో ఉంటాడు. మానవుని ఉనికిని ఒక పవిత్ర అంశంగా ఈ పుడమిపై స్థిరపరిచినాడు. సృష్టి, స్థితి,లయమనే అపూర్వ విషయాలను తన ఏకాగ్రచిత్తంతో అనంతమైన మనో ప్రపంచంలో శోధించి సాధించారు మన ఋషులు. హిందూ ధర్మం సర్వజనీనము, మానవ శ్రేయస్సుకు మూలం ఒక్క సనాతన ధర్మమే. ప్రకృతి నుండి మానవుని ఆవిర్భావ మనే విశ్వాసమే బహు దేవతారాధనకు దారితీసింది. భూమాత, వాయుదేవుడు, అగ్నిదేవుడు, నారాయణుడు, విశ్వం, ఆదిత్యుడు, చంద్రుడు, నవగ్రహాలు, ఇవన్నీ దేవతారూపాలుగా ఈనాటికి పూజలందుకుంటున్నాయి. దీనివెనుక మానవుని గొప్ప అణుకువ తత్త్వం నిండి యుంది.



పాశ్చాత్యతత్త్వవేత్తలు హిందువులను, బహుదేవతలను కొలిచే ఏకత్వ దైవ దర్శకులని కొనియాడారు. హిందూ ధర్మమనే మతానికి మూలం వేదనిధి. దీని నుండి వ్యక్తమైన పురాణ ఇతిహాసాలు, ఉపనిషత్తులు, దర్శనాలు మొదలైనవి మనకు దిశానిర్దేశం చేస్తున్నాయి.

ఆర్యావర్తనంలో జన్మించిన ప్రతిమనిషికి వీటిపై అచంచల విశ్వాసం ఉండడం వలననే హైందువులు తరతరాల నుండి అర్థవంతమైన ఆనందయుతమైన జీవనాన్ని గడుపుచున్నారు.

చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామ మోక్షాలు జీవనసారాన్ని అందిస్తున్నాయి.

కోరికలను ధర్మానుసారంగా తీర్చుకుంటేనే మోక్షానికి అర్హుడని పురాణాలు చెబుతున్నాయి. వానప్రస్థాశ్రమంలో మోక్షానికి వేదిక ఏర్పాటు చేసుకొని సన్యాసాశ్రబంలో అనంత వైరాగ్యంతో పడిపోవడమే గమ్యమని అదే మోక్షమని దారి చూపింది మన సనాతన ధర్మం.

ఆత్మను తెలుసుకొనే జ్ఞానాన్ని మనకందించింది హైందవం. జనన మరణాలను తృణప్రాయంగా భావించే ఆత్మజ్ఞానాన్ని అందించిన హిందూ ధర్మ మార్గం విశ్వాసమనే దైవ భావనతోగాఢంగా ముడి వడి ఉంది. త్రిగుణాత్మకమైన ఈ ప్రకృతిలో సత్వ గుణ ప్రాధాన్యతతో పరమాత్మను ఎలా చేరుకోగలమో చెప్పింది. సచ్చిదానందంలో ఎలా మునిగి తేలాలో బోధించింది. సగుణోపాసనతో నిర్గుణోపాసనకు దారిచూపింది. ఆ నిర్గుణంతో ముక్తిని పొందే మార్గం సుగమమం చేసింది.

పరోపకారాయ పుణ్యాయ పాపాయ పరపీడనం అని పరోపకారమే పుణ్యప్రదమని పరపీడనమే పాపమని వేదాల సారాంశంగా హైందవం హెచ్చరించింది. పరాత్పరునిపై విశ్వాసమే ఊపిరిగా నిలిపి సచ్చిదానందాన్ని పొందే సనాతన మార్గానికి దారి హైందవ ధర్మమే.

అహింసను పాటించేవాడు, నిస్వార్థంగా శుభ కర్మలను ఆచరించేవాడు, భగవంతుని చేరే మత మార్గాన్ని తాను విశ్వసిస్తూ ఇతరుల విశ్వాసానికి భంగం కలిగించని వాడు చేరే పరమపదంలో ఉండేది ఒకే దేవుడు ఆయన భగవాన్ మహావిష్ణువు.

- వారణాశి వెంకట సూర్యకామేశ్వరరావు


గృహస్థాశ్రమంలోనే ఓర్పు, క్షమ...

మీ ధర్మపత్ని, మీవారసులు వీరందరికీ మీరు చేయవలసిన కర్తవ్యాన్ని విడిచి మీరుతపస్సులో ఉన్నందువల్ల మీకు తెలియకుండానే మీలో అసహనమూ, కోపం వచ్చింది. మీరు తపశ్శక్తిని సాధించినా కోపాన్ని జయించలేకపోయారు. మీ కర్తవ్యాన్ని నిర్వర్తించి ఉంటే, గృహస్థాశ్రమంలో మీరు ఉండి ఉంటే మీలో సహనం, క్షమ, ఓర్పు అనేగుణాలు వచ్చి ఉండేవి. దానివల్ల మీకు ప్రశాంతి కలిగేది అంటూ ధర్మవ్యాధుడు ఎన్నోవిషయాలు కౌశికునకు చెప్పాడు.

ఓర్పు, క్షమ, లేకపోతే ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగినా, ఎన్ని పుణ్యకథలు విన్నా, ఎంత తపస్సు ఆచరించినా కూడా అది మంచి ఫలితాన్ని ఇవ్వవు. ఓర్పు లేనందున తృటిలో కోపం కలిగి ఆ కోపం వల్ల వివేకం నశించి చివరకు చేసుకొన్న పుణ్యాన్ని కాస్త కోపం చెరిపేస్తుంది.

నిజమే కాని, ఇంత ధర్మం తెలిసి ఉండి పర ధర్మాన్ని ఎందుకు ఆశ్రయించారు. అది ఎపుడో నాకు చెప్పండి అని అడిగిన కౌశికునకు ధర్మ వ్యాధుడు తన పూర్వజన్మ గురించి చెప్పనారంభించాడు.

పూర్వజన్మలో నేనొక బ్రాహ్మణుడిని. నేను వేదం చదువుకున్నాను. నా వృత్తివిద్యను పూర్తిగా నేర్చుకున్నాను. కాని, నాకు ఆ రాజ్యమేలే రాజు, కుమారుడు నాస్నేహితుడు. అతనితో కలసి నేను ధనుర్విద్యను కూడా నేర్చుకున్నాను. ఆ ధనుర్విద్య వల్ల రాజకుమారుడు



పురాణ వ్యక్తులు - పూర్వజన్మలు

నేను ఒకరోజు మృగయావినోదానికి వెళ్లాము. అక్కడ మేమిద్దరమూ ఎన్నో జంతువులను చంపాము. ఎంతో ఆనందంగా తిరిగాము. చివరలో శబ్దభేది విద్యతో నేనొక బాణ ప్రయోగం చేశాను. ఆ బాణం వెళ్లిన కొద్దిసేపటికే ''అమ్మా''అన్న కేక విని నేనూ రాజకుమారుడు పరుగెత్తి వెళ్లాము.

అక్కడ జరగరాని ఘోరం జరిగిపోయింది. నేను వేసిన బాణం ఒక మునివృత్తిని అవలంబించి తపస్సు చేసుకొంటున్న తపశ్శాలికి తగిలింది. అతడు నన్ను చూడగానే క్రుద్ధుడయ్యాడు.

ఒక సద్బ్రాహ్మణ వంశంలో జన్మించికూడా శూద్రుని వలె వ్యవహరించావు కనుక నీవు మాంసాన్ని విక్రయిస్తూ జీవించెదవు కాక అని శపించాడు.

నేను విచారగ్రస్తుడినయ్యాను. వేదనతో ఆ తాపసి ఎన్నోవిధాలుగా వేడుకున్నాను. నా తప్పిదాన్ని మన్నించమని అడిగాను. కాని చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందేగదా

ఆ శాపఫలితమే ఈ ధర్మవ్యాధుని జన్మ. కాని ఈ ధర్మవ్యాధుని పుట్టుకకు మరో కారణమూ ఉంది.

కారణం లేనిదే కార్యం లేదు కనుక ఆ ముని నాకు ఒక వరాన్నిచ్చాడు. నీవొక దేశపు రాజుగా కూడా పుట్టావు. ధర్మవ్యాధునిగా ఉన్నప్పుడు నీకు తల్లిదండ్రులకు సేవ చేసుకొనే భాగ్యం దొరుకుతుంది. నీకు పూర్వజన్మ జ్ఞానముండి ధర్మసూక్ష్మగ్రహణ చేయగల శక్తి ఉంటుందని ఆ ముని నాకు వరాన్నిచ్చాడు. కౌశికుని మనసు చదివేశక్తి ఉన్న ధర్మవ్యాధుడు అయ్యా నేను రాజుగా ఏమి చేశానో కూడా మీకు నేను వివరిస్తున్నాను అని కౌశికుడు ఇంకా ఏమీ అడగకముందే చెప్పాడు.

ఎదుటివారి మనస్సు చదివే శక్తి నాకు తల్లిదండ్రులసేవ వలనే వచ్చింది మునివర్యా అని ధర్మవ్యాధుడు కౌశికునికి వివరణ ఇచ్చాడు.

- రాయసం లక్ష్మి

దివ్యపథగామిని ..మార్గళి

రవి, ధనుర్రాశిలో ప్రవేశించినపుడు వచ్చేది- ధనుర్మాసం. ధనూరాశికి అధిపతి - బృహస్పతి. జ్ఞానప్రదాత ఈ మాసంలో జగన్మాత గోదాదేవిగా విల్లి పుత్తూరులోని విష్ణుచిత్తునికి పూదోటలో లభ్యమైంది. ఆ విష్ణుచిత్తునికి తన ఆటపాటలతో అలరించింది. తనభక్తుని కోర్కె ఆ విధంగా తీర్చిందా తల్లి. ఇక పరమాత్మ తన దైవం అయిన స్వామిని భక్తవత్సలతను ప్రకటించడానికి విష్ణుచిత్తుని నోటి నుండి ప్రతిరోజు విష్ణుకథలను వినేది. తాను హరికథల పట్ల ఆకర్షితురాలవుతున్నట్టు విష్ణుచిత్తుని భ్రమింప చేసింది. ఆ తరువాత తన తండ్రితో పాటు ఈ మానవులందరికీ మార్గోపదేశం చేసి పరమాత్మ పై మనసును ఎలా నిలపాలో చెప్పాలని తలిచింది. ఆ తల్లి తనకు తానై తులసిని, పూలను సేకరించి మాలలు కట్టి తాను ధరించి వాటిని ఆ రంగని సేవకు పంపేది. అంతేకాదు ఆ తల్లి ద్వాపరయుగం లోని గోపికలు చేసిన కాత్యాయని వ్రత నెపంతో తాను కూడా మార్గళి వ్రతాన్ని చేసి చూపించింది. గోదా దేవి ప్రేమకు వశుడైన రంగనాథుడు విష్ణుచిత్తునికి స్వప్న దర్శనమిచ్చాడు. తానేనీకు అల్లుడిని అవుతానని మాటిచ్చాడు. రంగడు చెప్పినట్లుగా నే విష్ణుచిత్తుడు తన తనయ గోదాను వధువుగా అలంకరించి వివాహమహోత్సవాన్ని జరిపించాడు. ఆరోజు భోగాలను అందించిన భోగి పండుగ. ఆతల్లి విష్ణుదేవుని హృదయ పీఠాన్ని అలంకరించింది. అధివసించిన ఆ తల్లి విష్ణువుతో కూడా మానవులందరికీ ఆశీస్సులను అందచేసింది ఆ గోదాకల్యాణాన్నే స్మరించుకుంటూ ప్రతి ధనుర్మాసంలో కన్యలే కాదు ప్రతివారు గోదాపాశురాలను అనుసంధానిస్తారు. .గోదా రంగనాథుల అనుగ్రహం కావాలనుకొన్నవారంతా మార్గళీ వ్రతాచరణలు కావాలి. అపుడే ఆ తల్లి తత్వం అర్థమవుతుంది. భగవంతుని సాయుజ్యం లభ్యమవుతుంది. మానవునిగా పుట్టి దివ్యాచరణలతో మసలిన ప్రతివారికి విష్ణుసన్నిధి సులభంగా అందుతుంది.



- వాణి



ఫిబ్రవరి నుంచి మహేష్ కొత్త చిత్రం


కొరటాల శివ దర్శకత్వంలో ప్రస్తుతం మహేష్‌బాబు ఒక చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో నటించనున్నారు. ప్రస్తుతం ఆ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సెట్స్‌పైకి వెళ్లనున్నారు. ఊపిరి తర్వాత వంశీ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నారు. మహేష్‌బాబు కెరీర్‌లో 25వ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక ప్రస్తుతం జరుగుతుంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు.



కామెడీ రొమాన్స్‌తో..

సుధీర్‌బాబు, అతిథిరావుహైదరీ జంటగా శ్రీదేవి మూవీస్ పతాకంపై మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ రూపొందించిన చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. డిసెంబర్ 11 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిపారు. మరో షెడ్యూలు జనవరి 1 నుంచి ప్రారంభం కానున్నది. పేరు నిర్ణయించని ఈ చిత్ర వివరాలు త్వరలో తెలియజేయనున్నారు. సంక్రాంతికి టైటిల్ ప్రకటించి మేలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు మోహనకృష్ణ మాట్లాడుతూ, రొమాన్స్, కామెడీ కలగలిపిన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని కథానాయకుడు పిల్లల పుస్తకాలకు బొమ్మలు గీసే చిత్రకారునిగా నటిస్తున్నారని ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ చిత్రానికి పి.జి.వింద కెమెరా పనితనం హైలైట్‌గా నిలుస్తుందని తెలిపారు. నరేష్, తనికెళ్ల భరణి, నందు, రాహుల్, పవిత్ర లోకేష్, కాదంబరి కిరణ్ నటిస్తున్న ఈచిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, రచన-దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

ప్రేమాయణంలో దిశా పటాని!



కింగ్ ఫిషర్ క్యాలెండర్ నుంచి బాలీవుడ్.. అటు నుంచి టాలీవుడ్‌కు వచ్చిన దిశాపటానీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. తెలుగులో ఆమె నటించిన లోఫర్ చిత్రం సరైన ఫలితం ఇవ్వకపోవడంతో బాలీవుడ్‌లోనే మకాం వేసింది. బ్లాక్‌బస్టర్ హిట్ ఆమె ఖాతాలో లేకపోయినా, అవకాశాలు వస్తూనే వున్నాయి. ఇక మార్షల్ ఆర్ట్స్ హీరో టైగర్‌ష్రాఫ్‌తో ప్రేమాయణం నడుపుతూ నిత్యం వార్తల్లో వుండేందుకు ప్రయత్నిస్తోంది ఆమె. ఎవరికీ అంతుచిక్కకుండా వారు షికార్లు చేస్తున్నారట. తాజాగా నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోడానికి విదేశాలకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఒకరికి తెలియకుండా ఒకరు విదేశాలకు వెళుతున్నట్లు బిల్డప్ ఇచ్చి ఒకే ఫ్లయిట్‌లో టికెట్‌లు బుక్ చేసుకున్నారు. అదే సమయంలో ఎవరికివారు విమానాశ్రయానికి వచ్చి గుట్టుచప్పుడు కాకుండా విమానం ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా అక్కడే వున్న రణవీర్‌సింగ్ ఈ విషయాన్ని బయటపెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్‌లో వైరల్ అవుతున్నాయి. టైగర్‌ష్రాఫ్ సోదరి కృష్ణ ష్రాఫ్ దిశాపటానీకి దగ్గరి స్నేహితురాలు. ప్రేమికులు మాత్రం తమ తమ ఇళ్లలో ఈ వ్యవహారం చెప్పకపోయినా రెండు కుటుంబాలకు ఈ సంగతి తెలుసట. అందుకే ఇద్దరూ రెచ్చిపోయి మరీ ప్రేమయాణంలో మునిగిపోయారని కోలీవుడ్ అంటోంది!

క్రేజీ అవకాశాలతో అను



అందాల బొమ్మ అను ఇమ్మాన్యుయేల్ పేరు ఇప్పుడు టాలీవుడ్‌లో జోరు జోరుగా వినిపిస్తోంది. అతి తక్కువ సమయంలోనే క్రేజీ హీరోలతో చిత్రాలు చేస్తూ కెరీర్‌లో ముందుకు దూసుకెళుతోంది. తాజాగా పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌కు జోడీగా 'అజ్ఞాతవాసి'లో నటిస్తూనే, మరో పక్క ఎన్‌టిఆర్, నాగ చైతన్య, రామ్ చరణ్ చిత్రాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంది. కొత్త సంవత్సరం 2018లో ఆమె నటించిన చిత్రాలు వరుసగా సందడి చేయబోతున్నాయి. రామ్ చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని డి.వి.వి దానయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కొబ్బరికాయ కూడా కొట్టేశారు. ప్రస్తుతం రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం' పూర్తవగానే బోయపాటి చిత్రం కోసం రంగంలోకి దిగనున్నాడు చరణ్. ఈ చిత్రం కోసం కథానాయిక ఎంపిక పూర్తయింది. మొదట ఈ క్యారెక్టర్‌లో రకుల్ ప్రీత్‌సింగ్ అనుకున్నారు.

కుమార్తెలు వారసత్వంగా..



చలనచిత్ర రంగ పరిశ్రమలో కొడుకులనే కాక కుమార్తెలను సైతం నటనకు వారసత్వంగా, దర్శకత్వానికి, గాయకులుగా వారసత్వంగా కొత్తదనాన్ని ఆహ్వానిస్తుందని చెప్పవచ్చు. అందులో భాగంగానే సీనియర్ నటి లక్ష్మి కుమార్తె ఐశ్వర్య, మామగారు, బ్రహ్మ వంటి అనేక చిత్రాల్లో హీరోయిన్‌గా నటించింది. కొన్ని సినిమాల్లో విలన్ పాత్రలను సైతం పోషించింది. ఇంకా నటిస్తూనే వుంది. అలనాటి తమిళ అందాల నటుడు జెమిని గణేశన్ కుమార్తె 'రేఖ' హీరోయిన్‌గా హిందీ పరిశ్రమలో ఏలింది. క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలను పోషించింది. కమలహాసన్ కుమార్తె శృతిహాసన్ వివిధ భాషలలో హీరోయిన్‌గా నటించి ప్రాచుర్యం పొందింది. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వ శాఖలో ప్రతిభను చాటుతోంది. శరత్‌కుమార్ కుమార్తె విశాల్ హీరోగా నటించిన చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తెను హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు. అలాగే కలెక్షన్‌కింగ్ మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మీప్రసన్న హీరోయిన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ కుమార్తె మంజుల 'షో', ఆరెంజ్ వంటి చిత్రాలలో నటించారు. నటుడు ఉత్తేజ్ కుమార్తె హీరోయిన్‌గా పరిచయమైంది. అలాగే నాగబాబు కుమార్తె కొన్ని సినిమాలలో హీరోయిన్‌గా నటిస్తోంది. అక్కినేని నాగేశ్వరరావు మనవరాలు సుప్రియ సైతం పవన్‌కళ్యాణ్‌తో జోడీగా ఒక సినిమాలో నటించింది. అలాగే రాధిక వారసురాలిగా నిరోషా, భానుప్రియ వారసురాలిగా శాంతిప్రియ, విజయలలితకు వారసురాలిగా విజయశాంతి లేడీ అమితాబ్‌గా ప్రాచుర్యం పొందారు. అలనాటి నటి మేనక కుమార్తె కీర్తిసురేష్ ప్రముఖ హీరోయిన్‌గా తమిళ, తెలుగు, మలయాళ భాషల్లో రాణిస్తున్నారు. శ్రీదేవి కుమార్తె జాహ్నవి హిందీ పరిశ్రమలో అడుగిడుతోంది. హిందీలో శక్తికపూర్ కుమార్తె శ్రద్ధాకపూర్, ప్రియాంకా చోప్రా సోదరి పరిణితి చోప్రా, సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా సైఫ్ అలీఖాన్ వంటివారు వారసత్వ నటనకు శ్రీకారం చుట్టారు. అలాగే అలనాటి ప్రముఖ నటుడు రణధీర్‌కపూర్ కుమార్తెలు కరిష్మాకపూర్, కరీనాకపూర్, తనూజ కుమార్తె, హిందీ నటి కాజల్ ప్రముఖంగా ఉన్నారు. ఇంకా ఎందరో నటీనటులు తమ వారసులను క్యారెక్టర్ ఆర్టిస్టులుగా స్థిరపడే విధంగా దోహదపడ్డారు.

- అయినం రఘురామారావు



సీరత్ జోరు!

సెకండ్ ఇన్నింగ్స్ విజయవంతంగా పూర్తిచేస్తోంది సీరత్‌కపూర్. రాజుగారి గది-2 చిత్రంలో నాగార్జున సరసన నటించి మంచి అవకాశాలు పట్టేస్తుంది. అల్లు శిరీష్ నటించిన ఒక్క క్షణం చిత్రంలో ఆమె పాత్ర హైలెట్‌గా వుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో రవితేజ టచ్‌చేసి చూడు చిత్రంలో ఆమె క్యారెక్టర్ ఎలా వుంటుందోనని అభిమానులు ఎదురుచూస్తున్నారు. మాటల రచయిత శ్రీధర్ సీపాన దర్శకత్వంలో వస్తున్న చిత్రంలో కూడా ఆమె ప్రధానమైన పాత్రలో నటిస్తుంది. సినిమాలో ఆమె పాత్రే హైలెట్‌గా నిలుస్తుందని అంటున్నారు. కామిక్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. మొత్తానికి వైవిధ్యమైన పాత్రలతో యయజోరు మీద వుంది సీరత్‌కపూర్.

ఐష్.. ఐష్!



ఐశ్వర్యారాయ్ ప్రస్తుతం ఫ్యానీఖాన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం పూర్తికాక ముందే మరో రెండు చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో ఒకటి నర్గీస్ ద్విపాత్రాభినయం చేసిన రాత్ ఔర్ దిన్ చిత్రానికి రీమేక్‌గా వస్తున్నది. కల్ట్ క్లాసిక్ జోనర్‌లో రూపొందించిన ఆ చిత్రంలో నర్గీస్ చేసిన ద్విపాత్రాభినయం ఐష్ ఈ చిత్రంలో చేయనున్నది. అయితే ఈ సినిమాలో నటించడానికి ఉద్వేగంగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది ఐష్. సంజయ్ దత్ కూడా ఈ చిత్రానికి ఓకే చెప్పారట. యూరప్‌లో వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. రాత్ ఔర్ దిన్ సినిమాలో నర్గీస్ వరుణ, పెగ్గి అనే రెండు పాత్రల్లో అద్భుతంగా నటించారు.

సినీ మాయాలోకం!



సినిమా రంగం ఓ రంగుల కల. కొందరినీ అందలమెక్కిస్తే మరికొందరిని అధఃపాతాళానికి తొక్కివేస్తుంది. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న నానుడిని అక్షరాల పాటించే నటులు కొంతవరకు బాగానే వున్నారు. మరికొంతమంది పూటకు గడవని స్థితిలో తనువు చాలించిన వారెందరో మన కళ్ళ ముందే కనుమరుగయ్యారు. నాటి తరం సినిమా రంగానికి చెందిన నాగయ్య, రాజనాల, కాంతారావు, హరినాథ్, సూర్యకాంతం, సావిత్రి, పద్మనాభం లాంటి మహానటులు ఓ వెలుగు వెలిగారు. కొంతమంది స్వయం కృపారాధంవల్ల, మరి కొంతమంది అయినవారి మోసంవల్ల చివరి రోజుల్లో నానా కష్టాలు పడి మరణించిన సంగతి మనకు విదితమే. మరి కొంతమంది నటులు సినీ రాజకీయాలవల్ల ప్రతిభవున్న ఎదుగు బొదుగు లేకుండా క్యారెక్టర్ యాక్టర్ స్థాయిలోనే అలా వుండిపోయారు. ఇందులో నిజనిజాలు మనకు తెలియదు కాని నాణెనికి బొమ్మా - బొరుసు వున్నట్లు సినిమా రంగాన మనకు తెలవని చీకటి కోణాలు ఎన్నో ఎన్నెన్నో వున్నాయన్నది సినీ రహస్యం. సినీ వినీలాకాశంలో ఎందరో తారలు ఈ మధ్య అలా రాలిపోతున్నారు. వారు వెళ్ళిన మన కళ్ళ ముందే రోజూ కదలాడుతూనే ఉంటారు. ధర్మవరపు సుబ్రహ్మణ్యం, కొండవలస, యం.యస్.నారాయం, ఏవీయస్ లాంటి నటులు మరణించారు. వారిది సహజ మరణం. కాని ఆనాడు ఈనాడు సినీ రంగాన ఆత్మహత్యలు సర్వసాధారణంగా జరిగి పోతున్నాయి. కాని వారి మరణం వెనుక ఏవో అంతు చిక్కని రహస్యాలు. గతంలో... ఫటాఫట్ జయలక్ష్మి, సిల్క్‌స్మిత, దివ్యభారతి, ప్రత్యూష లాంటి వర్ధమాన తారలెందరో కనుమరగయ్యారు. యువ హీరో ఉదయ్‌కిరణ్ మరణం హృదయ విదారకం. స్వయంకృతం కొంతయితే తెరవెనుక శక్తులు అత ని కేరీర్‌ని నాశనం చేసారన్నది సినీ మాయానిజం. మొన్నటికి మొన్న కమెడియన్ విజయ్ సాయి మరణం వెనుక... ఎన్నో చీకటి కోణాలు. కారణాలేమైనా మరణం శరణం కాదు. సినిమానే జీవి తం కాదు. బ్రతకాలంటే ఎన్నో మార్గా లు ఈ జగాన. అవకాశాలు లేవని... ఈ చిన్న జీవితాన్ని చిదిమేయడం ధర్మం కాదు. సుఖాన్ని, కష్టాన్ని సమంగా స్వీకరించాలి. అదే జీవితం. ఈ సినీమాయలోకంలో ఎక్కె నిచ్చెనలే కాదు పడదోసే పాములుంటాయన్నది గ్రహించాలి. కొంతమంది నటులు కెరీర్ బాగా వున్న సమయంలో తమదికాని పాత్రల వైపు వెళ్ళి చేజేతులా కెరీర్ పాడుచేసుకొంటారు. ఉదాహరణకు గతంలో రాజబాబు, చలం, పద్మనాభం లాంటి మంచి హాస్టనటులు... హీరోలుగా సినిమాలు చేసి చేతులు కాల్చుకొన్నారు. ఈ మధ్య బ్రహ్మానం దం, అలీ, బాబూమోహన్ హీరోలుగా మారా రు. కాని నిజం తెలుసుకొని హాస్యనటులుగా బ్రహ్మాండంగా జీవిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే సునీల్, ధన్‌రాజ్, సప్తగిరి లాంటి వారు... హీరోలయ్యారు. సునీల్ హీరోకి తక్కువ, కమెడియన్‌కు ఎక్కువగా మిగిలిపోయాడు. ధన్‌రాజ్ కష్టపతి ఎదిగి మంచి కమెడియన్‌గా పేరు తెచ్చుకొన్నాడు. రెండు, మూడు సినిమాలు తీసి కష్టాలను కొని తెచ్చుకొన్నాడు. ఇక సప్తగిరి... ఎక్స్‌ప్రెస్‌లో వేగం లేదు. యల్.యల్.బి. పాస్‌కాలేదు. ఇలాగే వెళితే పరిశ్రమలో స్థానం శూన్యమైపోతోంది...అనడంలో సందేహం వలదని గ్రహించాలి.

సినీ రంగాన వచ్చిన అవకాశాలను అందుకొని ఎదగాలి. ఎంత ఎదిగినా అంత వొదిగి వుండాలన్నది ఇక్కడి నిజం. విలన్ స్థాయి నుండి ఎదిగిన మెగాస్టార్ కూడా అవకాశాలను... అందుకొన్నాడు. ఎవరికీ అందనంత ఎత్తులో వుండిపోయాడు. అలాగే శ్రీకాంత్, రవితేజ లాంటి నటులు సేమ్ అదే దారి రహదారి. మన హీరో జగపతిబాబు హీరోగా ఓ వెలుగు వెలిగాడు. అందరూ కనుమరగ్యాడు అని తలచిన వేళ... విలన్‌గా అవతారమెత్తాడు. ఏ పాత్రనైనా పోషించగలడు అని నిరూపించుకొని తన సత్తాతో నటుడిగా విశ్వరూపంతో అందరినీ అలరిస్తున్నాడు. ఒకనాడు అరవై, డెబ్బయి ఏళ్ళ హీరోలతో ముఖం వాచిన ప్రేక్షకులు కొత్త రక్తం యువ హీరోల ఎంట్రీతో పండుగ చేసుకున్నా రు. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లాంటి హీరోలు జనాల హృదయాల్లో ఎవరి స్థానం వారిది. ఇక్కడ ఎవరూ తక్కువ ఎక్కువ కాదు. ఎవరి ప్రతిభ వారిది. వీరి తర్వాత ప్రభాస్, అల్లు అర్జున్, రాంచరణ్, నాగచైతన్య, రానా, మహేష్, జూ.ఎన్టీఆర్, రామ్, నాని, శర్వానంద్ లాంటి యువ హీరోలు అలరిస్తున్నారు. వీరి తర్వాత మరెందరో వస్తుంటారు. అందరూ అందలమెక్కితే... మరి దానిని మరెవరూ మోస్తరు. తెరముందు వీరు హీరోలు... కాని తెరవెనుక హీరోలు... శ్రమించే శ్రామికులు సినీ కార్మికులు, వాళ్ళ కష్టాలు మనకు కన్పించవు. ఈ పరిశ్రమని నమ్ముకొని పూట గడవని వారు ఎందరో. ఏదో ఒక రోజు అవకాశం వస్తుందని... ఆశతో ఎదురుచూస్తూ వుండిపోతారు. అంతేకాని "ఆత్మహత్య" పరిష్కారం కాదు. ఈ సినిమా రంగమే ఓ మాయ, ఓ రంగులకల, అందమైన వలగా భావించాలి. ఈ మాయా ప్రపంచంలో అందరూ ఆట బొమ్మలే.

- కురువ శ్రీనివాసులు